23-9Pg1exHMNWJQE.qxd OK:23-9Pg1exHMNWJQE.qxd 1/1/02 7:38 AM Page 1

: fb.com/vaartha Digital
epaper.vaartha.com
WWW.VAARTHA.COM
శ్రీకాకుళం
Published from Srikakulam, Visakhapatnam, Vijayawada, Hyderabad, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem,

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

23-9-2026
బుధవారం
సంపుటి: 32
సంచిక: 234
పేజీలు: 16
వెల: 6.50

# ఏసియన్ గేమ్స్‌లో భారత్‌కు స్వర్ణం

## టి20 మహిళా క్రికెట్ విజేతగా టీమిండియా

ఫైనల్‌లో శ్రీలంకపై ఘనవిజయం

ఆసియా క్రీడల్లో భారత్‌కు తొలి గోల్డ్ మెడల్

మహిళా క్రికెటర్లకు రాష్ట్రపతి, ప్రధాని అభినందనలు



ఏసియన్ గేమ్స్‌లో మహిళల క్రికెట్‌లో టీమిండియా అదరగొట్టింది. టి20 ఫైనల్‌లో శ్రీలంకను మట్టికరింపించింది. బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 20 ఓటర్లలో 3 వికెట్ల నష్టానికి 216 పరుగులు చేయగా, శ్రీలంక 15.4 ఓవర్లలో 69 పరుగులకే ఆలౌటైంది. దీంతో టీమిండియా 147 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధిం చింది. గోల్డ్ మెడల్ సాధించింది. ఆసియా క్రీడల్లో భారత్‌కు తొలి స్వర్ణ పతకం ఇదే. అద్భుతంగా రాణించి బంగారుపతకాన్ని కైవసం చేసుకోవడంపై భారత మహిళా క్రికెటర్ల ప్రశంసలు వెల్లువెత్తాయి. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోడీ సహా రాజకీయ, క్రీడారంగ ప్రముఖులు అభినందించారు.



# స్మృతి మంధాన వరల్డ్ రికార్డు

## 11వేల పరుగుల క్లబ్‌లోకి భారత స్టార్ బ్యాటర్

మహిళల అంతర్జాతీయ క్రికెట్‌లో ఇదే తొలిసారి

భారత స్టార్ బ్యాటర్, వైస్ కెప్టెన్ స్మృతి మంధాన మరో అరుదైన ఘనత సాధించింది. అంతర్జాతీయ క్రికెట్‌లో 11,000 పరుగులు పూర్తి చేసిన తొలి మహిళా క్రికెటర్‌గా చరిత్ర సృష్టించింది. మహిళల క్రికెట్‌లో ఇప్పటివరకు ఏ బ్యాటర్ కూడా ఈ మైలురాయిని అందుకోలేదు. ఏసియన్ గేమ్స్ 2026 >>2




# దూసుకొస్తున్న వాయుగుండం

# రెడ్ అలర్ట్

## నేడు విశాఖ - గోపాల్‌పూర్ మధ్య తీరం దాటే అవకాశం

● మూడు రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు ● వాతావరణ శాఖ వెల్లడి ● ఉత్తరాంధ్రలో కుండపోత.. జనజీవనం అస్తవ్యస్తం ● సెంట్రల్ ఆంధ్ర, రాయలసీమలోనూ జోరు వాన ● అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసిన ప్రభుత్వం ● కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు.. రంగంలోకి సహాయబృందాలు ● నేడు పలు జిల్లాల్లో విద్యా సంస్థలకు సెలవు

**విజయవాడ, సెప్టెంబరు 22 ప్రభాతవార్త ప్రతినిధి:** బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం మరింత బలపడుతూ ఆంధ్రప్రదేశ్ తీరం వైపు వేగంగా దూసుకొస్తుంది. దీంతో సముద్రంలో అలల కల్లోలం మొదలైంది. ఉవ్వెతున్న ఎగసిపడుతున్నాయి. ఇక ఎపి వైపుకు వాయుగుండం దూసుకొస్తున్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. తీవ్ర వాయుగుండంగా బలపడనుండటంతో ఉత్తర కోస్తా తీరం వణికిపోతోంది. గంటకు 60 కిలోమీటర్ల వేగంతో వీచే పెనుగాలులు, కుండపోత వర్షాలతో విశాఖపట్నం- గోపాల్‌పూర్ మధ్య తీరం దాటే అవకాశాలు ఉన్నాయి. పశ్చిమమధ్య, వాయువ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన ఈ వాయుగుండం గడిచిన కొద్ది గంటలుగా గంటకు 18 కిలోమీటర్ల వేగంతో పశ్చిమ దిశగా పయనిస్తోంది. ప్రస్తుతం ఇది ఆంధ్రప్రదేశ్‌లోని కళింగపట్నానికి తూర్పుఆగ్నేయంగా 200 కిలోమీటర్లు, విశాఖపట్నానికి తూర్పుగా 290 కిలోమీటర్లు, అలాగే ఒడిశాలోని గోపాల్‌పూర్‌కు ఆగ్నేయంగా 200 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. రాబోయే 12గంటల్లో ఇది పశ్చిమవాయువ్య దిశగా కదులుతూ మరింతబలపడి తీవ్ర వాయుగుండంగా మారనుందని భారత వాతావరణ శాఖ అమరావతి కేంద్రం వెల్లడించింది. వాతావ రణ శాఖ తాజా అంచనాల ప్రకారం.. ఈ తీవ్ర వాయు గుండం బుధవారం రాత్రి లేదా గురువారం తెల్లవారు జామున కళింగపట్నం సమీపంలో తీరం దాటే అవకాశాలు ఉన్నాయి. దీనికితోడు ఆగ్నేయ అరేబియా సముద్రం నుండి కోస్తాంధ్ర మీదుగా వాయుగుండం ఉపరి తల ఆవర్తనం వరకు సగటు సముద్ర మట్టానికి 3.1 నుండి 7.6 కిలోమీటర్ల ఎత్తులో బలమైన ద్రోణి కొనసాగుతోంది. ఈ ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా రాగల మూడు రోజుల పాటు వాతావరణం పూర్తిగా మారిపోయి, విస్తారంగా వర్షాలు కురుస్తాయని అధికారులు తెలిపారు. అధికారిక సమాచారాన్ని అనుసరించి రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల కుండపోత వర్షాలు కురిశాయి. అత్యధికంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో 12 సెం.మీ వర్షపాతం నమోదైంది. కొత్తచెరువులో 9.8, గూడూరులో 9.2, మైలవరంలో 7.9, వీరఘట్టంలో 7.1, గోరంట్లలో 6.2, మదనపల్లెలో 5.8, బుట్టాయిగూడెంలో >>2



# పట్టణాలే గ్రోత్ ఇంజిన్లు

● వీకెండ్ ఎకానమీ పెంచేలా చర్యలు చేపట్టాలి ● అర్బన్ ప్రాస్పెరిటీ విభాగంగా పట్టణాభివృద్ధి శాఖను తీర్చిదిద్దాలి ● 2047నాటికి ప్రతి మున్సిపాలిటీ స్వర్ణ మున్సిపాలిటీ లక్ష్యం ● వచ్చే యేడాదికల్లా టిడ్కో గృహాలు పూర్తి.. జల్‌జీవన్‌మిషన్‌తో ఇంటింటికీ తాగునీరు ● మున్సిపాలిటీల అభివృద్ధికి రూ.50వేల కోట్ల పనులకు ప్రతిపాదనలు సిద్ధం ● పట్టణ స్థానిక సంస్థల్లో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ సభలో సిఎం చంద్రబాబు ● 123 మున్సిపాల్టీలు, కార్పొరేషన్లలో రూ.11,359 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం ● కుప్పం నుంచి వర్చువల్‌గా అభివృద్ధి పనులు ప్రారంభించిన ముఖ్యమంత్రి



**కుప్పం, సెప్టెంబరు 22 ప్రభాతవార్త:** పట్టణాలే అభివృద్ధి కేంద్రాలుగా మారుతున్నాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రజా ప్రతినిధులు, అధికారులు ఆ దిశగా కృషి చేయాలని సూచించారు. రాష్ట్రంలోని పట్టణప్రాంతాల రూపురేఖలు మార్చేలా రూ.11,359 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మంగళవారం కుప్పం నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా 123 మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో చేపట్టనున్న పనులకు ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారు.

ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు మాట్లాడుతూ ఇంత భారీ ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టి రాష్ట్ర మున్సిపల్ చరిత్రలో సువర్ణ అధ్యాయాన్ని లిఖించామన్నారు. రెండేళ్లుగా సంక్లిష్ట పరిస్థితులను అధిగమిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడిపిస్తున్నామని చెప్పారు. పట్టణ ప్రాంతాలు ఆర్థిక వ్యవస్థకు గ్రోత్ ఇంజన్లుగా మారేలా చర్యలు తీసుకోవాలని సిఎం సూచించారు. పట్టణాల్లో లివబిలిటీ మెరుగుపడటంతో పాటు ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణం ఉండేలా అభివృద్ధి చేయాలని చెప్పారు. పట్టణాల్లో వీకెండ్ ఎకానమీవిపరీతంగా పెరుగుతుందని సిఎం వివరించారు. ప్రజలు తమకు వచ్చే ఆదాయంలో 61శాతం డబ్బును వారాంతాల్లో ఖర్చు పెడుతున్నారని, అలాగే రవాణా నిమిత్తం 71శాతం ఖర్చు పెడుతున్నారని వెల్లడిం >>2



మంగళవారం హంద్రీ-నీవా జలాలకు పుష్పాలు సమర్పిస్తున్న సిఎం చంద్రబాబు

# కృష్ణా 'జల హారతి'

## కుప్పం బ్రాంచ్ కెనాల్ వద్ద ప్రత్యేక పూజలు

బీరగానిపల్లె రిజర్వాయర్ శంకుస్థాపన శిలాఫలకం ఆవిష్కరించిన సిఎం చంద్రబాబు

**కుప్పం, సెప్టెంబరు 22 ప్రభాతవార్త:** కుప్పం నియోజకకర్గంలోని చివరి ప్రాంతాలకు తాగునీరు అందించేందుకు తరలి వచ్చిన హంద్రీ-నీవా జలాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జలహారతి ఇచ్చారు. కుప్పంలోని శాంతిపురం మండలంలోని హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టులోని కుప్పం బ్రాంచ్ కెనాల్ వద్ద ఈ జలాలకు ముఖ్యమంత్రి ప్రత్యేక పూజలు చేసి పసుపు కుంకుమలు సమర్పించారు. అనంతరం స్థానిక ప్రజా ప్రతినిధులు, ప్రజలతో కలిసి హంద్రీ-నీవా జలాలకు పుష్పాలు సమర్పించి హారతి ఇచ్చారు. కుప్పం బ్రాంచ్‌కు ఇరువైపులా నిలబడి రైతులు మహిళలు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. కృష్ణా జలాలకు నీరాజనాలు >>2



మంగళవారం రాప్తాడులో నందమూరి తారకరామారావు, పరిటాల రవీంద్ర విగ్రహాలను ఆవిష్కరించి మాట్లాడుతున్న మంత్రి లోకేష్

# జగన్.. జాగ్రత్త!

## ఉపాధ్యాయుల జోలికొస్తే ఊరుకునేది లేదు

రెడ్ బుక్ రాజ్యాంగం ఉంది చట్టాన్ని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

స్థానిక సంస్థల ఎన్నికల్లో 94శాతం కంటే ఎక్కువ గెలవాలి

రాప్తాడులో స్వర్గీయ ఎన్టీఆర్, పరిటాల రవి విగ్రహాల ఆవిష్కరణ సభలో మంత్రి లోకేష్

**అనంతపురం, సెప్టెంబరు 22 ప్రభాతవార్త బ్యూరో:** "జగన్ జాగ్రత్త.. ఉపాధ్యాయులకు వస్తే ఊరుకునేది లేదు. అనవసర ఆరోపణలు చేస్తూ మా ఉపాధ్యాయుల జోలికొస్తే.. దబిడి దిబిడే నే. రెడ్ బుక్ రాజ్యాంగం ఉంది. చట్టాన్ని ఉల్లంఘిస్తే ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదు. డిఎస్సీపై చర్చకు నేను సిద్ధం. జగన్ రెడ్డి సిద్ధమ్మా అంటూ రాష్ట్ర విద్య, ఐటీశాఖలమంత్రి నారా లోకేష్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. డిఎస్సీపై చర్చకు సిద్ధమంటూ సవాల్ విసిరారు. పార్టీ కోసం అహర్నిశలు పనిచేస్తున్న కార్యకర్తలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రాతినిధ్యం వహిస్తున్న రాప్తాడు నియోజకవర్గ కేంద్రం కూడలిలో ఏర్పాటుచేసిన స్వర్గీయ అన్న నందమూరి తారకరామారావు, మాజీ మంత్రి, టిడిపి సీనియర్ నేత దివంగత పరిటాల రవీంద్ర విగ్రహాలను >>2

# టీచర్లపై దాడులు

# 250 మందిపై 6 కేసులు

## నిందితుల్లో మాజీ మంత్రులు జోగి రమేష్, వెల్లంపల్లి శ్రీనివాస్

మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, దేవినేని అవినాశ్, పేర్ని కిట్టు, నాగార్జున యాదవ్ పేర్లు

వైసిపి విద్యార్థి విభాగం నేత రవిచంద్ర అరెస్ట్

రౌడీషీటర్ల కోసం ముమ్మర గాలింపు

**విజయవాడ, సెప్టెంబరు 22 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) కార్యాలయం ఎదుట టీచర్లపై వైసిపి నాయకులు, శ్రేణులు జరిపిన భౌతిక దాడి ఘటనకు పాల్పడిన బాధ్యులందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని విజయవాడ పోలీస్ కమిషనర్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ఈ క్రమంలో ఈ విషయమై వేగంగా స్పందించిన పోలీసులు విజయవాడలోని సూర్యారావుపేట, మాచవరం, కృష్ణలంక పోలీస్ స్టేషన్లలో కలిపి మొత్తం 6 క్రిమినల్ కేసులు నమోదు చేశారు. >>2



మంగళవారం పిఠాపురంలో స్వయం సహాయక సంఘాలకు రుణాల చెక్కు అందజేస్తున్న డి.సిఎం పవన్ కల్యాణ్

# ఐక్యంగా కలిసి సాగుదాం!

● గౌరవానికి భంగం కలగకుండా కలిసి పనిచేద్దాం ● కూటమి నేతలకు డి.సిఎం పవన్ పిలుపు ● దేశంలోనే మోడల్‌గా పిఠాపురం నియోజకవర్గాన్ని తీర్చిదిద్దుతాం ● ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి ● రూ.1,500 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 22 ప్రభాతవార్త:** 'కూటమి ప్రభుత్వం మరింత బలంగా, సమర్ధవంతంగా ముందుకు సాగాలన్నదే నా కోరిక. అందుకోసం ఎవరి గౌరవానికి భంగం వాటిల్లకుండా అందరం కలిసి పని చేయాల్లి అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. పిఠాపురం నియోజకవర్గంలో మంగళవారం రూ.1,500 కోట్ల అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆర్ఆర్‌బిహెచ్ఆర్ కళాశాల మైదానంలో నిర్వహించిన బహిరంగ సభలో డిసిఎం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ "ముఖ్యంగా జనసేన పార్టీ గౌరవానికి భంగం వాటిల్లకుండా ఆ దిశగా అడుగులు వేస్తున్నాం. నాకు కృతజ్ఞత చాలా ఎక్కువ. కష్టాల్లో ఉన్న మనిషికి అండగా నిలబడటం నా స్వభావం, నా గుణం. ఈ విలువలను ఈ నేల నేర్పింది. ప్రజల అభివృద్ధే మన ప్రధాన లక్ష్యం. ప్రజల అవసరాలను ముందుగా గుర్తించి, వాటిని తీర్చేందుకు చిత్తశుద్ధితో పని చేద్దాం. వారి ఆశలు, ఆకాంక్షలకు తరువాత >>2



# అనంతనాగ్‌కు 'ఫాల్కే' ప్రదానం

## ఉత్తమ నటుడు మమ్ముట్టి, ఉత్తమ నటి యామి గౌతమ్‌కు పురస్కారాలు అందించిన రాష్ట్రపతి ముర్ము

కేవడియాలో ఘనంగా 72వ జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రదానోత్సవం

**ఏక్తా నగర్ (కెవాడియా), సెప్టెంబరు 22:** భారతీయ సినిమా దేశంలోని భిన్న భాషలు, సంప్రదాయాలు, ఆకాంక్షలు, ప్రజల పోరాటాలను ప్రతిబింబిస్తుందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. మంగళవారం గుజరాత్లోని ఏక్తా నగర్‌లో 72వ జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. జాతీయ చలనచిత్ర అవార్డుల కార్యక్రమానికి ఏక్తా నగర్‌ను వేదికగా ఎంపిక చేయడం భారతదేశ సాంస్కృతిక, జాతీయ ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని రాష్ట్రపతి పేర్కొన్నారు. సృజనాత్మక రంగంలో పనిచేస్తున్న కార్మికులు, చిన్న కళాకారులు, సహాయకులు, అవకాశాల కోసం ఎదురుచూస్తున్న కళాకారులకు గౌరవం, సామాజిక భద్రత కల్పించాల్సిన అవసరం ఉందని ఆమె అన్నారు. అన్ని జ్యూరీల్లో మహిళలకు తగిన ప్రాతినిధ్యం కల్పించడం ద్వారా సమగ్ర మానవీయ దృక్పథం ప్రతిబింబించేలా చూడాలని సూచించారు.

**అనంత్ నాగ్‌కు దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు**

భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రముఖ నటుడు అనంత్ నాగ్‌కు 2024 దాదాసాహెబ్ ఫాల్కే అవార్డును ప్రదానం >>2

23-9pg2exHMNWJQE.qxd:23-9pg2exHMNWJQE.qxd 1/1/02 6:54 AM Page 1






మంగళవారం రాష్ట్రపతి ముర్ము చేతుల మీదుగా ఉత్తమ నటి అవార్డు అందుకుంటున్న యామి గౌతమ్

# 'ఫాల్కే' ప్రదానం

>> చేశారు. దశాబ్దాల పాటు కథన కళను, నటనకు ఆయన అందించిన సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారం లభించింది. తన బాల్యాన్ని గుర్తుచేసుకున్న అనంత్ నాగ్ తాను ఆశ్రమంలో పెరిగిన అనంతరం ముంబైకి వెళ్లినట్లు తెలిపారు. అక్కడ ఒక నాటకంలో నటించే అవకాశం లభించిందని చెప్పారు. రంగస్థలమే తన సినీ జీవితానికి పునాదిగానిలిచిందని, సినిమాల్లోకి రాకముందు సుమారు 50 నాటకాల్లో నటించినట్లు తెలిపారు. అనంతరం ప్రముఖ దర్శకుడు శ్యామ్ బెనెగల్ తదితరుల చిత్రాల్లో నటించే అవకాశం లభించిందని చెప్పారు. తాను ఉద్దేశపూర్వకంగా కన్నడ సినిమాను ఎంచుకుని బెంగళూరును తన కర్మభూమిగా చేసుకున్నానని అనంత్ నాగ్ తెలిపారు. గత యేడాది రాష్ట్రపతి చేతుల మీదుగా పద్మభూషణ్ పురస్కారం అందుకున్న విషయాన్ని గుర్తుచేసుకున్న ఆయన, వరుసగా మరోసారి రాష్ట్రపతి చేతుల మీదుగా దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు అందుకోవడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్ మాట్లాడుతూ జాతీయ చలనచిత్ర అవార్డుల కార్యక్రమాన్ని ఢిల్లీ వెలుపల నిర్వహించే సంప్రదాయాన్ని ప్రారంభించినందుకు సమాచార, ప్రసార మంత్రిత్వశాఖకు కృతజ్ఞతలు తెలిపారు. సర్దార్ వల్లభభాయ్ పటేల్ వారసత్వం, జాతీయ ఐక్యతకు ప్రతీకగా నిలిచిన ఏక్తా నగర్, కెవాడియాలో ప్రతిష్ఠాత్మక అవార్డుల కార్యక్రమానికి ఆతిథ్యం ఇవ్వడం గుజరాత్‌కు గర్వకారణమని అన్నారు.గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఇతర ప్రముఖ అతిథులకు స్వాగతం పలికారు.

జాతీయ చలనచిత్ర అవార్డుల కార్యక్రమాలను దేశంలోని వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని ముఖ్యమైన పర్యాటక ప్రాంతాల్లో నిర్వహించడం ద్వారా భారతదేశ సాంస్కృతిక వారసత్వం, పర్యాటక రంగాన్ని ప్రోత్సహించాలన్నదే లక్ష్యమని కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. భవిష్యత్ అవార్డు కార్యక్రమాలకు తమ పర్యాటక ప్రాంతాలను వేదికలుగా ప్రతిపాదించాలని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను కోరారు. ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ క్రియేటివ్ టెక్నాలజీస్ కొత్త ప్రతిభకు వేదికగా నిలుస్తోందని, ఇప్పటికే 13 కోర్సుల్లో సుమారు 380 మంది విద్యార్థులు చేరారని తెలిపారు. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా కోర్సుల పాఠ్య ప్రణాళిక రూపొందించబడిందన్నారు. 72వ జాతీయ చలనచిత్ర అవార్డుల్లో పలు విభాగాల్లో ప్రముఖ నటులు, చిత్రాలకు పురస్కారాలు లభించాయి. ఉత్తమ నటుడు మమ్ముట్టి - బ్రహ్మయుగం; కార్తిక్ ఆర్యన్ - చందు ఛాంపియన్, ఉత్తమ నటి: యామి గౌతమ్ - ఆర్టికల్ 370, ఉత్తమ సహాయ నటుడు: సంజయ్ మిశ్రా - భక్షక్, ఉత్తమ సహాయ నటి: సచనా నామిదాస్ - మహారాజా; రోపశ్రీ వర్కాడి - మిథ్యా,ఉత్తమ ఫీచర్ చిత్రం: ఆర్టికల్ 370,ఉత్తమ దర్శకత్వం: రాజ్కుమార్ పెరియసామి - అమరన్, ప్రజాదరణ పొందిన ఉత్తమ వినోదాత్మక చిత్రం: కల్కి 2898, జాతీయ, సామాజిక, పర్యావరణ విలువలను ప్రోత్సహించిన ఉత్తమ చిత్రం: కెప్టెన్ మిల్లర్ దర్శకుడిగా అరంగేట్రానికి గుర్తింపు, రణదీప్ హుడా - స్వాతంత్ర్య వీర్ సావర్కర్ భారతీయ సినిమా భాషా వైవిధ్యాన్ని కూడా జాతీయ చలనచిత్ర అవార్డులు ప్రతిబింబించాయి.

# 250 మందిపై 6 కేసులు

>> 250 మందికి పైగా వైసిపి నాయకులు, శ్రేణులు, రౌడీషీటర్లపై హత్యాయత్నం, ఎస్సీ/ ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం, విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులపై దాడి, చట్టవిరుద్ధంగా గుమిగూడటం వంటి తీవ్రమైన సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు.

కేసులు నమోదైన వారిలో మాజీ మంత్రులు జోగి రమేశ్, వెల్లంపల్లి శ్రీనివాస్, నేతలు జక్కంపూడి రాజా, దేవినేని అవినాశ్, పేర్ని కిట్టు, నాగార్జున యాదవ్ తదితరులు ఉన్నారు. వైసిపి విద్యార్థి విభాగం నాయకుడు రవిచంద్రను పోలీసులు ఇప్పటికే అరెస్టు చేసి మాచవరం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దాడిలో పాల్గొన్న పలువురు రౌడీషీటర్లను పట్టుకోవడానికి ప్రత్యేక పోలీస్ బృందాలు గాలిస్తున్నాయి.

# స్మృతి మంధాన వరల్డ్ రికార్డు

>> ఫైనల్లో శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో 13 పరుగులు చేయడంతో అంతర్జాతీయ క్రికెట్‌లో 11 వేల పరుగులు పూర్తి చేసింది. టెస్టుల్లో 788, వన్డేల్లో 5411, టీ20ల్లో 4788 పరుగులు స్మృతి చేసింది. స్మృతి మంధాన ఈ యేడాదిలో రికార్డులు కొల్లగొడుతోంది. ఇటీవల ముగిసిన మహిళల ఆసియా కప్ 2026లో మాజీ భారత కెప్టెన్ మిథాలీ రాజ్ పేరిట ఉన్న 10,868 అంతర్జాతీయ పరుగుల రికార్డును అధిగమించింది.

దీంతో మహిళల క్రికెట్‌లో మూడు ఫార్మాట్లలో కలిపి అత్యధిక అంతర్జాతీయ పరుగులు చేసిన బ్యాటర్‌గా నిలిచింది. అంతేకాదు ఇటీవలే టి20 అంతర్జాతీయ క్రికెట్‌లోనూ మంధాన అరుదైన రికార్డు సాధించింది. పురుషులు, మహిళల క్రికెట్‌ను కలిపి టి20ల్లో అత్యధిక పరుగులు చేసిన న్యూజిలాండ్ మాజీ స్టార్ సుజీ బేట్స్ రికార్డును అధిగమించింది. ఏసియన్ గేమ్స్ సెమీఫైనల్లో బంగ్లాదేశ్‌పై 37 పరుగులు చేయడంతో ఈ రికార్డును తన పేరిట లిఖించుకుంది. ఇప్పుడు 11 వేల మైలు రాయిని అందుకుంది.

# డా. గజల్ భగవద్గీత మారిషస్‌లో లోకార్పణం

**విజయవాడ సెప్టెంబరు 22,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచ ప్రఖ్యాత గజల్ గాయకులు డా. గజల్ శ్రీనివాస్ రూపొందించిన శ్రీమద్భగవద్గీత - ఆంగ్ల ఆడియో ఆల్బమ్‌ను మారిషస్ రాష్ట్రపతి ధరమ్‌బీర్ గోకుల్ దంపతులు మారిషస్‌లోని శ్రీ హరిహర దేవస్థానం - కళాజ్యోతి ప్రాంగణంలో ఘనంగా లోకార్పణం చేశారు.ఈ ఆడియో ఆల్బమ్‌లో శ్రీమద్భగవద్గీతలోని 700 శ్లోకాలను డా. గజల్ శ్రీనివాస్ స్వరపరచి గానం చేశారు. కోల్‌కతాలోని అద్వైత ఆశ్రమానికి చెందిన స్వామి స్వరూపానంద అందించిన ఆంగ్ల అనువాదాన్ని ఆధారంగా తీసుకోగా, గీతా తాత్పర్యాలకు ఎన్. పార్థసారథి ఆంగ్లంలో స్వరాన్ని అందించారు.

ఈ సందర్భంగా మారిషస్ రాష్ట్రపతి ధరమ్‌బీర్ గోకుల్ మాట్లాడుతూ, డా. గజల్ శ్రీనివాస్ రూపొందించిన శ్రీమద్భగవద్గీత ఆంగ్ల ఆడియో ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజలకు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు శ్రీమద్భగవద్గీత విశ్వమానవాళికి శాశ్వత జీవన గ్రంథం" అని ఆయన అభివర్ణించారు. అదేవిధంగా, శ్రీమద్భగవద్గీతను ప్రపంచంలోని 100 భాషల్లో అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో డా. గజల్ శ్రీనివాస్ చేపట్టిన పవిత్రమైన గ్లోబల్ గీతా ఉద్యమాన్ని రాష్ట్రపతి ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమాన్ని బృందావన పార్థసారథి సమన్వయం చేసి నిర్వహించారు.

# పట్టణాలే గ్రోత్ ఇంజిన్లు

>> చారు. దీనిపై అధికారులు, ప్రజా ప్రతినిధులు మరింత అధ్యయనం చేయాలని సూచించారు. దీనికి అనుగుణంగా వారాంతాల్లో ఆర్థిక కార్యకలాపాలు పెరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. గృహవసతి, రవాణా వంటి అవసరాలపై పట్టణ ప్రజలు పెద్ద మొత్తంలో ఖర్చు చేస్తున్న నేపథ్యంలో టిడ్కో ఇళ్లతో పాటు స్త్రీశక్తి వంటి కార్యక్రమాలను చేపట్టామని తెలిపారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్మెంట్ విభాగం, అర్బన్ ప్రాస్పెరెటీ విభాగంగా పని చేయాలని ముఖ్యమంత్రి సూచించారు.

**టిడ్కో గృహాలు... ఇంటింటికి తాగునీరు:**

2027 నాటికి రాష్ట్రంలోని టిడ్కో గృహాల నిర్మాణాన్ని పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. విశాఖ నగరంలో 28,500 కుటుంబాలకు ఇప్పటికే ఇళ్ల పట్టాలు ఇచ్చామని, అభ్యంతరాలు లేని ప్రాంతాల్లో మరిన్ని పట్టాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. పట్టణ ప్రజలకు 24 గంటలూ సురక్షితమైన తాగునీరు అందించే లక్ష్యంతో జల్ జీవన్ మిషన్‌ను పూర్తి చేయాలని సిఎం ఆదేశించారు. భవన నిర్మాణ అనుమతులను వేగంగా మంజూరు చేస్తున్నామని, పట్టణాభివృద్ధిలో పలు సంస్కరణలు చేపట్టామని చెప్పారు. స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమాల ద్వారా పట్టణాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దుతున్నామని సిఎం తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 143 లక్షలటన్నుల చెత్తను తొలగించామని, ప్రస్తుతం రెండు వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లు పనిచేస్తున్నాయని చెప్పారు. మరో నాలుగు ప్లాంట్ల నిర్మాణాన్ని త్వరలో పూర్తి చేస్తామని వెల్లడించారు. ఘన వ్యర్థాలను రీసైక్లింగ్ విధానంలో శాస్త్రీయంగా నిర్వహిస్తూ మున్సిపాలిటీల్లో మురుగునీరు, చెత్త లేకుండా పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు.

**పట్టణ స్థానిక సంస్థలపై ఆర్థిక భారం లేకుండా హైబ్రీడ్ యాన్యుటీ పద్ధతుల్లో అభివృద్ధి పనులు:**

ప్రస్తుతం ప్రారంభించిన పనులతో కలిపి పట్టణ ప్రాంతాల్లో రూ.50 వేల కోట్ల విలువైన పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని, ఇవన్నీ పూర్తయితే రాష్ట్ర పట్టణ ప్రాంతాల దశ, దిశ మారుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ఇప్పటికే రూ.22,330 కోట్ల విలువైన పనులు కొనసాగుతున్నాయని, మరో ఆరు నెలల్లో రూ.17 వేల కోట్ల పనులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్‌లో తొలిసారిగా పట్టణాభివృద్ధి పనులు చేపడుతున్నామని సిఎం తెలిపారు. పట్టణ స్థానిక సంస్థలపై ఆర్థిక భారం పడకుండా ఈ విధానంలో పనులు చేపడుతున్నట్లు చెప్పారు. 123 మున్సిపాలిటీల పరిధిలో రూ.7,469 కోట్లతో, గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.3,890 కోట్లతో పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా రూ.4,656 కోట్లతో రహదారులు, రూ.88 కోట్లతో సెంట్రల్ మీడియన్లు, రూ.247 కోట్లతో వీధి దీపాలు, రూ.509 కోట్లతో పార్కుల అభివృద్ధి చేపట్టనున్నారు. మొత్తం సుమారు 2,165 కిలోమీటర్ల రహదారులు, 502 పార్కులు, 210 కిలోమీటర్ల సెంట్రల్ మీడియన్లు, 391 కిలోమీటర్ల స్ట్రీట్ లైటింగ్, 300 కిలోమీటర్ల సీవరేజీ పనులు చేపట్టనున్నారు. 2047 నాటికి ప్రతి మున్సిపాలిటీని స్వర్ణ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేయాలని సిఎం చంద్రబాబు ప్రజాప్రతినిధులు, మున్సిపల్ కమిషనర్లు, అధికారులకు దిశానిర్దేశం చేశారు. పట్టణ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపడుతున్న మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, అధికారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం నుంచి పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ పాల్గొనగా, కుప్పంలో జరిగిన కార్యక్రమంలో పట్టణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఇక వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పట్టణ స్థానిక సంస్థలకు చెందిన ప్రజాప్రతినిధులు, మున్సిపల్ కమిషనర్లు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, చిత్తూరు ఎంపి దగ్గుమళ్ల ప్రసాద్‌రావు, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు పాల్గొన్నారు.

# రెడ్ అలర్ట్

>> 5.6, ఉప్పలగుప్తంలో 5.5, కాట్రేనికోనలో 5.4, అయినవెల్లిలో 4.7, అల్లవరంలో 4.6, బెండమూర్లంకలో 4.1 సెం.మీ మేర వర్షపాతం నమోదైంది.

**రాయలసీమ,ఉత్తరాంధ్ర,ఎన్టీఆర్,కృష్ణాజిల్లాల్లో జోరు వానలు**

మంగళవారం రాయలసీమ వ్యాప్తంగా అనేక చోట్ల తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు, ఒకటి లేదా రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు పడే వీలుంది. బుధవారం కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కొనసాగుతూ, గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీస్తాయి. ఆ తర్వాత ఎల్లుండి నుంచి రాయలసీమలో వర్ష తీవ్రత క్రమంగా తగ్గి, ఒకటిరెండు చోట్ల తేలికపాటి జల్లులు మాత్రమే కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం స్పష్టం చేసింది. తీవ్ర వాయుగుండం దూసుకొస్తున్న నేపథ్యంలో ఉత్తర కోస్తా జిల్లాలైన శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. సముద్రం అల్లకల్లోలంగా మారనున్నందున మత్స్యకారులు ఎవరూ వేటకు వెళ్లరాదని హెచ్చరికలు జారీ చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చెట్ల కింద గానీ, విద్యుత్ స్తంభాల సమీపంలో గానీ ఉండకూడదని అధికారులు విజ్ఞప్తి చేశారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు సహాయక బృందాలను రంగంలోకి దించారు. వాయుగుండం ప్రభావంతో రాగల 24 గంటల్లో శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాలకు అధికారులు 'రెడ్ అలర్ట్' జారీ చేశారు. విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించారు. కాకినాడ, ఏలూరు, ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. విశాఖ, గంగవరం, కళింగపట్నం పోర్టుల్లో మూడో నంబర్ ప్రమాద హెచ్చరికలు, నెల్లూరు జిల్లా కృష్ణపట్నం పోర్టులో ఒకటో నంబర్ హెచ్చరిక జారీ చేశారు. సముద్రంలో బలమైన ఈదురుగాలులు వీస్తాయని, మత్స్యకారులు ఎవరూ వేటకు వెళ్లొద్దని ఐఎండీ స్పష్టం చేసింది. నేడు, రేపు శ్రీకాకుళం నుంచి బాపట్ల వరకు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది.

**విజయనగరం జిల్లా, పార్వతీపురం మన్యం జిల్లా పాఠశాలలకు నేడు సెలవు**

వర్షాల తీవ్రత దృష్ట్యా విజయనగరం జిల్లా, పార్వతీపురం మన్యం జిల్లా పాఠశాలలకు డిఇఒలు బుధవారం సెలవు ప్రకటించారు. సోమవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షాలకు గింజేరుగెడ్డ భారీగా వరద నీరు చేరింది. దీంతో చంద్రంపేట వసంత రహదారిపై రాకపోకలను అధికారులు నిలిపివేశారు. ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని సూచించారు. మన్యం జిల్లా సాలూరు నియోజకవర్గం, గుమ్మలక్ష్మీపురం పరిధిలో వాగులు, గెడ్డలు పొంగుతున్నాయి. శ్రీకాకుళం జిల్లా కళింగపట్నంలో గడిచిన మూడు గంటల్లోనే 6 సెం.మీ వర్షం కురిసింది. పలాస, రావివలస, సంతబొమ్మాళిలో 4 సెం.మీ చొప్పున వర్షపాతం నమోదైంది. కాకినాడ జిల్లా తుని, పిఠాపురం తదితర ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు పడుతున్నాయి.

# జగన్.. జాగ్రత్త!

>> మంత్రి నారా లోకేష్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ మాట్లాడుతూ, 'ఈ రోజు నేను స్వర్గీయ ఎన్టీఆర్ మనవడిగా, సిఎం చంద్రబాబు తనయుడిగా, బాలయ్య మావయ్య అల్లుడిగారాలేదు. ఎత్తిన పసుపు జెండా దించకుండా, మడమ తిప్పకుండా, టిడిపికి కాపలా కాసిన కార్యకర్తగా ఇక్కడకు వచ్చాను. అన్నఎన్టీఆర్ పార్టీని స్థాపించిన 9నెలల్లోనే అధికారంలోకి వచ్చారు. రాజకీయాల్లో, సినిమాల్లో స్వర్గీయ ఎన్టీఆర్ స్టైలే వేర్లు అని ఆయన వెల్లడించారు. అనంతపురం జిల్లాలో మహిళలు బయటకు రావాలంటే భయపడే రోజుల్లో దివంగత నేత పరిటాల రవీంద్ర పార్టీకి, జిల్లాకు చేసిన కృషి మరువలేవన్నారు. పరిటాల రవి పార్టీ సమావేశానికి వెళ్తే చంపేశారు. అయినా ఆ కుటుంబం వెనక్కి తగ్గలేదు. పరిటాల సునీతమ్మ ముందుకు వచ్చారు. అసెంబ్లీలో భయపెట్టినా ఆమె భయపడలేదు. పార్టీని ముందుకు తీసుకెళ్లారు. ఇప్పుడు పరిటాల శ్రీరామ్‌నికూడా పార్టీకి అంకితం చేశారు అని నారా లోకేష్ వెల్లడిం చారు. "ఉమ్మడి అనంతపురం జిల్లాలో యువగళం పాదయాత్ర చేశా. ఇక్కడి ప్రజల కష్టాలను చూశా. అందుకే దేశంలో ఎక్కడా లేనివిధంగా ఫైటర్ జెట్‌లు తయారుచేసే ఎఎంసిఎ ప్రాజెక్ట్‌ను అనంతపురం గడ్డకు తీసుకువచ్చా. సాగు, తాగునీరు, పరిశ్రమలను తీసుకురావాల్సిన బాధ్యత మనందరిపై ఉంది" అన్నారు.

**కలిసికట్టుగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందాం:**

"త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్నాయి. ఎన్నికలు.. ఎన్నికలే.. తగ్గేదేలే. కష్టపడాలి, పనిచేయాలి. మనది పెద్ద కుటుంబం. కోటి ఆరు లక్షల మంది సభ్యులు ఉన్నారు. మన కుటుంబం పెద్దదైంది. ఇప్పుడు పవనన్న కూడా మన కుటుంబ సభ్యుడు అయ్యారు. బిజెపి కూడా మన కుటుంబంలో చేరింది. మూడు పార్టీలు ఎపిని ముందుకు తీసుకెళ్తున్నాయి. సమస్యలు ఏవైనా ఉంటే నాలుగు గోడల మధ్య కూర్చొని పరిష్కరించుకుందాం. నిర్ణయం తీసుకున్న తర్వాత దానికి అందరూ కట్టుబడి ఉండాలి. కష్టపడి పనిచేసే వారిని గుర్తించి గౌరవిస్తాం. మన రాష్ట్రాన్ని మనందరం కలిసికట్టుగా అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉంది. మూడు పార్టీలు కలిసికట్టుగా ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉంద్ణి అని మంత్రి నారా లోకేష్ అన్నారు. "కార్యకర్తల ఆశీస్సులతో 94శాతం స్థానాలు కైవసం చేసుకున్నాం. ఇక్కడున్న కార్యకర్తలకు ఒకటే చెబుతున్నా.. కష్టపడదాం, ప్రజలకు సేవచేద్దాం. స్థానిక సంస్థల ఎన్నికల్లో 94శాతం కంటే ఎక్కువ గెలవాలి. ఈగోవద్దు, ప్రజల్లో ఉందాంణ్ణిఅని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

**పాదయాత్రలో నాతో నడిచిన వారిని గుండెల్లో పెట్టుకుని కాపాడుకుంటా:**

"రాప్తాడులో స్వర్గీయ ఎన్టీఆర్, పరిటాల రవి విగ్రహాలను ఆవిష్కరించే అవకాశం లభించడం అదృష్టంగా భావిస్తున్నా. ఈ రోజు నా తమ్ముడు పరిటాల శ్రీరామ్ పుట్టిన రోజు. నా తమ్ముడు పుట్టినరోజు నాడు విగ్రహాలను ఆవిష్కరించడం నా అదృష్టంగా భావిస్తున్నా. శ్రీరామ్‌కు ఉదయం లేచిన వెంటనే పుట్టినరోజు శుభాకాంక్షలు చెబుతూ మొదటి మెసేజ్ పెట్టింది నేనే. ఒక్కసారి నమ్మితే నేను వదిలిపెట్టను. ఆనాడు పాదయాత్రలో నాతో నడిచిన వారు, ఆనాడు ఎన్ని ఇబ్బందులు పెట్టినా మీరు నన్ను నడిపించారు. నా జీవితాంతం మిమ్మల్ని నా గుండెల్లో పెట్టుకుని కాపాడుకుంటాఞ అని మంత్రి లోకేష్ భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో హిందూపురం ఎంపి బికె పార్థసారథి, మంత్రి ఎస్.సవిత, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ పరిటాల శ్రీరామ్, మడకశిర ఎమ్మెల్యే, హిందూపురం పార్లమెంట్ టిడిపి అధ్యక్షుడు ఎం.ఎస్ రాజు, ఎమ్మెల్యేలు పల్లె సింధూర రెడ్డి, బండారు శ్రావణి, దగ్గుపాటి వెంకటప్రసాద్, మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి, జోనల్ కోఆర్డినేటర్ రెడ్డప్పగారి శ్రీనివాస రెడ్డి, హిందూపురం పార్లమెంట్ టిడిపి ప్రధాన కార్యదర్శి హనుమప్ప తదితరులు పాల్గొన్నారు.

## వారం - వర్జ్యం

23-09-2026, బుధవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, శుక్లపక్షం, ఉత్తర కార్తె,
తి. ద్వాదశి రా.10.47, న.శ్రవణ ఉ.9.07
వ.మ.1.21 – మ.3.03
దు.ఉ.11.35 – మ.12.23
రాహు మ.12.00–మ.1.30,
శుభ స. లేదు

## వార్తాఫలం

**మేషం:** అకౌంట్స్ విషయంలో తగు జాగ్రత్తలు తీసుకుంటారు.రావలసిన ధనం సకాలంలో చేతికందివస్తుంది.

**వృషభం:** సహోద్యోగులు అసూయపడే విధంగా మీ పని తీరు ఉంటుంది. ఓర్పును కలిగి ఉండండి.

**మిథునం:** నిర్మాణ వ్యవహారాలలో ప్రత్యక్ష పర్యవేక్షణకు ప్రాముఖ్యతనిస్తారు. ఆధిక్యం కలిగి ఉంటారు.

**కర్కాటకం:** విదేశాలలో స్థిరపడిన ఆత్మీయ వర్గం యొక్క సహాయ సహకారాలు లభిస్తాయి. ఖర్చులు అదుపులో ఉంటాయి.

**సింహం:** నూతన వ్యాపారానికి ఏర్పడిన ప్రతిబంధకాలు తొలగిపోతాయి. ముఖ్యమైన రహస్యాలు తెలుసుకుంటారు.

**కన్య :** మీలోని కొత్త కోణం వెలుగు చూస్తుంది. లక్ష్య సాధన దిశగా పట్టుదలతో ముందుకు సాగుతారు.

**తుల:** నిరాధారమైనటువంటి పుకార్లను ఏమాత్రం నమ్మరు. కుటుంబంలో ఒకరికి నూతన ఆదాయ మార్గం లభిస్తుంది.

**వృశ్చికం:** ఊహాలోకాలకు తెరదించి వాస్తవికత ప్రామాణికగా అడుగులు ముందుకు వేస్తారు. ఓర్పును కలిగి ఉంటారు.

**ధనుస్సు:** మొండి వైఖరిని కనబరుస్తారు. ముఖ్యమైన విషయాలను ఇతరులకు అప్పగిస్తారు. నూతన వస్తు సేకరణ.

**మకరం:** ప్రయోజనాలను వదిల పరచుకోవడానికి గాను ఒదిగి ఉంటారు.సాఫ్ట్వేర్ రంగంలోని వారికి అనుకూలం.

**కుంభం:** చర్చలు ఫలవంతంగా సాగుతాయి. స్థాయికి మించి వ్యాపార వ్యవహారాలను నేర్పుగా సర్దుబాటు చేస్తారు. ధనలాభం.

**మీనం:**న్యాయ నిపుణులతో సంప్రదింపులు జరుపుతారు. వస్తువుల మరమ్మత్తుల సూచన. సెల్ఫ్ డ్రైవింగ్ జాగ్రత్తలు అవసరం.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్




మంగళవారం కుప్పంలోని శాంతిపురం మండలంలోని హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టులోని కుప్పం బ్రాంచ్ కెనాల్ వద్ద పసుపు కుంకుమలు సమర్పిస్తున్న సిఎం చంద్రబాబు

# కృష్ణా 'జల హారతి'

>> పలికారు. హంద్రీ-నీవా జలం కుప్పానికి వరం అంటూ నినాదాలు చేశారు. కుప్పం అభివృద్ధికి నీటి భద్రత కీలకమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అందుకే శ్రీశైలం మల్లన్న పాదాల చెంత నుంచి హంద్రీ-నీవా పథకం ద్వారా కుప్పానికి తీసుకువచ్చామని అన్నారు. హెచ్ఎన్ఎస్ఎస్ ద్వారా 133 చిన్న నీటి చెరువులు నింపి తాగునీటి కొరత లేకుండా చేశామని స్పష్టం చేశారు. గత ఏడాది 2.4 టిఎంసిల నీటిని విడుదల చేశామని, దీని ప్రభావంతో భూగర్భ జలాలు 3 మీటర్ల మేర పెరిగాయని, ఎండిపోయిన బోర్లు జీవం పోసుకున్నాయని అన్నారు.

**నూతన రిజర్వాయర్ల నిర్మాణం:**

అంతకుముందు బీరగానిపల్లె వద్ద రిజర్వాయర్ నిర్మాణం కోసం చేపట్టాల్సిన పనులకు సంబంధించి సిఎం చంద్రబాబు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ రిజర్వాయర్ అభివృద్ధి పనులు చేపట్టనున్నట్టు ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. చిత్తూరు జిల్లాలో యామిగానిపల్లి, మదనపల్లి ప్రాంతాల్లో రిజర్వాయర్లు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. కుప్పంలో 550కి పైగా మైనర్ ఇరిగేషన్ ట్యాంకులకు లిఫ్ట్ ఇరిగేషన్, పైపులైన్లు, గ్రావిటీ కాలువలతో అనుసంధానం చేస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఎంపి దగ్గుమళ్ల ప్రసాద్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు.

# ఐక్యంగా కలిసి సాగుదాం!

>> ముందుకు తీసు కెళ్దాం. వచ్చే మూడు, నాలుగు నెలల్లో నా క్యాంపు ఆఫీసును పిఠాపురంలో పెట్టడానికి ఏర్పాట్లు చేస్తాం అనితెలిపారు. "పిఠాపురం నియోజకవర్గాన్ని దేశంలోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దాలన్నదే నాసంకల్పం. ఆ లక్ష్యం తోనే ఇప్పటికే వివిధ రంగాల్లో కోట్లాది రూపాయలతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. తాజాగా మరో రూ.1,500కోట్ల విలువైన అభివృద్ధిపనులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ప్రజల అవసరాలే ప్రాధాన్యంగా రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్య, వైద్యం, మౌలిక వసతుల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని స్పష్టం చేశారు. పిఠాపురాన్ని కేవలం ఒక నియోజకవర్గంగా కాకుండా, అభివృద్ధికి నమూనాగా నిలబెట్టే దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. పిఠాపురం ప్రజలు ఇచ్చిన గెలుపు రాష్ట్ర అభివృద్ధికే కాకుండా దేశ అభివృద్ధికి పునాదిగా నిలిచిందని చెప్పారు.

"పిఠాపురం నియోజక వర్గంలో గత రెండు సంవత్సరాలుగా జరుగుతున్న అభివృద్ధిని కళ్లముందు చూస్తున్నాం. వివిధ రంగాల్లో ఎన్నో కోట్ల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ముందుకు తీసుకెళ్లాం. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం పిఠాపురాన్ని దేశంలోనే ఒక మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దే దిశగా, పిఠాపురం భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తూ ముందుకు సాగుతున్నాం అన్నారు. ఉప్పాడ తీర ప్రాంత ప్రజలను ఎన్నాళ్లుగానో వేధిస్తున్న సముద్రపు కోత సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ముందుకు వెళ్తున్నాం. రూ.323 కోట్లతో రక్షణ గోడ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు సాధించాం. దీనికి సంబంధించిన డిజైన్, సర్వేను ఐఐటీ మద్రాస్ పూర్తి చేసింది, ఇక నిర్మాణ పనులు ప్రారంభమయ్యేలా అవసరమైన ప్రక్రియను వేగంగా పూర్తి చేస్తున్నాం. కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో పలుదఫాలుగా మాట్లాడి అసాధ్యం అనుకున్న ఈ పనిని సుసాధ్యం చేయగలిగాం. ఈ ప్రయత్నానికి జనసేన పార్టీ చేసిన త్యాగాలు, సంపాదించుకున్న విశ్వసనీయత, గుడ్‌విల్ కూడా కీలకంగా నిలిచాయ్ణి అని పవన్ కల్యాణ్ వివరించారు. పిఠాపురం ప్రజలు అందించిన ఘన విజయం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బలాన్ని అందించడమే కాకుండా, ఉప్పాడ తీర ప్రాంత ప్రజల చిరకాల సమస్య అయిన రక్షణ గోడ నిర్మాణానికి కూడా మార్గం సుగమం చేసిందన్నారు. ఈ సందర్భంగా పిఠాపురం నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి, హోంమంత్రి అమిత్ షాకి, రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కి, గ్రామీణాభివృద్ధి మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కి, ఆరోగ్యశాఖ మంత్రి జె.పి.నడ్డాకి, అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకి నా హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నానన్నారు. "పిఠాపురం అభివృద్ధి ప్రతి అడుగులో కనిపించాలి, ప్రతి కుటుంబం ముందుకు సాగాలి, మన పిల్లల భవిష్యత్తుకు పిఠాపురం ఒక బలమైన పునాదిగా నిలవాలి. మీరు నాపై ఉంచిన నమ్మకాన్ని అభివృద్ధి రూపంలో తిరిగి అందిస్తూ, పిఠాపురాన్ని మరింత గొప్పగా, మరింత అభివృద్ధి చెందిన నియోజకవర్గంగా తీర్చిదిద్దే వరకు నా ప్రయాణం ఆగదు" అన్నారు.

**ప్రజలతో మమేకమవుతూ పర్యటన సాగిందిలా..:**

నియోజకవర్గ పర్యటనలో డి.సిఎం పవన్ కల్యాణ్ గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై తనిఖీలు చేస్తూ మురుగు కాల్వలు, రోడ్లు పరిశీలిస్తూ.. ప్రజలతో మమేకమై ఉదయం నుంచి క్షేత్రస్థాయి పర్యటన చేశారు. గ్రామ గ్రామానా ఆగుతూ, ప్రజలను పలకరిస్తూ.. వారి సమస్యలు వింటూ.. క్షేత్ర స్థాయిలో పారిశుద్ధ్యాన్ని పరిశీలిస్తూ ఉదయం 6 గంటల నుంచే పవన్ కల్యాణ్ పర్యటన మొదలైంది. ప్రజలను నేరుగా కలుసుకుని వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలు అందజేసిన అర్జీలను స్వీకరించి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. పల్లెల్లో పారిశుద్ధ్య లోపాలు కనబడకూడదని, ప్రజలకు అందాల్సిన మౌలిక వసతులు, ప్రభుత్వ సేవల్లో జాప్యం ఉండరాదని అధికారులను ఆదేశించారు. నియోజకవర్గానికి చెందిన పలువురు రైతులు పవన్ కల్యాణ్‌ని కలిసి తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లోనూ ఏలేరు కాలువ ద్వారా సకాలంలో సాగునీరు అందించే ఏర్పాటు చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. కృతజ్ఞతగా ధాన్యాన్ని నింపిన గాజు కుండీని ఆయనకి బహూకరించారు.

ఖాళీ ప్రదేశంలో తాత్కాలిక గుడారాల్లో నివాసం ఉంటున్న చిలకలూరిపేటకు చెందిన వలస కూలీలను పలకరించారు. యేటా వ్యవసాయ పనులు సాగినన్నాళ్లు పిఠాపురం నియోజకవర్గంలోనే నివాసం ఉంటున్నామని, భారీ వర్షాలు కురిసిన సమయంలో తాత్కాలిక గుడారాల్లోకి నీరు వచ్చి, పిల్లలతో ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. నియోజకవర్గానికి వచ్చే వలస కూలీల తాత్కాలిక నివాసానికి కమ్యూనిటీ హాళ్లు లాంటివి ఏర్పాటు చేసే అవకాశాలు పరిశీలించాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లో వివిధ అంశాలపై ప్రజల నుంచి వివరాలు తెలుసుకున్నారు. స్థానికంగా ఉన్న సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు.

# దేశ భద్రతకు సంబంధించిన కేసుల్లో వేగవంతమైన న్యాయం కీలకం

### ప్రత్యేక కోర్టు ప్రారంభోత్సవంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్

### విశాఖపట్టణం కేంద్రంగా ఎన్ఐఎ కోర్టు.. తొలి జడ్జిగా డి.శేషయ్య నియామకం

### పాల్గొన్న జిల్లా జడ్జి జి. శ్రీనివాస్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సన్నీ యాదవ్

**విశాఖపట్నం(లీగల్), సెప్టెంబరు 22 ప్రభాతవార్త:** ఎన్ఐఎ (నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ జాతీయ దర్యాప్తు సంస్థ) చట్టం పరిధిలో నమోదయ్యే కేసులను సత్వరంగా పరిష్కరించేందుకు విశాఖపట్నంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక న్యాయస్థానం కీలకంగా పనిచేస్తుందని హైకోర్టు న్యాయమూర్తి, విశాఖపట్టణం జిల్లా కోర్టు పరిపాలనా న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్ పేర్కొన్నారు. వివిఆర్డీవి కాంప్లెక్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఎన్ఐఎ ప్రత్యేక న్యాయస్థానాన్ని మంగళవారం ఆయన వర్చ్యువల్‌గా ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన దేశ భద్రత, ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన ఎన్ఐఎ కేసులను అనవసరంగా పెండింగ్‌లో ఉంచకుండా చట్టపరమైన ప్రక్రియను అనుసరిస్తూ త్వరితగతిన విచారణ పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. నేరం చేసిన వారికి చట్టప్రకారం శిక్ష పడటంతో పాటు, నిర్దోషులకు ఎలాంటి అన్యాయం జరగకుండా విముక్తి లభించేలా న్యాయ ప్రక్రియ సాగాలని పేర్కొన్నారు. గతంలో ఎన్ఐఎ చట్టం పరిధిలోని కేసుల విచారణకు విశాఖపట్నం, విజయవాడలో రెండు నిర్దేశిత న్యాయస్థానాలు ఉండేవని తెలిపారు. గౌరవ సుప్రీంకోర్టు ఆదేశాలు, భారత ప్రభుత్వ విధాన నిర్ణయం మేరకు ప్రతి రాష్ట్రంలో ఎన్ఐఎ కేసుల విచారణ కోసం ప్రత్యేక న్యాయస్థానాలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఆంధ్రప్రదేశ్‌కు మంజూరైన ప్రత్యేక కోర్టును విశాఖపట్నంలో ఏర్పాటు చేయడం ప్రాధాన్యమైన విషయమన్నారు.

ఈ ప్రత్యేక న్యాయస్థానం ద్వారా ఎన్ఐఎ కేసుల విచారణ మరింత వేగవంతంగా, సమర్థవంతంగా సాగి, బాధితులకు సకాలంలో న్యాయం అందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నూతనంగా ఏర్పాటైన ప్రత్యేక న్యాయస్థానానికి తొలి ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా బాధ్యతలు స్వీకరించనున్న న్యాయమూర్తి డి. శేషయ్యను అభినందించారు...విశాఖ కీర్తి కిరీటంలో మరో కలికితురాయి: పీడీజే జి. శ్రీనివాస్.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్ఐఎ కేసుల విచారణకు ఏకైక ప్రత్యేక న్యాయస్థానం విశాఖపట్నంలో ఏర్పాటు కావడం నగరానికి ఎంతో గర్వకారణమని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీనివాస్ పేర్కొన్నారు. ఇది విశాఖపట్నం కీర్తి కిరీటంలో మరో కలికితురాయి వంటిదని అభివర్ణించారు.

23-9pg3exHMNWJQE.qxd:23-9pg3exHMNWJQE.qxd 1/1/02 6:19 AM Page 1



# తుఫాను ముప్పు.. హెచ్చరికలతో అలర్ట్!

● తీవ్ర వాయుగుండంగా మారిన అల్పపీడనం కళింగపట్నానికి ఆగ్నేయంగా కేంద్రీకృతం ● శ్రీకాకుళం జిల్లాలో ఎడతెరిపి లేని ముసురు.. ఒక్కరోజే 42.3 మి.మీ. సగటు వర్షపాతం ● పాఠశాలలన్నింటికీ సెలవు ● అధికారులను అప్రమత్తం చేసిన మంత్రి అచ్చెన్నాయుడు



**శ్రీకాకుళం, సెప్టెంబరు 22 ప్రభాతవార్త:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర వాయుగుండంగా బలపడటంతో జిల్లాను కుంభ వృష్టి ముప్పు పొంచి ఉందన్న హెచ్చరికలు కలవరపెడుతున్నాయి. వర్షాల ప్రభావంతో గత 24 గంటలుగా జిల్లా వ్యాప్తంగా విస్తారంగా ఎడతెరిపి లేని ముసురు వర్షాలు కురుస్తున్నాయి. అయితే, మంగళవారం సాయంత్రం 6 గంటల సమయం నుంచి సుమారు గంట పాటు వర్షం తెరిపినివ్వడంతో ప్రజలు కాస్త ఉపశమనం పొందారు. అయినప్పటికీ భారత వాతావరణ శాఖ (ఐఎమ్‌డీ) హెచ్చరికల నేపథ్యంలో బుధ, గురువారాల్లో మరింత జాగ్రత్తగా ఉండాలని జిల్లా యంత్రాంగం ప్రజలను హెచ్చరించింది.

**తీరం దిశగా తీవ్ర వాయుగుండం:** ప్రస్తుతం మంగళవారం మధ్యాహ్నానికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన ఈ తీవ్ర వాయుగుండం విశాఖపట్నానికి తూర్పున 320 కి.మీ., కళింగపట్నానికి తూర్పు ఆగ్నేయంగా 230 కి.మీ. దూరంలో కదులుతోంది. ఇది గంటకు 17 కి.మీ. వేగంతో పయనిస్తూ బుధవారం రాత్రి లేదా గురు వారం తెల్లవారుజాము నాటికి ఉత్తరాంధ్ర దక్షిణ ఒడిశా తీరాల మధ్య ఎక్కడో ఒకచోట తీరం దాటే అవకాశం ఉందని అధికా రులు అంచనా వేస్తున్నారు. దీని ప్రభావంతో గంటకు 50 నుండి 70కి.మీ. వేగంతో బలమైన ఈదురుగాలు వీచేఅవకాశం ఉంది.

**నేడు బదులుకు పరిహార సెలవు:** జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని సెప్టెంబరు 23 (బుధవారం)న జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు సెలవు ప్రకటిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ఈ సెలవును పరిహార సెలవుగా పరిగణిస్తామని, దీనికి బదులుగా పాఠశాలలు మరొక సెలవు దినాన పని చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాలకు స్థానిక వర్ష తీవ్రతను బట్టి సెలవులు ఇచ్చే అధికారాన్ని క్షేత్రస్థాయి అధికారులకు ఇచ్చారు.

**ముందస్తు చర్యలుపై మంత్రి అచ్చెన్న ఆరా:** వర్షాల పరిస్థితిపై వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు నిరంతరం ఆరా తీస్తూ జిల్లా కలెక్టర్, ఎస్పీలకు పలు సూచనలు చేశారు. నదీపరివాహక, లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో కచ్చా ఇళ్లు, పల్లపు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. సెప్టెంబర్ 26 వరకు మత్స్యకారులు ఎవరూ సముద్రంలోకి వేటకు వెళ్లరాదని కఠిన ఆదేశాలు జారీ చేశారు.

**సహాయం కోసం కంట్రోల్ రూమ్‌లు:** వర్షాలు, అత్యవసర సహాయం కోసం కలెక్టరేట్‌లో 24 గంటలూ పని చేసే కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. ప్రజలు అత్యవసర సమయాల్లో 089422 40557 నంబరును సంప్రదించాలని కలెక్టర్ కోరారు. ప్రతి మండల తహసీల్దార్ కార్యాలయంలోనూ ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లను అందుబాటులోకి తెచ్చారు. ప్రజలు రాబోయే రెండు రోజులు అనవసరంగా ఇళ్ల నుంచి బయటకు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

**అప్రమత్తంగా ఉండండి: కేంద్ర మంత్రి రామ్మోహన్:** శ్రీకాకుళం జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు సూచించారు. జిల్లాలో వర్షాలు, వరదల పరిస్థితిపై మంగళవారం నాడు డిల్లీ నుండి శ్రీకాకుళం కలెక్టర్, ఎస్పీతో ఎప్పటికప్పుడు మాట్లాడి వివరాలను తెలుసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇరిగేషన్, రెవెన్యూ, విద్యుత్ తదితర శాఖల అధికారులు పూర్తి అప్రమత్తతతో ఉండాలని మంత్రి సూచించారు. వినాయక చవితి నిమజ్జనాల్లో సైతం అత్యంత అప్రమత్తత అవసరమని ప్రజలకు సూచించారు. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు అన్ని శాఖల అధికారులు సిద్ధంగా ఉండాలని, ముందస్తు సన్నద్ధత, అప్రమత్తతతో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ, వర్షాలు, వరదల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని



సూచించారు. ప్రజలకు అవసరమైన సహాయం, సమాచారం అందేలా జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టాలని, అత్యవసర పరిస్థితుల్లో తక్షణ స్పందనకు కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు అవసరమైన సందర్భాల్లో కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ 08942 240557 నంబర్‌ను సంప్రదించాలని మంత్రి రామ్మోహన్ సూచించారు.



## అతి భారీ వర్షసూచన

# ఉత్తరాంధ్ర ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● ప్రభావిత జిల్లాల్లో ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలు సిద్ధం
● కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు.
● అత్యవసర సహాయం కోసం టోల్ ఫ్రీ నంబర్లు 112, 1070, 1800 425 0101
● హోంమంత్రి వంగలపూడి అనిత

**విజయవాడ, సెప్టెంబరు 22 ప్రభాతవార్త ప్రతినిధి:** అతి భారీ వర్షసూచన ఉన్నందున ఉత్తరాంధ్ర ప్రజలు అప్రమత్తంగా ఉండాలి అని హోంమంత్రి అనిత హెచ్చరించారు. పశ్చిమ మధ్య, దానిని ఆనుకుని ఉన్న వాయువ్య బంగాళాఖాతంలోని వాయుగుండం నేపథ్యంలో రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. బంగాళాఖాతంలో నెలకొన్న పరిస్థితులను, వాయుగుండం కదలికలను ఆమె ఎప్పటికప్పుడు నిశితంగా పరిశీలిస్తూ అధికారులకు దిశానిర్దేశం చేశారు. మత్స్యకారులు ఎట్టిపరిస్థితుల్లోనూ వేటకు వెళ్లరాదని, తమ బోట్లు, వలలను సురక్షిత ప్రాంతాల్లో జాగ్రత్త పరుచుకోవాలని కోరారు. విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ వాయుగుండం తీవ్రతను హోంమంత్రికి వివరిస్తూ, ఇది ప్రస్తుతం గోపాల్‌పూర్ (ఒడిశా)కు 180 కిమీ, కళింగపట్నానికి 180 కిమీ, విశాఖపట్నానికి 270 కిమీ దూరంలో కేంద్రీకృతమై ఉందని తెలిపారు. ఈ వాయుగుండం రేపు రాత్రి లేదా ఎల్లుండి తెల్లవారుజాము సమయంలో విశాఖపట్నం– గోపాల్‌పూర్ మధ్య తీరం దాటే అవకాశం ఉందని వెల్లడించారు. వాయుగుండం ప్రభావంతో రేపు, ఎల్లుండి కోస్తాంధ్రలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హోంమంత్రి అనిత సూచించారు. ముందస్తు సహాయక చర్యల కోసం ప్రభావిత జిల్లాల్లో ఎస్‌డీఆర్‌ఎఫ్, ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని హోంమంత్రి అనిత స్పష్టం చేశారు. అవసరమైతే లోతట్టు ప్రాంతాల ప్రజలను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. వాయుగుండం తీవ్రతపై ప్రజలకు ఎప్పటికప్పుడు హెచ్చరిక సందేశాలు పంపించాలని, విపత్తుల నిర్వహణ సంస్థ, ఆర్‌టీజీఎస్ అధికారులు నిరంతరం సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. అత్యవసర సహాయం కోసం విపత్తుల నిర్వహణ సంస్థ టోల్ ఫ్రీ నంబర్లు 112, 1070, 18004250101లను సంప్రదించాలని హోంమంత్రి అనిత ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పొంగిపొర్లుతున్న వాగులు, కాజ్‌వేల వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసి రాకపోకలను నియంత్రించాలని ఆదేశించారు. ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు చెట్లు, హోర్డింగ్‌లు, పాతబడిన ఇళ్ల వద్ద ఉండకూడదని హెచ్చరించారు.

## వర్షాలతో అనంతపురం జిల్లాకు ఊరట

**అనంతపురం, సెప్టెంబరు 22 ప్రభాతవార్త బ్యూరో:** ఉత్తరాంధ్ర ప్రాంతంలో అల్పపీడనం వల్ల భారీ వర్షాలు పడడంతో పాటు ఆంధ్ర, తెలంగాణ జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో వరుణుడు కరకరించాడు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్లోని ఉత్తరాంధ్ర ప్రాంతంలో కొన్ని జిల్లాల్లో మంగళవారం భారీ వర్షాలు కురవడం, బుధవారం రోజు స్కూళ్లకు సెలవులు ఇవ్వడం లాంటి చర్యలకు ప్రభుత్వం పూనుకుంది. అల్పపీడనం ప్రభావం వల్ల రాయలసీమ జిల్లాల్లో ఆకాశం మూసుకున్నట్లు ఉన్న పెద్దగా వర్షాలు వర్షాలు కురవకపోవడం గమనించదగ్గ పరిణామం. ఈ అల్పపీడనం ప్రభావంతో నైనా రాయలసీమ జిల్లాల్లో రెండు మూడు రోజులు భారీ వర్షాలు కురిస్తే వంకలు వాగులు వారి చెరువుల్లోకి, రిజర్వాయర్లలోకి నీరు చేరుకొని భూగర్భ జలాలు పెరుగుతాయని రైతుల ఆశిస్తున్నారు. ఇదిలా ఉండగా సోమవారం రాత్రి, మంగళవారం తెల్లవారుజామున ఉమ్మడి అనంతపురం జిల్లాలో కొన్ని మండలాల్లో ఒక మోస్తారు వర్షం కురిసింది. వాతావరణ శాఖ తెలియజేసిన వివరాల ప్రకారం శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురంలో 45.5, చిలమత్తూరులో 39.8, బత్తలపల్లిలో 37.5, అమలాపురంలో 32.6, లేపాక్షిలో 25, నల్ల చెరువులో 24.6, గుడిబండలో 23.2, పెనుగొండలో 18.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. అనంతపురం జిల్లాలో కనేకల్లో 80, గుత్తిలో 60.2, బెలుగుప్ప 46.5, ఉరవకొండ 46.4, యాడికి 39.2, కళ్యాణ్ దుర్గం 38.6, కంబదూరు 34.6, సెట్టూరు 34.2, పెద్దవడుగూరు 33.8, విడపనకల్లు 21.6, గుంతకల్లు 18 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

# డిసెంబరులో నంది అవార్డులు

● అక్టోబరులో సినీ, టివి అవార్డుల కోసం కమిటీల ఏర్పాటు ● నవంబరులో ఎంపిక ప్రక్రియ.. ప్రభుత్వం ఉత్తర్వులు ● రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రి దుర్గేష్ వెల్లడి ● ఎఫ్‌డిసి చైర్మన్ భరణ్ భూషణ్, ఎండి విశ్వనాథన్ ప్రకటన

**విజయవాడ, సెప్టెంబరు 22 ప్రభాతవార్త ప్రతినిధి:** తెలుగు సినీ, టివి పరిశ్రమలకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. గత కొన్నేళ్లుగా నిలిచిపోయిన ప్రతిష్ఠాత్మక నంది అవార్డుల ప్రదానోత్సవాన్ని ఈ యేడాది డిసెంబరులో ఘనంగా నిర్వహించనున్నట్లు రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేశ్ ప్రకటించారు. అవార్డుల ప్రదానానికి సంబంధించిన కార్యాచరణను ఖరారు చేశారు. సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ దిశానిర్దేశం మేరకు తెలుగు సినీ రంగానికి గౌరవం చాటేలా ఈ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు మంత్రి దుర్గేష్ వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లో నంది అవార్డుల నిర్వహణకు అనుమతినిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు (జీవో ఆర్టీ నెం:. 1843) జారీ చేసింది. గతంలో 2012 నుంచి 2016 వరకు నంది అవార్డులను ప్రకటించినా ప్రదానోత్సవం జరగలేదు. ఆ కాలానికి సంబంధించి ప్రకటించిన అవార్డులన్నింటినీ ఇప్పుడు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. అప్పట్లో ఫిల్మ్ విభాగంలో 288 అవార్డులు, 51 జ్యూరీ అవార్డులు, టివి రంగంలో 330 అవార్డులు, 54 జ్యూరీ అవార్డులను ప్రకటించారు. వాటన్నింటినీ డిసెంబరులో అందజేయనున్నారు. ఇక 2017 నుంచి 2024 వరకు నంది అవార్డులు ప్రకటించలేదు. ఆ



ఎనిమిదేళ్ల కాలానికి గాను, ఏటా నాలుగు అవార్డుల చొప్పున (ఉత్తమ చిత్రం, ఉత్తమ ద్వితీయ చిత్రం, రెండు స్పెషల్ జ్యూరీ అవార్డులు) ఇవ్వనున్నారు. అన్ని కేటగిరీల్లో అవార్డులు ఇవ్వడం ఆచరణ సాధ్యం కానందునే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎపి ఫిల్మ్, టెలివిజన్ అండ్ థియేటర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎఫ్‌డిసి) చైర్మన్ భరత్ భూషణ్ తెలిపారు. 2025 నుంచి మాత్రం పాత పద్ధతిలోనే అన్ని విభాగాల్లో నంది అవార్డులు ఇస్తామన్నారు. నంది ఫిల్మ్ అవార్డులు, జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రదానోత్సవాన్ని అమరావతి లేదా విజయవాడ వేదికగా నిర్వహించనున్నారు. నంది టీవీ అవార్డుల వేడుకను తిరుపతిలో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అవార్డుల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. అక్టోబరు 12లోగా దరఖాస్తు చేసుకోవాలి. అక్టోబరులో అవార్డుల కమిటీని ఏర్పాటు చేసి, నవంబరులో ఎంపిక ప్రక్రియ పూర్తి చేస్తారు. రాష్ట్రంలో షూటింగ్స్ జరుపుకునే సినిమాలకు సింగిల్ విండో విధానంలో అనుమతులు ఇస్తూ తగిన ప్రోత్సాహం అందిస్తామని అధికారులు వెల్లడించారు. ఇప్పటికే రాష్ట్రంలో 13 సినిమాల చిత్రీకరణ జరుగుతోందని చెప్పారు. నంది ఫిల్మ్ అవార్డులు అందించే ప్రధాన కేటగిరీలు చలన చిత్రాలు, జాతీయ సమైక్యతపై చలన చిత్రాలు, బాలల చిత్రాలు, డాక్యుమెంటరీ చిత్రాలు, విద్యా విషయక చిత్రాలు, తెలుగు సినిమాపై రచించిన ఉత్తమ రచనలు, తదితర 46 అవార్డులను అందించనున్నారన్నారు. ఉత్తమ ప్రదర్శన, ద్వితీయ ఉత్తమ ప్రదర్శన, తృతీయ ఉత్తమ ప్రదర్శన, ఉత్తమ నటుడు, ఉత్తమ నటి, ఉత్తమ సహాయ నటుడు, ఉత్తమ సహాయ నటి, తదితర అవార్డులున్నాయన్నారు. నంది ఫిల్మ్ అవార్డు గ్రహీతలకు బంగారు, వెండి, కాంస్య, తామ్ర నందులు, ప్రశంసాపత్రంతో పాటు నగదు పారితోషికం అందించబడుతుందన్నారు. వివిధ కేటగిరీలలో 8 గోల్డ్ మెడల్స్ కూడా అందించనున్నట్లు భరత్ భూషణ్ వివరించారు.

## స్థానిక పోరుకు జనసేన సన్నద్ధం

● హండ్రెడ్ పర్సెంట్ స్ట్రైక్ రేట్ లక్ష్యంగా పనిచేయాలి
● నాయకులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో వెళ్లాలి
● జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 22 ప్రభాతవార్త:** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని క్షేత్రస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. స్థానిక ఎన్నికల్లో సాధ్యమైనంత మెరుగైన ఫలితాలు సాధించేలా ఇప్పటి నుంచే సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలతో నిత్యం మమేకమవుతూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలని నాయకులు, ప్రజాప్రతినిధులకు స్పష్టం చేశారు. కాకినాడ కుళాయి చెరువు ప్రాంగణంలోని గోదావరి కళాక్షేత్రంలో మంగళవారం జరిగిన రాష్ట్ర పార్టీ సమావేశంలో పవన్ కళ్యాణ్ ప్రసంగించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణుల సమన్వయం, ప్రజలతో సంబంధాల బలోపేతంపై పలు సూచనలు చేశారు. స్థానిక ఎన్నికల్లో పార్టీకి హండ్రెడ్ పర్సెంట్ స్ట్రైక్ రేట్ సాధించే దిశగా ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు పార్టీ నాయకత్వం, ప్రజాప్రతినిధులు అండగా నిలవాలని పవన్ కళ్యాణ్ సూచించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. గ్రామాలు, పట్టణాల్లో ప్రజలతో నేరుగా సంబంధాలు కొనసాగిస్తూ వారి సమస్యలను గుర్తించాలని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు చేరేలా సమన్వయం చేయాల్సిన బాధ్యత నాయకులపై ఉందని వివరించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు తమ పరిధిలోని కార్యకర్తలను కలుపుకుని ముందుకు సాగాలని సూచించారు.

## డిఎస్సీ అవకతవకలపై సిబిఐ విచారణకు ఆదేశించే వరకు పోరు: జగన్



**అమరావతి, సెప్టెంబరు 22 ప్రభాతవార్త ప్రతినిధి:** డిఎస్సీ నియామకాల్లో అవకతవకలు జరిగాయని, సిబిఐ విచారణకు ఆదేశించే వరకు పోరాటం కొనసాగిస్తామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ సిఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి స్పష్టం చేసారు. డిఎస్సీ అక్రమాలపై విచారణ కోరుతూ బాధితులు ఆందోళన చేస్తే తెలుగుగళం పేరిట వారిపై రౌడీమూకలు దాడి చేయడం దారుణమన్నారు. ఈ విషయంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ వెంటనే రాజీనామా డిమాండ్ చేశారు. ఈ మేరకు జగన్ 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. శాప్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న తమ పార్టీ నేతలు, కార్యకర్తలపై పోలీసులు లాఠీఛార్జ్ చేశారని జగన్ ఆరోపించారు.

ఉపాధ్యాయుల ముసుగులో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు దాడులకు తెగబడ్డారని ఆయన విమర్శించారు. ప్రభుత్వం తనకు తానుగా క్లీన్ చిట్ ఇచ్చుకుంటే దానికి విలువ ఉండదని, చిత్తశుద్ధి ఉంటే ఈ వ్యవహారంపై సిబిఐ విచారణకు అంగీకరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేశ్‌లకు ఆయన సవాల్ విసిరారు. "లక్షలాది మంది నిరుద్యోగ యువత యేళ్ల తరబడి కష్టపడి చదువుకుంటున్నారు. వారికి న్యాయం జరగాలంటే నియామక ప్రక్రియలో పారదర్శకత అత్యవసరం" అని జగన్ పేర్కొన్నారు. పోలీసు బారికేడ్లు, లాఠీఛార్జ్‌లు, అరెస్టులతో ప్రజల్లో నమ్మకాన్ని పునరుద్ధరించలేరని, ఈ కుంభకోణంపై సిబిఐ విచారణ జరపడమే ఏకైక మార్గమని మాజీ సిఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తేల్చిచెప్పారు.

## పెన్షనర్లకు శుభవార్త: అదనపు పింఛన్ పెంపు

**అమరావతి, సెప్టెంబరు 22 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రభుత్వ పెన్షన్‌దారులకు అదనపు పింఛన్ శాతాన్ని పెంచుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు అదనపు పింఛన్ రేట్లను పునరుద్ధరిస్తూ జిఒ ఎంఎస్ నంబర్ 126ను ఆర్థిక శాఖ విడుదల చేసింది. 70 ఏళ్లు పూర్తయిన పింఛను దారులు/ ఫ్యామిలీ పింఛను దారులకు అదనపు పింఛన్‌ను 7శాతం నుంచి 10శాతానికి రాష్ట్ర ప్రభుత్వం పెంచింది. 75 ఏళ్లు పూర్తయిన పింఛనుదారులకు అదనపు పింఛన్‌ను 12శాతం నుంచి 15శాతానికి కూటమి సర్కార్ పెంచింది. పెంచిన అదనపు పింఛన్ డిసెంబరు 2026 నెల పింఛనుకు వర్తిస్తుందని స్పష్టం చేసింది. పెరిగిన ఈ మొత్తాన్ని జనవరి 1, 2027న చెల్లించనుంది. 80 సంవత్సరాలు, అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్నవారి అదనపు పింఛన్ రేట్లలో ఎలాంటి మార్పు లేదని సర్కార్ తేల్చిచెప్పింది. ఆంధ్రప్రదేశ్ పెన్షనర్ల సంఘాల విజ్ఞప్తి మేరకు పరిశీలించి పాత రేట్లను ఎపి ప్రభుత్వం పునరుద్ధరించింది.

# డిఎస్పీపై జగన్‌కు అవగాహన ఉందా?

● వైసిపి అధినేతపై మంత్రి అచ్చెన్నాయుడు మండిపాటు ● ఐదేళ్లలో ఒక్క డిఎస్సీ కూడా ఎందుకు పెట్టలేదని నిలదీత ● ఉపాధ్యాయులపై దాడులకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరిక ● పిడిసిసి బ్యాంకు ఆధునీకరణతో రైతులకు మెరుగైన సేవలు

**ఒంగోలు (కలెక్టరేట్), సెప్టెంబరు 22 ప్రభాతవార్త:** ఐదేళ్ల వైసిపి పాలనలో ఒక్క డిఎస్సీ కూడా నిర్వహించకుండా నిరుద్యోగ యువతను నిరీక్షణలో ఉంచారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 16,700 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసిందని రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. డిఎస్సీ ఉపాధ్యాయ నియామకాలపై వైసిపి చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని, రాజకీయ పార్టీ ముసుగులో క్రిమినల్ రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. సోమవారం విజయవాడలో డిఎస్సీ క్రీడా కోటా ఉపాధ్యాయులపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. ఉద్యోగాలు సాధించిన ఉపాధ్యాయులపై భౌతిక దాడులకు పాల్పడటం సరికాదని, నియామకాలపై అభ్యంతరాలు ఉంటే చట్టబద్ధమైన మార్గాల్లో పరిష్కరించుకోవాలని సూచించారు. 'అసలు డిఎస్సీ అంటే ఏమిటో తెలుసా?' అంటూ మాజీ ముఖ్యమంత్రి జగన్‌ను ఉద్దేశించి అచ్చెన్నాయుడు ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం డిఎస్సీ నియామకాలను పద్ధతి ప్రకారం చేపట్టిందని, ప్రక్రియకు సంబంధించి వచ్చిన అభ్యంతరాలకు ప్రభుత్వం వాస్తవాలతో సమాధానం ఇచ్చిందని తెలిపారు. క్రీడా కోటా ఎంపికలు నిర్దేశిత నిబంధనల ప్రకారమే జరిగాయని, క్రీడా ధ్రువపత్రాలకు ఇచ్చే ప్రాధాన్యత, ఎంపిక విధానం కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఉంటాయని చెప్పారు. వీటిని వ్యక్తిగతంగా మంత్రులు నిర్ణయించరని స్పష్టం చేశారు. డిఎస్సీ వ్యవహారాన్ని రాజకీయంగా వివాదాస్పదం చేసేందుకు ప్రతిపక్షం ఆరోపణలు చేస్తోందని అచ్చెన్నాయుడు విమర్శించారు.

**సహకార రంగానికి పూర్వ వైభవం తెస్తాం:** మంగళవారం దివంగత మాజీ మంత్రి దామచర్ల ఆంజనేయులు వర్ధంతి సందర్భంగా ఒంగోలులో ఆయన విగ్రహానికి అచ్చెన్నాయుడు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాకు, ముఖ్యంగా సహకార రంగానికి దామచర్ల ఆంజనేయులు అందించిన సేవలను స్మరించుకున్నారు. అనంతరం మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి, రాజమండ్రి గ్రామీణ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ, జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, పిడిసిసి బ్యాంకు చైర్మన్ కె. సీతారామయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుచిత్ర, ప్రజాప్రతినిధులు, అధికారులు, బ్యాంకు సిబ్బందితో కలిసి ఆధునీకరించిన ప్రకాశం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ రైతాంగానికి నిరంతరం అండగా నిలుస్తూ గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో సహకార బ్యాంకులు కీలక



పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. సహకార రంగానికి పూర్వ వైభవం తీసుకురావడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దార్శనికతకు అనుగుణంగా సహకార వ్యవస్థను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఆన్‌లైన్ పరిధిలోకి తీసుకువచ్చామని, వాణిజ్య బ్యాంకులకు దీటుగా సహకార బ్యాంకుల్లోనూ డిజిటల్ సేవలు అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. డిజిటలైజేషన్ వల్ల బ్యాంకింగ్ కార్యకలాపాల్లో పారదర్శకత పెరగడంతో పాటు అక్రమాలకు అడ్డుకట్ట వేసే అవకాశం ఏర్పడిందన్నారు. రైతులు, గ్రామీణ ప్రజలకు వేగవంతమైన బ్యాంకింగ్ సేవలు అందేలా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. గుంటూరు, విజయవాడ సహకార బ్యాంకుల్లో జరిగినట్లు ఆరోపణలు వచ్చిన అవినీతి వ్యవహారాలపై లోతైన విచారణ కొనసాగుతోందని, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ప్రజలు, రైతుల సొమ్ముకు నష్టం జరగకుండా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని, అక్రమాలకు సంబంధించి ప్రజాధనాన్ని రికవరీ చేసేందుకు అన్ని మార్గాల్లో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆర్థికంగా బలహీనపడిన సహకార బ్యాంకులను నష్టాల నుంచి బయటకు తీసుకువచ్చి పూర్వ వైభవం కల్పించేందుకు ప్రభుత్వం అవసరమైన ఆర్థిక, పరిపాలనా సహకారం అందిస్తుందని తెలిపారు. రైతులకు రుణాలు, ఇతర ఆర్థిక సేవలు మరింత సమర్థంగా అందేలా సహకార బ్యాంకుల పనితీరును బలోపేతం చేస్తామని చెప్పారు. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడి పలు ప్రాంతాల్లో రైతాంగం కరువు పరిస్థితులను ఎదుర్కొంటోందని మంత్రి తెలిపారు. కరువు ప్రభావిత ప్రాంతాలపై అన్ని జిల్లాల నుంచి నివేదికలు సేకరిస్తున్నామని, వచ్చే నెల ఒకటో తేదీ నాటికి కరువు ప్రాంతాలు, కరువు మండలాలను ప్రకటించే అవకాశం ఉందన్నారు. కరువు ప్రభావిత రైతులకు సహకార, వాణిజ్య బ్యాంకుల ద్వారా అవసరమైన ఆర్థిక సహాయం అందించేలా ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తుందని చెప్పారు.

# కానిస్టేబుళ్లే పోలీసు వ్యవస్థకు వెన్నెముక

– క్రమశిక్షణ, నిజాయితీ, మానవత్వంతో విధులు నిర్వర్తించాలి: కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్‌లో హోంమంత్రి అనిత

**అమరావతి, సెప్టెంబరు 22 ప్రభాతవార్త ప్రతినిధి:** పోలీసు విధుల్లో క్రమశిక్షణ, నిజాయితీ, మానవత్వం అత్యంత కీలకమని ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. తల్లిదండ్రుల త్యాగాలను ఎప్పటికీ గుర్తుంచుకుని ప్రజలకు సేవ చేయాలని నూతనంగా విధుల్లోకి అడుగుపెడుతున్న కానిస్టేబుళ్లకు సూచించారు. పోలీసు యూనిఫాం ప్రజల్లో భయాన్ని కాకుండా భరోసాను కల్పించేలా ఉండాలని అన్నారు. ఎపిఎస్పీ 6వ బెటాలియన్ బిటిసి పరేడ్ గ్రౌండ్స్‌లో మంగళవారం 2025–26 బ్యాచ్‌కు చెందిన 149 మంది స్టైపెండరీ క్యాడెట్ ట్రైనీ పోలీసు కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హోంమంత్రి అనిత శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. శిక్షణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన కానిస్టేబుళ్లకు అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా హోంమంత్రి అనిత మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవతో రాష్ట్రంలో కానిస్టేబుళ్ల నియామక ప్రక్రియను ఎన్నో అడ్డంకులను అధిగమించి పూర్తి చేశామని తెలిపారు. శిక్షణలో ఉన్న కానిస్టేబుళ్ల స్టైపెండ్‌ను రూ.4,500 నుంచి రూ.12,500కు పెంచుతున్నట్లు ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా 21 శిక్షణ కేంద్రాల్లో 5,800 మంది కానిస్టేబుళ్లకు శిక్షణ పూర్తయిందని తెలిపారు. వీరిలో



పోలీసు శిక్షణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన కానిస్టేబుళ్లకు అవార్డులను అందజేస్తున్న హోంమంత్రి

2,330 మంది ఎపిఎస్పీ కానిస్టేబుళ్లు ఉన్నారని వెల్లడించారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారిలో సుమారు 1,000 మంది మహిళా కానిస్టేబుళ్లు ఉండటం విశేషమన్నారు.

**ప్రజలకు పోలీసులంటే భరోసా కలగాలి:** పోలీసు వ్యవస్థకు కానిస్టేబుళ్లే వెన్నెముక అని హోంమంత్రి అనిత పేర్కొన్నారు. విపత్తులు, బందోబస్తు, అత్యవసర పరిస్థితుల్లో సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. మారుతున్న నేరాల తీరుకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని, సైబర్ నేరాల నియంత్రణకు సాంకేతిక నైపుణ్యాలు కలిగిన కానిస్టేబుళ్లకు ప్రత్యేక శిక్షణ అందించామని తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల సమస్యలను ఓపికగా విని, వారికి సత్వర న్యాయం అందించేలా పనిచేయాలని సూచించారు. పోలీసులంటే ప్రజల్లో భయం కాకుండా భరోసా కలిగేలా వ్యవహరించాలన్నారు.

**రాజ్యాంగానికి అనుగుణంగా విధులు:** రాజ్యాంగానికి అనుగుణంగా రాగద్వేషాలకు అతీతంగా నీతి, నిజాయితీ, కర్తవ్య స్ఫూర్తితో విధులు నిర్వర్తించాలని హోంమంత్రి అనిత దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర అభివృద్ధి కోసం రూపొందించిన 2047 విజన్‌లో కానిస్టేబుళ్లు కూడా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పదవీ విరమణ వరకు క్రమశిక్షణతో, ప్రశాంతంగా ప్రజలకు సేవలందిస్తూ పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని నూతన కానిస్టేబుళ్లకు హోంమంత్రి అనిత సూచించారు. రాజ్యాంగానికి అనుగుణంగా, రాగద్వేషాలకు అతీతంగా, నీతి, నిజాయితీతో, కర్తవ్య స్ఫూర్తితో విధులు నిర్వర్తించాలని సూచించారు. రాష్ట్ర అభివృద్ధిలో 2047 విజన్‌కు కానిస్టేబుళ్లు భాగస్వాములు కావాలన్నారు. పదవీ విరమణ వరకు క్రమశిక్షణతో, ప్రశాంతంగా సేవలందించి డిపార్ట్‌మెంట్‌కు మంచి పేరు తేవాలని హోంమంత్రి అనిత సూచించారు.

23-9Pg6exHMNWJQE.qxd OK:23-9Pg6exHMNWJQE.qxd 1/1/02 7:29 AM Page 1



# మున్సిపల్ ఎన్నికలకు కసరత్తు

- వార్డుల రిజర్వేషన్ల ఖరారుకు షెడ్యూల్

**విజయవాడ, సెప్టెంబరు 22 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో ఎస్సీ, ఎస్టీ, బిసి, మహిళా ఓటర్ల రిజర్వేషన్ల గుర్తింపు ప్రక్రియ ఈ నెల 23 నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. తొలి విడతగా రాష్ట్రంలోని 12 నగరపాలక సంస్థలు, 29 మున్సిపాలిటీలు/ నగర పంచాయతీలలో 9 రోజుల పాటు ఈ ప్రక్రియ కొనసాగనుంది. ఈ నెల 23 నుంచి 25 వరకు. ఎస్సీ, ఎస్టీ, మహిళా ఓటర్ల గుర్తింపు ప్రక్రియను వార్డుల వారీగా బూత్ స్థాయి అధికారులు నిర్వహిస్తారు. 26న ఈ జాబితాలు ఆయా మున్సిపల్ వార్డులలో ముసాయిదాగా ప్రకటిస్తారు. 27, 28 తేదీలలో ముసాయిదా ఓటర్ల గుర్తింపుపై వచ్చిన అభ్యంతరాలను స్వీకరిస్తారు. ఈ నెల 29, 30 తేదీలలో వీటిని పరిశీలించి క్షేత్ర స్థాయిలో ఏమైనా దిద్దుబాట్లు ఉంటే పూర్తి చేస్తారు. అక్టోబరు 1న ఎస్సీ, ఎస్టీ, మహిళా ఓటర్ల గుర్తింపునకు సంబంధించి తుది జాబితాను ప్రకటిస్తారు. బిసి ఓటర్ల విషయం లోనూ ఇదే రకంగా గుర్తింపు ప్రక్రియను నిర్వహిస్తారు. విశాఖ రీజియన్‌లో జివిఎంసితో సహా 4, రాజమహేంద్రవరం రీజియన్‌లో విజయవాడ మున్సి పల్ కార్పొరేషన్ సహా 7, గుంటూరు రీజియన్‌లో 9, అనంతపురం రీజియ న్‌లో 21 మున్సిపాలిటీలు, నగర పాలక సంస్థల్లో తొలి విడత కింద ఈ ఓటర్ల గుర్తింపు ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో వివరించింది. ఈ మేరకు మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్ కుమార్ ఉత్తర్వులు వెలువరించారు.

## సాయికృష్ణ తల్లి పిటిషన్‌పై హైకోర్టు తీర్పు రిజర్వు

**విజయవాడ, సెప్టెంబరు 22 ప్రభాతవార్త ప్రతినిధి:** గాదె సాయికృష్ణ తల్లి విజయలక్ష్మి పిటిషన్‌పై హైకోర్టులో మంగళవారం విచారణ జరిగింది. గాదె సాయికృష్ణ అదృశ్యం కేసును సిబిఐకి అప్పగించాలని పిటిషన్ దాఖలు చేశారు. ఇరువర్గాల వాదనలు విని హైకోర్టు తీర్పు రిజర్వ్ చేసింది.

## రాష్ట్రంలో ఎంఎస్ఎంఈ గ్రోత్ వర్క్‌షాప్‌లు



**అమరావతి, సెప్టెంబర్ 22,ప్రభాతవార్తప్రతినిధి:** ఒక కుటుంబం ఒక పారిశ్రామికవేత్త లక్ష్యంగా ఎంఎ స్ఎంఈ గ్రోత్ వర్క్‌షాప్‌లు ఔత్సాహిక పారిశ్రా మిక వేత్తలకు ఎంతో ఉపయోగపడుతున్నాయని కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. రాష్ట్రంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం, ప్రస్తుత ఎంఎస్ ఎంఈలను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ర్యాంప్ కార్యక్రమం నింహిస్తోందన్నారు. డిజిటల్ వాణిజ్యం, ఇకామర్స్, ఎగుమతులు, ఆర్థిక సహాయం మరియు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను పారిశ్రా మికవేత్త లకు మరింత చేరువ చేసేందుకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు మంత్రి తెలిపారు. తొలిదశలో ఎన్టీఆర్, కాకినాడ, కృష్ణా, పల్నాడు జిల్లాల్లో ఈ గ్రోత్ షాప్‌లు విజయ వంతమయ్యాయన్నారు. ఈ వర్క్‌షాప్‌లలో 1,633 మంది పారిశ్రామికవేత్తలు / ఎస్‌హెచ్‌జీ సభ్యులు, 117 మంది విద్యార్థులు / ఔత్సాహిక వ్యాపారవేత్తలు, 258 మంది అధికారులు మరియు రీసోర్స్ పర్స న్లు పాల్గొనగా.. వ్యాపార అవకాశాలు, డిజిటల్ మార్కెటింగ్, రుణ సదుపాయాలు, ఎగుమతులపై నిపుణులచే ప్రత్యేక అవగాహన కల్పించినట్టు మంత్రి తెలిపారు. తొలి విడతకు వచ్చిన విశేష స్పందన నేపథ్యంలో ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ రెండో విడత గ్రోత్ వర్క్‌షాప్‌ల నిర్వహణకు షెడ్యూల్ విడుదల చేసిందని మంత్రి కొండపల్లి తెలిపారు. ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిర్వహించే ఈ సదస్సులు ఈ నెల 22న తిరుపతి, 24న నెల్లూరు, 25న బాపట్ల, 26 గుంటూరు, 29న అనంతపురం, 30న సత్యసాయి జిల్లాల్లో జరుగుతాయని మంత్రి తెలిపారు.

# చేనేతల్ల పేరుతో అవినీతి మేత!

- నకిలీ కార్డుల జారీ వైనం..చేనేత,జౌళి శాఖ చోద్యం
- అడిగినంత ఇచ్చినవారికల్లా అడ్డదారిలో కార్డుల జారీ
- ఉన్నతాధికారుల కళ్లకు గంతలు కడుతున్న క్షేత్రస్థాయి అధికారులు

**తాడిపత్రి, సెప్టెంబరు22, ప్రభాతవార్త:** ప్రభుత్వ ప్రోత్సాహం కరవై..పథకాలు దూరమై చేనేత వృత్తి కనుమరుగయ్యే పరిస్థితుల్లో అడపాదడపా ప్రభుత్వాలు కల్పించే భరోసాను కూడా అక్రమార్కులు అడ్డదారిలో వచ్చి తన్నుకు పోతున్నారు. నేతన్న సేవలో, 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, చేనేత పింఛను వంటి పథకాలు చేనేతలకు ఉద్దేశించినవే అయినప్పటికీ వాటికి నకిలీ మకిలీ అంటుకొని అసలైన చేనేతలు విలవిలలాడుతు న్నారు. పథకాలు పక్కదా రి పడుతుండటం, వృత్తిలో పురోగతి ప్రశ్నార్థ కంగా మారడంతో యువతరం ఈ వృత్తిలోకి వచ్చేందుకు సుము ఖంగా లేకపోవడంతో క్రమంగా కనుమరు గయ్యే పరిస్థితి దాపురిం చింది. ఈ దుస్థితికి తోడు చేనేతల పేరుతో అమలయ్యే సంక్షేమ పథకాలను దోచుకు తిం టూ తమ జేబులు నింపుకునేవారు ఇటీవల ఎక్కువయ్యారు. ఇలాంటి వారిని నిలువరించా ల్సి న సంబంధి త చేనేత, జౌళి శాఖ చోద్యం చూస్తుండటం పలు అనుమానాలకు తావిస్తోంది.



**పథకం చేనేతలది..పైకం పరాన్నజీవులది..!**

ఆలస్యంగానైనా గత ప్రభుత్వానికి ధీటుగా 'నేతన్న సేవల్లో' పథకం కింద చేనేతలకు రూ.25వేల ఆర్థిక సాయం అందించాలనే ప్ర భుత్వ లక్ష్యం క్షేత్రస్థాయి అమలులో అభాసు పాలయ్యింది. పథకం చేనేతలది..పైకం పరాన్నజీవులది అనే చందంగా అగ్రభాగం అక్రమార్కులే కాజేశారు. జిల్లా వ్యాప్తంగా ప్రాథమికంగా 8,361 మందిని నేతన్న సేవలో పథకానికి అర్హులుగా జిల్లా అధికారులు గుర్తించగా 7,209 మందికి రూ.25 వేల వంతున ఆర్థిక సాయం అందింది. అయితే ఇక్కడ అర్హులకు బదులు అనర్హులే ఎక్కువగా ఉండారనడానికి ఆ తర్వాత కుప్పలు తెప్పలుగా వచ్చిన దరఖాస్తులే నిదర్శనం. ఇటీవల సామాజిక భద్రత కల్పించడంలో భాగంగా ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పింఛన్లకు దరఖాస్తులు ఆహ్వానించడంతో అన్ని వర్గాలతో పాటు చేనేతలు కూడా దరఖాస్తులు చేసుకున్నారు. అయితే చేనేతల మాటున అనర్హులు తమ విశ్వరూపాన్ని చాటారు. చేనేత వృత్తి పట్ల కనీస అవగాహనలేని వారు కూడా దళారులకు తృణమో, ఫణమో ముట్టచెప్పి చేనేత, జౌళి శాఖ కార్యాలయం నుంచి ధృవీకరణ పత్రాలు ఇబ్బడిముబ్బడిగా పొందారు. రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు దళారులకు ముట్టచెప్పితే చాలు చేనేత గుర్తింపు కార్డు, చేనేత జౌళిశాఖ ధృవీకరణ ఇంటి ముంగిట్లో వాలిపడేలా పరిస్థితిని తయారు చేశారు. ఇంకేముంది సచివాలయాల్లో ఇతర వర్గాల పింఛన్ల దరఖాస్తులను తలదన్నేలా చేనేత పింఛను దరఖాస్తులు కుప్పలు తెప్పలుగా వచ్చిచేరాయి. సచివాలయానికి సగటున 55 చొప్పున యాడికిలోని 5 సచివాలయాల్లోనే 274 దరఖాసులు రాగా, ఇతర సచివాలయాల్లో 100కు పైగా వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు.

**ఓ చేనేత జౌళిశాఖ అధికారి ఏమంటున్నారంటే..!**

"సచివాలయాల సిబ్బంది క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లకుండా కేవలం చరవాణిల ద్వారా క్షేమ సమాచారాలు కనుక్కునట్లు 'మీది సొంత మగ్గమేనా..ఎనేళ్లుగా మగ్గం నేస్తున్నార్లు' అంటూ ఆరా తీయడంతోనే సరిపెట్టడంతో ఈ సమస్య వచ్చిపడింది. జిల్లా కేంద్రంలోని తమ కార్యాలయానికి ధృవీకరణ పత్రాల కోసం వచ్చిన వారు తమ గ్రామాలు, తమ కాలనీల్లో తెలిసిన వారివి కూడా తామే తీసుకొని పోతామంటే హాజరు కానివారివి కూడా అడిగినవారికే ఇవ్వాల్సి వచ్చింది. ఆ ధృవీకర ణలు తీసుకొని పోయినవారు మా పేరు చెప్పి ప్రత్యక్షంగా హాజరు కాని వారితో సొమ్ము చేసుకున్నట్లు తెలిసింది. జిల్లా అంతటా కలిపి 1,300 పింఛను దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. మరి కొంత గడువు పెం చి ఉంటే ఆయా సచివాలయాల్లో నిలిచిపోయిన నకిలీధృవీకరణతో కూడిన దరఖాస్తులు మా కార్యాలయానికి చేరేవి. అవి అక్కడే ఆగి పోయాయ్యి. అని ఓ చేనేత, జౌళి శాఖ అధి.కారి వివరించడం కొసమెరు పు.40 ఏళ్లుగా నేస్తున్నా ఏ పథకం దక్కడం లేదు–నజీర్ అహమ్మద్, రాఘవేంద్ర కాలనీ, యాడికి. ప్రస్తుతం నా వయసు 61 సం. 40 ఏళ్లుగా మగ్గం నేస్తున్నాను. 50 ఏళ్లు దాటిన వృటి నుంచి చేనేత పింఛనుకు, నేతన్న నేస్తం కు, నేతన్నసేవలో పథకానికి కూడా దరఖాస్తు చేసుకుంటూనే ఉన్నాను. ఏ పథకమూ దక్కడం లేదు.

# ఎల్‌నినో ప్రభావంతో విద్యుత్ డిమాండ్ విపరీతంగా పెరిగింది - మంత్రి గొట్టిపాటి రవికుమార్



**విజయవాడ,సెప్టెంబరు 22,ప్రభాతవార్తప్రతినిధి:** ఎల్‌నినో ప్రభావంతో విద్యుత్ డిమాం డ్ విపరీతంగా పెరిగిందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. మంగళవారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. గతేడాది ఇదే రోజుల్లో కేవలం 240 మిలియన్ యూనిట్లుగా ఉందని.. ఇప్పుడు రోజువారి వినియోగం 290 మిలియన్ యూనిట్లకు చేరిందని వెల్లడించారు. అధిక ఎండల వలన ఈ ఏడాది దాదాపు 20 శాతంపైగా విద్యుత్ వినియోగం పెరిగిందని వివరించారు. జెన్కో సంస్థ రికార్డు స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నా పెరిగిన వినియోగంతో ఇబ్బందులు తప్పడం లేదన్నారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా బయట నుంచి కొనుగోళ్లు చేసి విద్యుత్ అంతరాయాలు లేకుండా చూస్తున్నామని చెప్పారు.గ్రామీణ ప్రాంతాలు, పట్టణాలలో పవర్ కట్స్ లేకుండా చేయాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. సీఎం చంద్రబాబు ప్రతి వారం విద్యుత్ శాఖపై సమీక్ష చేసి దిశానిర్దేశం చేస్తున్నారని అన్నారు. ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా విద్యుత్ సమస్యలు ఉత్పన్నమయ్యాయన్నారు. మహారాష్ట్ర, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడుతో పాటు పలు రాష్ట్రాల్లో విద్యుత్ స్కేర్ సిటీ ఉందని వెల్లడించారు. అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో వర్షాలు కురుస్తున్నా...పెద్దగా ప్రయోజనం ఉండటం లేదన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు విద్యుత్ అంతరాయాలు లేకుండా చూడటానికి ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు.

## పంచాయతీరాజ్ శాఖలో పలువురు అధికారుల బదిలీ

**విజయవాడ,సెప్టెంబరు 22,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ శాఖలో పలువురు అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వివిధ జిల్లాలకు గ్రామీణ పంచాయతీ అధికారులు, డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారులు, జిల్లా ప్రజాపరిషత్ డిప్యూటీ సీఈవోలుగా బాధ్యతలు అప్పగించింది. పశ్చిమ గోదావ రి జిల్లా గ్రామ పంచాయతీ అధికారిగా పి.విజయభాస్కర్ నియమితులయ్యారు. అమలాపురం డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారిగా పి.వసంత మాధవి బాధ్యతలు చేపట్టనున్నారు. అనకాపల్లి జిల్లా పంచాయతీ అధికారిగా ఎస్.మంజుల వాణి, అనకాపల్లి డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారిగా కె.రమామణి నియమితులయ్యారు. సత్యసాయి జిల్లా గ్రామ పంచాయతీ అధికారిగా ఎం.వెంకటరత్నం బాధ్యతలు చేపట్టనున్నారు. కదిరి డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారిగా వి.రామాంజనేయులు నియమితులయ్యారు. ఎన్టీఆర్ జిల్లా ప్రజాపరిషత్ డిప్యూటీ సీఈవోగా కె. అనురాధ, అనకాపల్లి జిల్లా ప్రజాపరిషత్ డిప్యూటీ సీఈవోగా ఇ.సందీప్ నియమితులయ్యారు. సత్యసాయి జిల్లా ప్రజాపరిషత్ డిప్యూటీ సీఈవోగా వై.సమంత నియమితులవగా, మాంన్యపురం జిల్లా ప్రజాపరిషత్ డిప్యూటీ సీఈవోగా సీహెచ్ దుర్గా ప్రసాద్ బాధ్యతలు చేపట్టనున్నారు.

# అవన్నీ కట్టు కథలే : ఎపి పిసిసి అధ్యక్షురాలు షర్మిల



**అమరావతి,సెప్టెంబరు 22,ప్రభాతవార్తప్రతినిధి:** సామాజిక మాధ్యమాల్లో వస్తున్నవని తప్పుడు కథనాలేనని ఎపి పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి స్పష్టం చేసారు, ఈ మేరకు ఆమె "ఎక్స్"తెలిపారు."నేను ఎవరినో కలిసి నట్లు, ఎక్కడో చేరిపోతున్నట్లు సోషల్ మీడియాలో అల్లు తున్నవి కట్టుకథలు మాత్రమే. ఈ విశ్లేషణలు పూర్తిగా ని రాధారం. శుభకార్యానికి, రాజకీయానికి ముడిపెట్టి నా విశ్వ సనీయతను దెబ్బతీయాలని చూస్తే ఊరుకునేది లేదు" అని షర్మిల హెచ్చరించారు. తన సోదరుడు, వైసీపీ అధి నేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డితో తాను రహస్యంగా సమావేశం అవుతున్నట్లు వస్తున్న వార్తలు పూర్తిగా నిరాధారమని, అవి కేవలం కట్టుకథలని కొట్టిపారేశారు.తన కుమార్తె వివాహాన్ని అడ్డుపెట్టుకుని తెర వెనుక రాజకీయాలు చేసుకునే ఖర్మ వైఎస్సార్ బిడ్డగా తనకు లేదని ఘాటుగా వ్యాఖ్యానించారు. కొద్దిరోజులుగా తాను జగన్‌ను కలవ బోతున్నట్లు సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు షర్మిల తెలిపారు.తన కుమారుడు రాజారెడ్డి వివాహానికి ఆహ్వానించేందుకు వెళ్లిన ప్పుడే తాను చివరిసారిగా జగన్‌ను కలి శానని గుర్తుచేశారు. ఇప్పుడు మళ్లీ కలిస్తే, అది కేవలం తన కుమార్తె అంజిలి రెడ్డి వివాహ మహోత్సవానికి ఆహ్వాన పత్రికను అందించడానికి మాత్రమేనని స్పష్టం చేశారు. అన్ని రాజకీయ పార్టీల అధినేతలను ఆహ్వానించినట్లే జగన్‌ను కూడా పిలుస్తానని, ఇందులో వింతేమీ లేదని అన్నారు. శుభకార్యానికి, రాజకీయానికి లింకులు పెట్టి, నా విశ్వసనీయతను, రాజకీయ ప్రామాణికతను, ప్రజలు నాపై పెట్టుకున్న నమ్మకాన్ని దెబ్బతీయాలని చూస్తే ఊరుకునేది లే దు.నా బిడ్డ వైఎస్ అంజిలి రెడ్డి సోమల రఘురామ్ రెడ్డి వివాహ మహోత్సవానికి తెలుగు ప్రజలందరూ.. ఒక్కటి కాబోతున్న నవదంపతు లకు హృదయ పూర్వక ఆశీస్సు లు అందించాలని కోరు తున్నా అని షర్మిల పేర్కొన్నారు.

## వేడి సాంబారు పాత్రలో పడి మహిళ మృతి

**విజయవాడ,సెప్టెంబరు 22,ప్రభాతవాక్తప్రతినిధి:** విజయవాడలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో తీవ్ర అపశ్రుతి చోటు చేసుకుంది. ప్రమాదవశాత్తు వేడి సాంబారు ఉన్న పాత్రలో పడి తీవ్రంగా వంట మహిళ కార్మికురాలు గాయపడింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయింది. ఈ ఘటన నగరంలో విషాదాన్ని నింపింది. కేఎల్‌రావునగర్ ఐదో వీధికి చెందిన మద్ది సుజాత తన చిన్న కుమారుడితో కలిసి నివసిస్తోంది. సెప్టెంబర్ 20న తమ వీధిలో ఏర్పాటు చేసిన వినాయక నిమజ్జనం సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం కోసం సుజాత తన బంధువులతో కలిసి వంట పనుల్లో సాయం చేస్తున్నారు. ఈ క్రమంలో పొయ్యి మీద నుంచి దించిన పెద్ద సాంబారు పాత్రను మరో మహిళతో కలిసి పక్కకు తరలిస్తుండగా సుజాత పట్టు తప్పి అదుపుకోల్పోయారు. దీంతో ఆమె నేరుగా ఆ వేడి సాంబారు పాత్రలోనే పడిపోయారు.ఈ దుర్ఘటనలో సుజాత ముఖం, ఛాతీతో పాటు శరీరం మొత్తం తీవ్రంగా కాలిపోయింది. వెంటనే అప్రమత్తమైన స్థానికులు ఆమెను పాత్రలో నుంచి బయటకు తీసి, హుటాహుటిన సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న ఆమె, పరిస్థితి విషమించడంతో సోమవారం తుదిశ్వాస విడిచారు.

# తిరుమల సమాచారం

## అలిపిరి నడకమార్గంలో చెట్టు పై చిరుత

- 2,765వ మెట్టు సమీపంలో చెట్టుపై చిరుత... భక్తుల పరుగులు



**తిరుమల, సెప్టెంబరు 22 ప్రభాతవార్త ప్రతినిధి:** ఇదివరకటి కంటే భిన్నంగా తిరుమల నడకదారిలో ఏకంగా ఓ చిరుతపులి చెట్టెక్కి కూర్చుని మెట్లదారిలో నడిచివచ్చే భక్తులను గమనించడం భయాందోళన కలిగిస్తోంది. మొన్నటివరకు ఘాట్‌రోడ్లపై, కాలినడక మార్గాల్లో సంచరించిన చిరుతలు మంగళవారం వేకువజామున అలిపిరి మెట్లదారిలో చెట్టెక్కి కూర్చోవడం భక్తులను వణికిస్తోంది. మెట్లమార్గంలో మరోసారి చిరుత సంచారం మంగళవారం ఉదయం కలకలం రేపుతోంది. తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనం కోసం అలిపిరి నడక మార్గంలో భక్తులు ఉదయం 4గంటల నుండి రాత్రి 9.30గంటల వరకు అనుమతి ఉంటుంది. ఇలా వచ్చే భక్త లను ఇప్పటికే గుంపులుగుంపులుగా పంపుతున్నారు. అయితే తాజాగా 2,765వ మెట్టు సమీపంలోని అటవీ ప్రాంతంలో చెట్టుపైకి ఎక్కి కూర్చుని ఉండటాన్ని భక్త లకు కనిపించడంతో భయాందోళనకు గురయ్యారు. అక్కడి నుంచి పరుగులు తీశా రు. భద్రతా సిబ్బందికి చిరుత సంచారంపై సమాచారం అందజేశారు. వెంటనే టిటి డి విజిలెన్స్, అటవీ సిబ్బంది ఘటనాస్థలికి చేరుకున్నారు. అప్పటికే చిరుత చెట్టుపై నుండి దిగి అటవీ ప్రాంతంలోకి వెళ్లిపోయింది. నడక మార్గంలో చిరుత సంచారంతో భద్రతా సిబ్బంది అప్రమత్తమయ్యారు. తిరుమలకు నడక దారిని వచ్చే భక్తులను గుంపులు గుంపులుగా పంపుతున్నారు. ఒంటరిగా ఎవరూ వెళ్లవద్దని, గుంపులుగా వెళ్లాలని భక్తులకు భద్రతా సిబ్బంది సూచనలు చేస్తున్నారు.

## శ్రీకాళహస్తీశ్వరుని పవిత్రోత్సవాలకు శ్రీకారం



**శ్రీకాళహస్తి, సెప్టెంబరు 22 ప్రభాతవార్త:** దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధిలో వార్షిక పవిత్రోత్సవాలు మంగళవారం భక్తి శ్రద్ధలతో స్థానిక సంప్రదాయం ప్రకారం ప్రారంభమయ్యాయి. ఆలయంలోని గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు ధర్మకర్తల మండలి సభ్యులు వాకచర్ల గుర్రప్పశెట్టి కుసుమకుమారిలచే సంకల్పం చేయించారు. ఆలయ ప్రధానార్చకులు డాక్టర్ స్వామినాధన్ గురుకుల్, పారోహితులు అర్థగిరి స్వామి వేదపండితులు వేద మంత్రాలను పఠిస్తుండగా శ్రీకాళహస్తి ఉత్సవర్లను మహర్షి భరద్వాజ మహర్షి ఉత్సవమూర్తిని కొలువు తీర్చి విశేష అభిషేక పూజలు నిర్వహిం చారు. ఉత్సవర్లకు వివిధ రకాల పూజ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించా రు. విశిష్ట అలంకారాలు, ధూపదీప నైవేద్యాలు నివేదించి పూర్ణాహుతి అందించారు. ఈ కార్యక్రమాల్లో ఆల య ప్రదానార్చకులు డాక్టర్ స్వామి నాధన్ గురుకుల్, ఎస్ఎంకె పరశురామ్ గురుకుల్, పారోహితులు అర్థగిరిస్వామి, ప్రధానార్చకులు సంబంధం గురుకుల్, కరుణాకర్ గురుకుల్, అర్చకులు శ్రీనివాస గురుకుల్, తేజస్వామి, గోవింద్‌స్వామి, ఆలయ ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి, పర్యవేక్షకులు నాగభూషణం యాదవ్, ఆలయ ఇన్‌స్పెక్టర్ హరియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవారి సేవలో సినీనటి డింపుల్ హాయతీ



**తిరుమల, సెప్టెంబరు 22 ప్రభాతవార్త ప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీనివాసుడిని సినీనటి డింపుల్ హాయతీ దర్శించుకున్నారు. శ్రీ వారి దర్శనార్థం కుటుంబ సభ్యులతో కలిసి ఆ మె మంగళవారం ఉదయం తిరుమలకు చేరుకున్నారు. విఐపి బ్రేక్ దర్శన సమయంలో ఆల యంలోపలకు వెళ్లి స్వామి వారిని దర్శించు కున్నారు. దర్శనాంతరం రంగనాయకుల మండ పంలో వేద పండితులు వేద ఆశీర్వచనం చేశా రు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థ ప్రసా దాలను, శేషవస్త్రం అందజేశారు.

# భక్తుల మనోరథంపై శ్రీనివాసుడు

- ఉభయదేవేరులతో ఊరేగిన మలయప్ప
- గోవింద నామంతో ఏడుకొండలు పునీతం



**తిరుమల, సెప్టెంబరు 22 ప్రభాతవార్త ప్రతినిధి:** భక్తులే స్వయంగా సేవకులై భగవంతుని రథాన్ని లాగి "ఆత్మరథికుడు, శరీరమే రథం. బుద్ధి సారథి, మనస్సు పగ్గం. ఇంద్రియాలే గుర్రాలు. విషయాలే వీధులు. ఈ రీతిలో శరీరాన్ని రథంతో పోల్చి మహారథాన్ని లాగారు. స్థూలశరీరం వేరని, సూక్ష్మశరీరం వేరని, ఆత్మ అందుకు భిన్నమనే ఆత్మానాత్మ వివేకం" కలుగుతుంది. రథోత్సవంలో ముఖ్యంగా కలిగే తత్త్వజ్ఞానమిదేనని దేవదేవుడు భక్తులకు హితవుచేస్తాడు. ఏడుకొండల్లో అత్యంత వైభవంగా జరిగిన తొమ్మిదిరోజుల సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో మంగళవారం ఉదయం భూదేవిశ్రీదేవిసమేత మలయప్పస్వామి మహోన్నతరథంపై అధిరోహించి భక్తులకు దర్శనమిచ్చాడు. ఆలయం ముందుకు వేంచేపుచేసిన ఉత్సవమూర్తులను వేదమంత్రోచ్చరణల నడుమ అర్చకులు కర్పూరహారతులిచ్చి ఆలయ మాఢవీధుల్లో ప్రదక్షణగా ఊరేగించారు. ఉదయం 7గంటలకు మొదలైన ఈ మహారథం 11గంటల వరకు సాగింది. స్వామివారి రథం ముందు భక్తులు ఏడుకొండలవాడాగోవిందా.. శ్రీనివాసా గోవిందా అంటూ నామస్మరణలతో స్వయంగా ఈ రథాన్ని లాగి భక్తిపారవశ్యంతో పునీతులయ్యారు. శ్రీహరి గరుధధ్వజుడై నాలుగు గుర్రాలు పూన్చిన రథంపై విహరించాడు. భక్తులు తిరుమాఢవీధులలో అడుగడుగునా కర్పూరనీరాజనాలు సమర్పించా రు. మహారథోత్సవంలో పెద్దజీయర్‌స్వామి, చిన్న జీయర్‌స్వామి, టిటిడి ఛైర్మన్ బి.ఆర్. నాయుడు, ఇఒ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ సి.హెచ్. వెంకయ్య చౌదరి, జెఇఒ డాక్టర్ ఎ.శరత్, తిరుపతి ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, సివిఎస్ఒ మురళీకృష్ణ, ఎస్వీబిసి ఛైర్మన్ శ్రీధర్ వర్మ, ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు. అధికారుల స్వీయ పర్యవేక్షణలో రథోత్సవం ప్రశాంతంగా ముగిసింది.

## దసరా, దీపావళికి నరసాపురం నుంచి
## చర్లపల్లి, తిరువణ్ణామలైకి పూజా ప్రత్యేక రైళ్లు

**భీమవరం, సెప్టెంబరు 22 ప్రభాతవార్త:** నరసాపురం నుంచి దసరా, దీపావళి పండుగల సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని చర్లపల్లి, తిరువణ్ణామలైలకు ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు. ప్రత్యేక రైళ్ల కోసం తాను చేసిన విజ్ఞప్తికి దక్షి ణ మధ్య రైల్వే సానుకూ లంగా స్పందించిందని పేర్కొన్నారు.

**నరసాపురం-చర్లపల్లి:** రైలు నంబర్ 07062 అక్టోబరు 4, 11, 18, 25, నవంబరు 1, 8, 15, 22, 29 తేదీల్లో నడుస్తుంది. నరసాపురంలో రాత్రి 10 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.30 గంటలకు చర్లపల్లి చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 07063 రైలు అక్టోబరు 5, 12, 19, 26, నవంబరు 2, 9, 16, 23, 30 తేదీల్లో చర్లపల్లి నుంచి రాత్రి 7.50 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7 గంటలకు నరసాపురం చేరుతుంది. పాలకొల్లు, భీమవరం టౌన్, ఆకివీడు, కైకలూరు, గుడివాడ, విజయవాడ, గుంటూరు తదితర స్టేషన్లలో ఈ రైళ్లు ఆగుతాయి.

**నరసాపురం-తిరువణ్ణామలై:** రైలు నంబర్ 07291 అక్టోబరు 4 నుంచి నవంబరు 29 వరకు ప్రతి ఆదివారం నడుస్తుంది. నరసాపురంలో మధ్యా హ్నం ఒంటి గంటకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 4.55 గంటలకు తిరువణ్ణామలై చేరు తుంది. తిరుగు ప్రయాణంలో 07292 రైలు అ క్టోబరు 5 నుంచి నవంబరు 30 వరకు ప్రతి సో మవారం రాత్రి 8 గంటలకు తిరువణ్ణామలై నుం చి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 10.45 గంటలకు నరసాపురం చేరుతుంది.

ఈ రైళ్లు పాలకొల్లు, భీమవరం టౌన్, ఆకివీడు, కైక లూ రు, విజయవాడ, తెనాలి, బాపట్ల, చీరాల, ఒం గోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, తిరుప తి, చిత్తూరు, కాట్పాడి తదితర స్టేషన్లలో ఆగుతాయి.పండుగ రద్దీని దృష్టిలో ఉంచుకుని నడుపుతున్న ఈ ప్రత్యేక రైలు సేవలను నరసాపురం ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి శ్రీనివాస వర్మ కోరారు. మొత్తం 23 కోచ్‌లతో ఈ ప్రత్యేక రైళ్లు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

## శ్రీవారి సేవకుల సేవల పట్ల భక్తులందరూ ఆనందం

- బ్రహ్మోత్సవాల్లో శ్రీవారి సేవకుల సేవలు అద్భుతం
- టిటిడి అదనపు ఇఒ వెంకయ్య చౌదరి





**తిరుమల, సెప్టెంబరు 22 ప్రభాతవార్త ప్రతినిధి:** శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో శ్రీవారి సేవకులు అద్భుతమైన సేవలందించారని టిటిడి అదనపు ఇఒసి.హెచ్.వెంకయ్య చౌదరి కొనియాడారు. తిరుమల సేవా సద న్2 లోని సత్సంగం హాలులో శ్రీవారి సేవ గ్రూప్ సూపర్‌వైజర్లతో మంగళవా రం ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు ఇఒ మాట్లాడుతూ శ్రీవారి సేవకుల సేవల పట్ల భక్తులందరూ ఆనందం వ్యక్తం చేశారని చెప్పారు. గరుడసేవ సందర్భంగా మాడ వీధుల్లోని భక్తులకు అన్న పానీయాలు, తాగునీటి పంపిణీలో శ్రీవారి సేవకులు చేసిన కృషి అభినందనీయమన్నారు. శ్రీవారి సేవకుల సేవలను పర్యవేక్షి ంచిన గ్రూప్ సూపర్వైజర్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఇదే ఉత్సా హంతో రాబోయే నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో కూడా తమ అత్యుత్తమ నిస్వార్థ సేవలు అందించాలని కోరారు. సివిఎస్ఒ మురళీకృష్ణ మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి చిన్న అసౌకర్యం కూడా కలగకుండా సేవలు అందించిన శ్రీవారి సేవకులకు ధన్యవాదాలు తెలిపారు.అనంతరం శ్రీవారి సేవ గ్రూప్ సూపర్వైజర్లు వివిధ ప్రాంతాల్లో తాము సేవా విధులు నిర్వహిస్తున్న సమయంలో తమ అభిప్రాయాలను అందించారు. ఈసమావేశంలో టిటిడి సిపిఆర్ఒ, శ్రీవారి సేవా విభాగం అధిపతి డాక్టర్ తలారిరవి, పిఆర్ఒ (ఎఫ్ఏసి) పి.నీలిమ, శ్రీవారి సేవా విభాగం సిబ్బంది, దాదాపు 150 మంది గ్రూప్ సూపర్‌వైజర్లు (వీరిలో తొలిసారి సింగపూర్, ఆఫ్రికా దేశాలకు చెందిన ఎన్ఆర్ఐలు) పాల్గొన్నారు.

## రేపట్నుంచి ఉచిత టైమ్‌స్లాట్ టోకెన్లు పునర్ధురణ

**తిరుమల, సెప్టెంబరు 22 ప్రభాతవార్త ప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనంలో అమలవుతున్న ఆఫ్‌లైన్ ఉచిత సర్వదర్శన సమయనిర్ధేశిత టోకె న్లు జారీ నిలుపుదలను మరో రోజు పొడిగిం చారు. 23వతేదీ(నేటి)తో శ్రీవారి బ్రహ్మోత్సవా లు ముగుస్తున్నా బుధవారం కావడంతో టోకెన్లు జారీ చేయరు. దీంతో గురువారం ఉదయం నుండి ఈ ఉచిత సర్వదర్శన టోకెన్లు జారీని పునరుద్ధరిస్తారు. ఇప్పటికే ఈనెల 15వతేదీ నుండి 23వరకు అన్ని ఆర్జితసే వలు, ప్రత్యేక దర్శనాల రద్దుతోబాటు ఉచిత టైమ్‌స్లాట్ టోకెన్లు జారీ టిటిడి రద్దుచేసిన విషయం విదితమే. సాలకట్ల బ్రహ్మోత్సవాల నేపథ్యంలో తిరుమలకు వచ్చే భక్తులు రికార్డు స్థాయిలో రద్దీ పెరుగుతుండటంతో వారి సౌకర్యార్థం, నియంత్రణ కోసం ఉచిత సర్వద ర్శనం టైమ్ స్లాట్ (ఎస్ఎస్‌డీ) టోకెన్ల నిలుపుదల బుధవారం వరకు పొడిగిం చారు. రద్దీ ఒత్తిడి తగ్గకపోవ డంతో 24వ తేదీ వరకు రద్దు ప్రక్రియను పొడి గిస్తూ బోర్డు నిర్ణయం తీసుకుంది. తిరిగి సెప్టెం బర్ 25 నాటి దర్శనానికి సంబంధించిన ఎస్ఎస్‌డి టోకెన్లను ఈనెల 24న తిరుపతిలోని కౌంటర్లలో పంపిణీ చేయనున్నారు..

## అశ్వంపై 'కల్కి అలంకారంలో' కలియుగదేవుడు

**తిరుమల, సెప్టెంబరు 22 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల వెంకన్న సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాల్లో చివరి వాహనం మంగళవారం రాత్రి అశ్వవాహనంపై కల్కి అలంకారంలో భక్తులను కటాక్షించాడు. కలియుగాంతంలో స్వామి కల్కిమూర్తియై గుర్రంపై పయనిస్తూ, ఖడ్గధారియై దుష్టశిక్షణం, శిష్టరక్షణం చేస్తాడని పురాణాలు పేర్కొన్నాయి. ఈ అశ్వవాహనత్వం, కల్కి అవతారాన్ని గుర్తుచేస్తుంది. శ్రీహరి శ్రీనివాసుడై ఈ లోకంలో వేంకటాచలం చేరి అక్కడ నుంచి పద్మావతిదేవిని పెళ్ళాడటానికి మొట్టమొదట వేటనెపంతో గుర్రంపైనే వచ్చాడట. దేవుడి రథాన్ని లాగేవి గుర్రాలే. ఈ వాహనసేవలో పెద్దజీయర్‌స్వామి, చిన్న జీయర్‌స్వామి, టిటిడి ఛైర్మన్ బి.ఆర్. నాయుడు, ఇఒ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ సి.హెచ్. వెంకయ్య చౌదరి, జెఇఒ డాక్టర్ ఎ. శరత్, తిరుపతి ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, సివిఎస్ఒ మురళీకృష్ణ, ఎస్వీబిసి ఛైర్మన్ శ్రీధర్ వర్మ, ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 12 రాజ్యసభ స్థానాలకు
# అక్టోబర్ 16న ఎన్నికలు

### - వచ్చే 6వ తేదీ వరకు నామినేషన్లు
### - షెడ్యూల్ విడుదల చేసిన ఇసి

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 22:** 11 రాజ్యసభ స్థానాలకు ద్వైవార్షిక ఎన్నికలతో పాటు, పశ్చిమ బెంగాల్‌లోని ఒక స్థానానికి ఉప ఎన్నికను అక్టోబర్ 16న నిర్వహించనున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ద్వైవార్షిక ఎన్నికల్లో భర్తీ కానున్న 11 స్థానాల్లో 10 ఉత్తరప్రదేశ్‌కు, ఒకటి ఉత్తరాఖండ్‌కు చెందినవి. ఎగువ సభలో (రాజ్యసభలో) ఏర్పడిన ఆకస్మిక ఖాళీని భర్తీ చేయడానికి పశ్చిమ బెంగాల్ స్థానానికి ఎన్నిక జరుగుతుంది. ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం, సెప్టెంబరు 29న నోటిఫికేషన్ విడుదలవుతుంది. నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ అక్టోబరు 6గా ఉంటుంది. 7న పరిశీలన, 9న నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీగా ఉంటుంది. రాజ్యసభ స్థానాలకు పోలింగ్ అక్టోబర్ 16న ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతుంది, అదే రోజు సాయంత్రం 5 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. ఉత్తరప్రదేశ్‌లో, 10 మంది ప్రస్తుత రాజ్యసభ సభ్యుల పదవీకాలం ముగియనుంది.

పదవీకాలం ముగుస్తున్న వారిలో అరుణ్ సింగ్, గీత అలియాస్ చంద్రప్రభ, బ్రిజ్ లాల్, రామ్ గోపాల్ యాదవ్, రామ్‌జీ గౌతమ్, బి.ఎల్. వర్మ, సీమా ద్వివేది, దినేష్ శర్మ, హర్దీప్ సింగ్ పూరీ ఉన్నారు.

ఉత్తరాఖండ్‌లో, ప్రస్తుత రాజ్యసభ సభ్యుడు నరేష్ బన్సాల్ పదవీకాలం ముగియడం వల్ల ఉప ఎన్నిక అనివార్యమైంది. పశ్చిమ బెంగాల్ స్థానం విషయానికొస్తే, రుక్మిణి మల్లిక్ రాజ్యసభకు రాజీనామా చేయడంతో అక్కడ ఉప ఎన్నిక జరుగుతోంది.

### వందేమాతరం పూర్తిగా పాడలేదని
# పౌరుడిని శిక్షించలేం!

### సుప్రీం కోర్టు తాజా వ్యాఖ్యలు సంచలనం



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 22:** జాతీయ గేయం వందేమాతరం ఆలపించే విషయంలో వివాదం చెలరేగుతున్న సంగతి తెలిసిందే. ఈ గేయంలోని ఆరు చరణాలను పాడాల్సిందే అంటూ కేంద్రం చట్టం తీసుకొచ్చింది. అయినప్పటికీ, వందేమాతరంలోని పూర్తి చరణాలు ఆలపించడాన్ని కాంగ్రెస్ సహా దేశంలోని పలు రాజకీయ పార్టీలు, సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. ఈ అంశంపై సుప్రీంకోర్టు తాజాగా కీలక మార్గదర్శకాలు జారీ చేసింది. ఆరు చరణాలు పాడకపోయినంత మాత్రాన పౌరుడిని శిక్షించలేమని కోర్టు చెప్పింది. ఎన్ని చరణాలు పాడాలన్నది పౌరుడి వ్యక్తిగత నిర్ణయమని కోర్టు అభిప్రాయపడింది. ఆరు చరణాలు తప్పనిసరిగా పాడాల్సిందే అంటూ కేంద్రం చేసిన చట్టాన్ని వ్యతిరేకిస్తూ ప్రముఖ కర్ణాటక సంగీతకారుడు టీఎం కృష్ణ సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

వందేమాతరంలోని చివరి నాలుగు చరణాలు హిందూ దేవతలకు సంబంధించినవి ఉన్నాయని, అలాంటప్పుడు ఇతరులు ఈ చరణాలు పాడేలా బలవంత పెట్టడం సరికాదని, ఇది దేశ లౌకిక వాదానికి విరుద్ధమని తన పిటిషన్‌లో పేర్కొన్నాడు. దీనిపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ వీ మోహన ఆధ్వర్యంలోని ధర్మాసనం విచారణ జరిపింది. వందేమాతరం గేయాన్ని రెండు చరణాలు ఉంచాలా.. లేదా ఆరు చరణాలు ఉంచాలా అనే విషయంపై ఇప్పటికిప్పుడు విచారణ చేయలేమని కోర్టు తెలిపింది. అయితే, ఇలా పాడకపోతే చట్టపరంగా శిక్షించవచ్చా లేకపోతే శిక్ష నుంచి మినహాయింపు ఇవ్వొచ్చా అనే అంశంపై మాత్రం విచారణ జరుపుతామని ప్రకటించింది. వందేమాతరాన్ని పూర్తిగా ఆలపించని వారిపై ఎలాంటి క్రిమినల్ చర్యలు తీసుకోలేమని, శిక్షలు విధించలేమని తెలిపింది.

## యెమెన్‌లో మళ్లీ ముదిరిన ఘర్షణలు..
## 10 వేల మంది జిబౌటీకి వలస వెళ్లే అవకాశం



**జెనీవా, సెప్టెంబరు 22:** యెమెన్‌లో మళ్లీ తీవ్ర స్థాయిలో ఘర్షణలు కొనసాగితే, ఎర్ర సముద్రం మీదుగా జిబౌటీకి శరణార్థులుగా వెళ్లే వారి సంఖ్య 10 వేలకు చేరుకునే అవకాశం ఉందని ఐక్యరాజ్యసమితి మంగళవారం హెచ్చరించింది. అదే సమయంలో యెమెన్ లోనే అంతర్గతంగా నిరాశ్రయులయ్యే వారి సంఖ్య 2.30 లక్షలకు పైగా పెరిగే ప్రమాదం ఉందని తెలిపింది. ఇరాన్ మద్దతు ఉన్న హౌతీలు ఈ నెల ప్రారంభంలో యెమెన్‌లోని ఎర్ర సముద్ర తీర ప్రాంతంపై ఆధిపత్యం సాధించారు. ఈ క్రమంలో జరిగిన తీవ్ర దాడుల్లో ఇరువైపులా వందలాది మంది మరణించారు. ఈ పరిణామాలు అంతర్జాతీయ వాణిజ్యంపై ప్రభావం చూపడంతో పాటు ఇంధన ధరల పెరుగుదలకు కూడా కారణమయ్యాయి. సౌదీ అరేబియా మద్దతుతో ఉన్న అడెన్ కేంద్రంగా పనిచేస్తున్న ప్రభుత్వానికి విధేయులైన బలగాలకు, హౌతీలకు మధ్య జరుగుతున్న తాజా పోరాటం యెమెన్‌లో మరోసారి తీవ్రమైన మానవతా సంక్షోభాన్ని సృష్టించింది. ఇప్పటికే లక్ష మందికి పైగా పౌరులు దేశంలోనే తమ నివాసాలను విడిచి వెళ్లాల్సి వచ్చింది. మరికొందరు హింస నుంచి తప్పించుకునేందుకు ప్రమాదకరమైన సముద్ర ప్రయాణం చేస్తూ జిబౌటీకి చేరుకుంటున్నారు. యెమెన్‌లో ఘర్షణలు మరింత తీవ్రతరం అయితే భారీ స్థాయిలో ప్రజలు నిరాశ్రయులయ్యే అవకాశం ఉందని ఐక్యరాజ్యసమితి శరణార్థుల సంస్థ ప్రతినిధి బాబర్ బలోచ్ జెనీవాలో విలేకరులతో తెలిపారు. గత వారం రోజుల్లోనే 3 వేల మందికి పైగా ప్రజలు ఎర్ర సముద్రం దాటి జిబౌటీకి చేరుకున్నారని యుఎన్‌సిహెచ్‌ఆర్ వెల్లడించింది. ప్రస్తుత ప్రతికూల సముద్ర పరిస్థితులు అక్టోబర్ మధ్య నాటికి మెరుగుపడే అవకాశం ఉండటంతో, ఆ తర్వాత శరణార్థుల సంఖ్య గణనీయంగా పెరగవచ్చని సంస్థ అంచనా వేస్తోంది. రానున్న నెలల్లో జిబౌటీకి 10 వేలకు పైగా మంది చేరుకునే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని తమ సంస్థ, భాగస్వామ్య సంస్థలు ఏర్పాట్లు చేస్తున్నాయని బాబర్ బలోచ్ తెలిపారు. దేశంలోనే 2.30 లక్షల మందికి నిరాశ్రయ పరిస్థితి తాజా ఘర్షణల కారణంగా యెమెన్‌లో అంతర్గతంగా నిరాశ్రయులైన వారి సంఖ్య ప్రస్తుతం 1.30 లక్షలకు పైగా ఉంది. పరిస్థితి మరింత దిగజారితే ఈ సంఖ్య 2.30 లక్షలకు పైగా పెరిగే అవకాశం ఉంది.

## ఒకప్పుడు ఆంక్షలు విధించిన దేశం
## ఇపుడు వాణిజ్య ఒప్పందానికి తహతహ!



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 22:** భారతదేశ చరిత్రలో 1998 మే నెల ఒక సువర్ణాధ్యాయం. అప్పటి ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి నేతృత్వంలోని ప్రభుత్వం, ప్రపంచ దేశాల అంచనాలను తలకిందులు చేస్తూ పోఖ్రాన్‌లో అణు పరీక్షలను విజయవంతంగా నిర్వహించింది. ఆపరేషన్ శక్తి పేరుతో మే 11న, ఆ తర్వాత రోజుల్లో జరిపిన ఈ పరీక్షలతో భారత్ పూర్తి అణ్వాస్త్ర సామర్థ్యం కలిగిన దేశంగా ప్రపంచానికి చాటిచెప్పింది. అయితే, ఈ సాహసోపేత నిర్ణయానికి అమెరికా నుంచి తీవ్ర ప్రతిస్పందన ఎదురైంది. భారత్ అణు పరీక్షలు నిర్వహించిన వెంటనే, అప్పటి అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్ ప్రభుత్వం కఠిన ఆంక్షలను విధించింది. అమెరికా ఆయుధ ఎగుమతుల నియంత్రణ చట్టంలోని సెక్షన్ 102 (గ్లెన్ అమెండ్‌మెంట్) కింద ఈ చర్యలు తీసుకుంది. ఈ ఆంక్షల ప్రభావం భారత్‌పై బాగా పడింది. మానవత, ఆహార సహాయం మినహా అమెరికా నుంచి అందే ఆర్థిక సహాయాన్ని నిలిపివేశారు. ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్య నిధి వంటి సంస్థల నుంచి భారత్‌కు అందాల్సిన కొన్ని బిలియన్ డాలర్ల రుణాలకు అడ్డుపడ్డారు. అంతేకాకుండా రక్షణ పరికరాల అమ్మకాలు, సైనిక ఆర్థిక సహాయంపై కఠినమైన ఆంక్షలు విధించారు. కొన్ని కీలక సాంకేతిక పరిజ్ఞాన బదిలీలు, రుణాలపై కూడా పరిమితులు విధించారు. అమెరికా చర్యలతో భారత్ ఏకాకి అవుతుందని చాలా దేశాలు భావించాయి. ఈ కఠిన పరిస్థితుల్లో భారత్ ఏమాత్రం వెనక్కి తగ్గలేదు. జాతీయ భద్రతా ప్రయోజనాల దృష్ట్యానే అణు పరీక్షలు నిర్వహించామని, ఏ బెదిరింపులకు భయపడబోమని భారత అధికారులు అప్పట్లో స్పష్టం చేశారు. ఆంక్షల ప్రభావాన్ని తగ్గించుకునేందుకు ప్రత్యామ్నాయ వాణిజ్య మార్గాలను అన్వేషించింది. ఆశ్చర్యకరంగా ఆంక్షల తర్వాత కూడా భారత ఆర్థిక వ్యవస్థ పటిష్ఠంగా నిలిచింది. జీడీపీ వృద్ధి రేటు బలంగా కొనసాగింది. ఆంక్షలు అమల్లో ఉన్నప్పటికీ, అమెరికాతో దౌత్యపరమైన చర్చలు కొనసాగాయి. దీనికి నిదర్శనంగా 2000 సంవత్సరంలో అధ్యక్షుడు బిల్ క్లింటన్ భారత్‌లో పర్యటించారు. ఇది ఇరు దేశాల సంబంధాలలో ఒక కీలక మలుపుగా నిలిచింది.




# ఏ ప్రాతిపదికన 'సర్' నోటీసులు?
# ఎన్నికల సంఘం వివరణ ఇవ్వాలని 'సుప్రీం' ఆదేశం

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 22:** ఢిల్లీ సర్ ప్రక్రియలో భాగంగా లాజికల్ డిస్క్రిపెన్సీస్ కేటగిరీ కింద ఓటర్లకు జారీ చేస్తున్న నోటీసులపై సుప్రీం కోర్టు ఈసీపై పలు ప్రశ్నలు సంధించింది. ఏ ప్రాతిపదికన ఈ నోటీసులు జారీ చేస్తున్నారని ఈసీని ప్రశ్నించింది. ఈ కేటగిరీపై స్పష్టత ఇవ్వాలని చెప్పింది. సర్ నోటీసులపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ దాఖలైన పిటిషన్లపై వివరణ ఇవ్వాలని ఈసీని చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాలా బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. ఢిల్లీ సర్ ప్రక్రియ జరుగుతున్న తీరుపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ పలు పిటిషన్లు దాఖలయ్యాయి. సర్ ప్రక్రియ కింద ఓటర్లకు జారీ చేస్తున్న నోటీసుల్లో స్పష్టమైన కారణాలు పేర్కొనట్లేదని పిటిషనర్ల తరఫు న్యాయవాది ప్రశాంత్ భూషన్ పేర్కొన్నారు. ఏ ప్రాతి ప ది కన ఓటర్లకు లాజికల్ డిస్క్రిపెన్సీ కేటగిరీ కింద నోటీసులు జారీ చేస్తున్నారని ప్రశ్నించారు. ఓటర్ల నుంచి ఏయే పత్రాలు, వివరాలను ఈసీ ఆశిస్తున్నదో కూడా స్పష్టత లేదని అన్నారు. సాధారణ ఓటర్ల వద్ద పరిమితమైన డాక్యుమెంట్స్ మాత్రమే ఉంటాయని చెప్పారు. చాలామంది దగ్గర ప్రాథమిక వివరాలున్న ప్రధాన డాక్యుమెంట్‌గా ఆదార్ కార్డు మాత్రమే ఉంటోందని చెప్పారు. ఓటర్ నమోదు ప్రక్రియలో భాగంగా ప్రజలు అప్పటికే వయసు, నివాస ధ్రువీకరణ పత్రాలు సమర్పించిన నేపథ్యంలో మళ్లీ అదనపు వివరాల నిర్ధారణకు డాక్యుమెంట్స్ ఎందుకు సమర్పించాలని ప్రశ్నించారు. నివాసం మార్పు పేరిట ఇప్పటికే ముసాయిదా ఓటర్ల జాబితా నుంచి అనేక మంది పేర్లు తొలగించారని చెప్పారు. ఇందుకు అనుసరించిన పద్ధతిపై సందేహాలు లేవనెత్తారు. ఈ విషయాలపై ఈసీ తరఫున సీనియర్ అడ్వొకేట్ డీఎస్ నాయుడు వాదనలు వినిపించారు. ప్రతి నోటీసుకు వెనక గల కారణాన్ని ఈసీ పేర్కొంటుందని ఆయన చెప్పారు. పిటిషనర్లు లెవనెత్తున్న అంశాలు వారు భావిస్తున్నంత తీవ్రమైనవి కావని అన్నారు. మరోవైపు సర్ ప్రక్రియ డెడ్‌లైన్‌ను అవసరమనుకుంటే పొడిగించేందుకు ఈసీ సుముఖంగానే ఉందని కూడా చెప్పారు. చట్టంలో పేర్కొన్న ప్రక్రియకు భిన్నంగా ఒక్కరి ఓటు కూడా తొలగించబోమని హామీ ఇచ్చారు. ఓటర్ల సహాయం కోసం ఇప్పటికే ప్రచార కార్యక్రమాలు, వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేశామని కూడా చెప్పారు. ఈ సందర్భంగా సుప్రీం కోర్టు స్పందిస్తూ నోటీసులు జారీ చేస్తున్న విధానంపై ఈసీని వివరణ కోరింది. యాంత్రికంగా నోటీసులు జారీ అవుతున్నాయా అని ప్రశ్నించింది. నోటీసులకు గలకారణాలను ఈసీ ఓటర్లకు తగిన విధంగా అందిస్తోందా అని ప్రశ్నించింది. లాజికల్ డిస్క్రిపెన్సీ అంటే ఏంటో వివరించాలని కూడా చీఫ్ జస్టిస్ ఈసీని కోరారు. అసలు ఈ కేటగిరీలో నోటీసులు ఎలా జారీ చేస్తున్నారనే విషయంలో స్పష్టత ఇవ్వాలని అన్నారు.

## యమునా ప్రక్షాళనకు శ్రీకారంచుట్టిన బిట్టు తబాహి




**న్యూఢిల్లీ,సెప్టెంబరు 22:** మధ్యప్రదేశ్‌లోని అజ్నార్ నదిని ఒంటిచేత్తో శుభ్రం చేసి ప్రపంచవ్యాప్త గుర్తింపు పొందిన సురేంద్ర సింగ్ చౌదరి, అలియాస్ బిట్టు తబాహీ, ఇప్పుడు మరో బృహత్కార్యానికి శ్రీకారం చుట్టారు. అంతర్జాతీయంగా ప్రశంసలు అందుకోవడమే కాకుండా నెదర్లాండ్స్‌కు చెందిన ది ఓషన్ క్లీనప్ సంస్థ వ్యవస్థాపకుడు బోయన్ స్లాట్ నుంచి ఉద్యోగ అవకాశాన్ని సైతం పొందిన బిట్టు, ఇప్పుడు దేశ రాజధాని ఢిల్లీలోని యమునా నది ప్రక్షాళనకు నడుం బిగించారు. ప్రపంచ పారిశుద్ధ్య దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు తన ఇన్‌స్టాగ్రామ్ వీడియోలో బిట్టు తెలిపారు. మూడు రోజుల పాటు ఈ డ్రైవ్ కొనసాగుతుందని, తొలి రోజే తాను, ఇతర వాలంటీర్లు కలిసి సుమారు నాలుగున్నర గంటల పాటు శ్రమించి యమునా నదీ తీరం నుంచి 585 కిలోల చెత్తను తొలగించినట్లు వెల్లడించారు. పూలు, దండలు, పూజ సామాగ్రి, ప్లాస్టిక్ వ్యర్థాలు తీరం వెంబడి పేరుకుపోయాయి. చుట్టుపక్కల ప్రజలు కూడా మాతో కలిసి సాయం చేయడంతో మొత్తం తీరాన్ని శుభ్రం చేయగలిగాం. వచ్చిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రయాణంలో తనకు మద్దతుగా నిలిచిన ఫిలిప్ మోరిస్ సంస్థకు కూడా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు ప్రయాణించి, నదుల శుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పించడమే తన జీవిత లక్ష్యమని బిట్టు స్పష్టం చేశారు. యమునా నది తర్వాత తన తదుపరి మజిలీ గురుగ్రామ్‌లోని ఖేడ్కీ దౌలా అని ప్రకటించారు. ఈ వీడియో సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన కొన్ని గంటల్లోనే వైరల్ అయింది. 3,34,000 కంటే ఎక్కువ వ్యూస్ సాధించి, వేలాది లైకులను పొందింది.

బిట్టు చేస్తున్న కృషిపై నెటిజన్లు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ఒక్క వ్యక్తి తలచుకుంటే ఎంత మార్పు తీసుకురాగలడో మీరు నిరూపిస్తున్నారని ఒక యూజర్ కామెంట్ చేయగా, మీరు గొప్ప పని చేస్తున్నారు,

ఇలాగే కొనసాగించండి అని మరొకరు పేర్కొన్నారు. ఈ మంచి పని చేస్తున్నప్పుడు దయచేసి వ్యక్తిగత రక్షణ పరికరాలు వాడండి అని ఓ నెటిజన్ సూచించారు. తనకొచ్చిన గుర్తింపును సద్వినియోగం చేసుకుంటూ బిట్టు తబాహీ చేస్తున్న ఈ ప్రయత్నం ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తోంది.



### భద్రతామండలిలో భారత్‌కు సభ్యత్వంపై నాలుగు యూరప్ దేశాల సంపూర్ణ మద్దతు

**న్యూయార్కు, సెప్టెంబరు 22:** ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం కోసం భారత్ చేస్తున్న ప్రయత్నాలకు పలు యూరప్ దేశాల నుంచి మద్దతు లభించింది. భారత్‌కు శాశ్వత సభ్యత్వం కల్పించాలన్న డిమాండ్‌కు మధ్య ఐరోపాకు చెందిన నాలుగు దేశాలు మద్దతును ప్రకటించాయి. హంగేరీ, పోలాండ్, స్లోవేకియా, చెక్ రిపబ్లిక్ దేశాలతో కూడిన విసెగ్రాడ్ గ్రూప్ (జీ4) భారత్‌కు మద్దతుగా నిలిచింది. న్యూయార్క్‌లో జరుగుతున్న 81వ ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం సందర్భంగా తొలి జీ4 భారత్ విదేశాంగ మంత్రుల సమావేశం జరిగింది. భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌తో భేటీ అనంతరం స్లోవేకియా విదేశాంగ మంత్రి జురాజ్ బ్లానార్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రపంచ దక్షిణ దేశాల్లో భాగమైన భారత్ ఇండోపసిఫిక్ ప్రాంతంలో అభివృద్ధి చెందుతున్న అగ్రశక్తి అని, ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో భారత్ శాశ్వత సభ్యదేశంగా ఉండాల్సిందేనని జీ4 దేశాలన్నీ ఏకాభిప్రాయంతో ఉన్నాయని ఆయన తెలిపారు. భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం కోసం భారత్ చాలాకాలంగా ప్రయత్నిస్తోంది. ప్రపంచ రాజకీయ,

ఆర్థిక పరిస్థితుల్లో భారీ మార్పులు వచ్చినప్పటికీ 1945లో ఏర్పడిన భద్రతా మండలి శాశ్వత సభ్యత్వ నిర్మాణంలో పెద్దగా మార్పులు రాలేదని భారత్ వాదిస్తోంది. భారత్ శాశ్వత సభ్యత్వ ప్రతిపాదనకు ఫ్రాన్స్, బ్రిటన్, అమెరికా, రష్యా సహా పలు దేశాలు మద్దతు తెలిపాయి. ఇక, జీ4 కూటమిలోని బ్రెజిల్, జర్మనీ, జపాన్‌లు ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం కోసం పరస్పరం మద్దతు ఇచ్చుకుంటున్నాయి. అయితే చైనా నుంచి మాత్రం స్పష్టమైన మద్దతు రావడం లేదు.

## కల్కాజీ ఆలయం సమీపంలో బాలికపై అత్యాచారం
### పోలీసులమంటూ బెదిరించి దాడి.. ముగ్గురు నిందితుల అరెస్ట్

**న్యూఢిల్లీ,సెప్టెంబరు 22:** కల్కాజీ మందిర్ సమీపంలోని పార్కులో 17 ఏళ్ల బాలికపై ముగ్గురు వ్యక్తులు అత్యాచారానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. తాము పోలీసులమంటూ బాలికను, ఆమె 17 ఏళ్ల స్నేహితుడిని బెదిరించిన అనంతరం ఈ ఘటనకు పాల్పడినట్లు వెల్లడించారు. ఈ కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఫిర్యాదు ప్రకారం, సెప్టెంబర్ 21న సాయంత్రం సుమారు 7 గంటల సమయంలో బాలిక తన 17 ఏళ్ల స్నేహితుడితో కలిసి కల్కాజీ మందిర్‌కు వెళ్లింది. దర్శనం అనంతరం రాత్రి 7.30 గంటల సమయంలో సమీపంలోని ఆస్తా కుంజ్ పార్కులోకి గేట్ నంబర్ 7 ద్వారా ప్రవేశించారు. అక్కడ 25 నుంచి 30 ఏళ్ల మధ్య వయసున్న ముగ్గురు వ్యక్తులు వారిని సంప్రదించి, తాము పోలీసులమని చెప్పినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల మాదిరిగా మాట్లాడి, ఇద్దరూ మైనర్లని, తప్పు చేస్తున్నారని, కేసు నమోదు చేయవచ్చని బెదిరించినట్లు పేర్కొన్నారు. బాలికను ఆమె స్నేహితుడి నుంచి వేరు చేసి, పార్కులోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు. నిందితుల్లో ఆసిఫ్ అనే వ్యక్తి తుపాకీ, కత్తితో బాలికను బెదిరించి లైంగిక దాడికి పాల్పడినట్లు బాధితురాలి వాంగ్మూలంలో పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు.

## కామరాజ్ అల్పాహారపథకం
# ప్రారంభించిన సీఎం విజయ్

### 8వ తరగతి వరకూ పొడిగించిన టివికె సర్కారు



**చెన్నై, సెప్టెంబరు 22:** తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందిస్తున్న ఉచిత అల్పాహార పథకాన్ని మరింత విస్తరిస్తూ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటివరకు 1 నుంచి 5వ తరగతి వరకు అమలవుతున్న ఈ పథకాన్ని మంగళవారం నుంచి 6, 7, 8 తరగతుల విద్యార్థులకు కూడా వర్తింపజేశారు. ఈ సందర్భంగా పథకం పేరును ముఖ్యమంత్రి అల్పాహార పథకం నుంచి తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, విద్యా సంస్కరణల ప్రదాత అయిన పెరుంతలైవర్ కామరాజర్ అల్పాహార పథకంగా మారుస్తున్నట్లు ప్రకటించారు. చెన్నైలోని తిరువాన్మియూర్‌లో ఉన్న ఓ ప్రభుత్వ పాఠశాలలో సీఎం విజయ్ ఈ విస్తరణ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన స్వయంగా విద్యార్థులకు అల్పాహారం వడ్డించి, వారితో కలిసి కూర్చొని భోజనం చేశారు. ఈ విస్తరణ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 15,454 ప్రభుత్వ, ప్రభుత్వఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న సుమారు 15.3 లక్షల మంది విద్యార్థులు అదనంగా లబ్ధి పొందనున్నారు. ఈ పథకం కింద మొత్తం ప్రయోజనం పొందేవారి సంఖ్య 34.64 లక్షలకు చేరనుంది. పథకం విస్తరణ కోసం ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం అదనంగా రూ. 217.63 కోట్లను కేటాయించింది. దీంతో ఈ పథకం మొత్తం వార్షిక బడ్జెట్ సుమారు రూ. 724 కోట్లకు పెరిగింది. వాస్తవానికి ఈ అల్పాహార పథకాన్ని 2022లో గత డీఎంకే ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా ఉన్న ఎం.కె. స్టాలిన్ ప్రాథమిక తరగతుల కోసం ప్రారంభించారు. ఇప్పుడు విజయ్ నేతృత్వంలోని కొత్త ప్రభుత్వం ఈ పథకాన్ని కొనసాగించడమే కాకుండా, దాని పరిధిని పెంచి దివంగత నేత కామరాజర్ పేరు పెట్టడం ప్రాధాన్యత సంతరించుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకం అమలు ప్రారంభమైనప్పటికీ, కొన్ని జిల్లాల్లో ఉపఎన్నికల కారణంగా ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో అక్కడ తాత్కాలికంగా వాయిదా వేశారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకానికి ఆద్యుడిగా పేరుగాంచిన కామరాజర్ పేరును ఈ పథకానికి పెట్టడం ద్వారా ఆయన వారసత్వాన్ని గౌరవించినట్లయిందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

### గూగుల్‌కు ఐర్లాండ్ డేటా పరిరక్షణ కమిషన్ షాక్
# రూ.3700 కోట్ల భారీ జరిమానా

**డబ్లిన్, సెప్టెంబరు 22:** టెక్ దిగ్గజం గూగుల్‌కు ఐర్లాండ్ డేటా ప్రొటెక్షన్ కమిషన్ భారీ షాక్ ఇచ్చింది. యూజర్ల లొకేషన్ డేటాను నిర్వహించిన విధానంలో యూరోపియన్ యూనియన్ జనరల్ డేటా ప్రొటెక్షన్ రెగ్యులేషన్ నిబంధనలను ఉల్లంఘించినందుకు ఏకంగా 403 మిలియన్ యూరోలు సుమారు రూ.3,700 కోట్లు జరిమానా విధించింది. ఈ మేరకు డీపీసీ అధికారికంగా ప్రకటించింది. 2018 మే 25 నుంచి 2020 ఫిబ్రవరి 4 మధ్య కాలంలో గూగుల్ తన యూజర్ల లొకేషన్ డేటాను ప్రాసెస్ చేసిన విధానం పారదర్శకంగా, చట్టబద్ధంగా లేదని డీపీసీ తన దర్యాప్తులో తేల్చింది. ముఖ్యంగా వెబ్ అండ్ యాప్ యాక్టివిటీ, లొకేషన్ హిస్టరీ, ఆండ్రాయిడ్‌లోని లొకేషన్ యాక్యురసీ వంటి ఫీచర్ల ద్వారా సేకరించిన డేటాను ప్రకటనలు, యూజర్ల ఆసక్తులను అంచనా వేయడానికి వాడుతున్నారనే విషయం వినియోగదారులకు స్పష్టంగా తెలియజేయలేదని కమిషన్ పేర్కొంది. అంతేకాకుండా, అవసరమైన దానికంటే ఎక్కువ కాలం డేటాను నిల్వ చేశారని ఆరోపించింది. ఈ జరిమానాతో పాటు, తమ లొకేషన్ డేటా ప్రాసెసింగ్ విధానాలను ఆరు నెలల్లోగా జీడీపీఆర్ నిబంధనలకు అనుగుణంగా మార్చుకోవాలని గూగుల్‌ను డీపీసీ ఆదేశించింది.

ఐర్లాండ్ డేటా కమిషన్ ఇప్పటివరకు విధించిన జరిమానాల్లో ఇది నాలుగో అతిపెద్దది. ప్రస్తుతం గూగుల్‌పై మరో మూడు ప్రైవసీ ఉల్లంఘనలకు సంబంధించిన దర్యాప్తులు చివరి దశలో ఉన్నాయని కూడా కమిషన్ వెల్లడించింది. ఈ తీర్పుపై గూగుల్ స్పందించింది. ఈ కేసు గతంలో తాము అనుసరించిన విధానాలకు సంబంధించినదని, 2019 నుంచే లొకేషన్ డేటా నిర్వహణలో గణనీయమైన మార్పులు చేశామని తెలిపింది. యూరోపియన్ కన్స్యూమర్ ఆర్గనైజేషన్లు 2020లో చేసిన ఫిర్యాదుల ఆధారంగా డీపీసీ ఈ దర్యాప్తును ప్రారంభించింది.

# సంక్షిప్త వార్తలు

### జాముయి ఘటన నిందితుడి ఎన్‌కౌంటర్!



**జాముయి, సెప్టెంబరు 22:** దేశవ్యాప్తంగా సంచలనంగా మారిన బిహార్‌లో బాలికపై లైంగిక దాడి ఘటనలో కీలక నిందితుడిపై పోలీసులు కాల్పులు జరిపారు. జముయ్‌లో మంగళవారం తెల్లవారుజామున నిందితుడిని అదుపులోకి తీసుకునే క్రమంలో పోలీసుల నుంచి తప్పించుకునేందుకు నిందితుడు నందన్ యాదవ్ ప్రయత్నించాడని అధికారులు తెలిపారు.

పోలీసులపై కాల్పులు జరపడంతో ఎదురుకాల్పులు జరిపినట్లు చెప్పారు. గాయపడిన నందన్‌ను ఆస్పత్రికి తరలించారు. ఈ కేసులో ఇప్పటివరకు ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు.

### కర్ణాటకకు అదనపు జలాలను కేటాయించాలన్న పిటిషన్ కొట్టివేసిన సుప్రీం

**న్యూఢిల్లీ, సెప్టెంబరు22:** తమిళనాడుకర్ణాటక రాష్ట్రాల మధ్య నెలకొన్న కావేరీ జలాల వివాదంలో సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు ఇచ్చింది. కర్ణాటకకు 70 టీఎంసీల నీరు అద నంగా కేటాయించాలని కోరుతూ ఒక ప్రైవేటు సంస్థ వేసిన రిట్ పిటిషన్‌ను కోర్టు కొట్టి వేసింది. ప్రైవేటు సొసైటీల పిటిషన్లు చెల్లవని స్పష్టం చేసింది. అంతర్రాష్ట్ర నీటి వివాదాల్లో థర్డ్ పార్టీలు లేక సొసైటీలు జోక్యం చేసు కోలేవని సర్వోన్నత న్యాయస్థానం తేల్చి చెప్పింది.

### ప్రపంచ వ్యాప్తంగా ఇరాన్ విమాన సేవలు బంద్!

**వాషింగ్టన్, సెప్టెంబరు 22:** ఇరాన్‌పై ఆర్థిక యుద్ధాన్ని అమెరికా మరో స్థాయికి తీసుకెళ్లింది. బుధవారంనుంచి ప్రపంచ వ్యాప్తంగా ఇరాన్‌కు చెందిన అన్ని విమానయాన సంస్థల సర్వీసులను నిలిపి వేయనున్నట్లు సంచలన ప్రకటన చేసింది. ఇరాన్ విమానాలకు ఏ దేశంలోనైనా, ఏ సంస్థ అయినా సాయం అందిస్తే, వారిని యూఎస్ డాలర్ ఆర్థిక వ్యవస్థ నుంచి వెలివేస్తామని తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. ఇది ఇరాన్ ఆర్థిక వ్యవస్థను మరింత ఒంటరి చేసే కీలక చర్యగా భావిస్తున్నారు. యూఎస్ ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెంట్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ విషయాన్ని వెల్లడించారు.

### ఐసిసిపై ఆంక్షలకు ట్రంప్ యంత్రాంగం!




**వాషింగ్టన్, సెప్టెంబర్ 22:** అంతర్జాతీయ క్రిమినల్ న్యాయస్థానం (ఐసీసీ)పై విస్తృతమైన ఆంక్షలను విధించడానికి ట్రంప్ యంత్రాంగం సిద్ధమవుతున్నట్టు వాల్‌స్ట్రీట్ జర్నల్ వెల్లడించింది. దీని కారణంగా ఐసీసీకి ఆర్థిక ఇబ్బందులు ఎదురవ్వడమే కాక, రోజువారీ కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొంది. ఒక వేళ ఆంక్షలు అమలయితే అమెరికా ట్రెజరీ లైసెన్స్ లేకుండా పౌరులు కానీ, సంస్థలు కానీ ఐసీసీకి నగదు, వస్తువులు పంపడంపై నిషేధం విధిస్తారు. అమెరికా ఆంక్షలు ఆరేడు నెలల గడువు తర్వాత ఐసీసీతో లావాదేవీలను అగ్రరాజ్యం నిషేధిస్తుందని తెలిపింది.

### హార్ముజ్ జలసంధిలో ఎల్పీజి ట్యాంకర్‌పై దాడి



**టెహ్రాన్, సెప్టెంబరు 22:** ప్రపంచ వాణిజ్యానికి అత్యంత కీలకమైన హార్మూజ్ జలసంధిలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సముద్ర మార్గం గుండా ప్రయాణిస్తున్న ఒక ఎల్‌పీజీ ట్యాంకర్‌పై గుర్తుతెలియని వస్తువులతో దాడి జరిగింది. ఈ ఘటనలో ట్యాంకర్‌ను కొన్ని శిథిలాలు తాకినట్లు యునైటెడ్ కింగ్‌డమ్ మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ వెల్లడించింది. దాడిలో సిబ్బం దికి ఎలాంటి ప్రాణ హాని జరగలేదని, పర్యావరణానికి కూడా ఎటువంటి నష్టం వాటిల్లలేదని యూకేఎంటీవో స్పష్టం చేసింది.

## ఆకులు పసుపు రంగులోకి ..



ఇంట్లో మొక్కల్ని పెంచాలని అందరికీ ఉంటుంది. కానీ, ఒక్కోసారి వాటికొచ్చే సమస్యలను నివారించలేక కొందరు మానుకుంటారు. అలాంటి వాటిల్లో ఆకులు పసుపు రంగులోకి మారడం ఒకటి. దీనికి పరిష్కారం ఏంటంటే.. మొక్కల ఆకులు పసుపు రంగులోకి మారడాన్ని క్లోరోసిస్ అంటారు. నీళ్లు బాగా ఎక్కువైనా తక్కువైనా ఈ సమస్య కనిపిస్తుంది. అలాకాకుండా ఉండాలంటే మట్టి పై పొర ఆరక మాత్రమే తడి అందించాలి. అదనంగా ఉన్న నీళ్లు బయటకు పోయేలా కుండీల అడుగున రంధ్రాలు చేయాలి. మట్టిలో అవసరమైన పోషకాలు లేనప్పుడూ అంటే ప్రధానంగా నైట్రోజన్, ఐరన్ లోపం వల్ల ఇలా జరుగుతుంది. దీన్ని అధిగమించడానికి నత్రజని ఎక్కువగా ఉండే కంపోస్ట్ వేయాలి. ఐరన్ లోపాన్ని తగ్గించడానికి ఐరన్ కీలెట్ స్ప్రే చేయాలి. లేదంటే తుప్పు పట్టిన మేకుల్ని నీళ్లలో వేసి ఉంచి... అవి రంగు మారాక మొక్కకు పోయాలి. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నా, అసలు తగలకపోయినా ఆకులు పసుపు వర్ణంలోకి మారతాయి బయట వాతావరణాన్ని గమనించుకుని ఎండ ఎక్కువ ఉంటే సెమీ షేడ్‌లోకి మార్చాలి. నీడలో ఉంటే వాటికి కనీసం మూడు నాలుగు గంటలైనా సూర్యరశ్మి అందేలా చేయాలి. పేను బంక, తెల్లదోమ, మైట్స్.. వంటి చీడలు ఆకుల్లోని రసాన్ని పీల్చేయడం వల్ల ఇలా జరగొచ్చు. వేప నూనె చల్లడం మంచిది. □

## ముఖ వర్చస్సుకోసం !

మిస మిస లాడే ముఖ వర్చస్సు మీకే కావాలంటే ఇలా చేయవచ్చు.

చర్మంపై పేరుకుపోయిన మృతకణాలను తొలగించడంలో వంట సోడా బాగా పని చేస్తుంది. చెంచా వంటసోడాలో రెండు చెంచాల యాపిల్ సిడార్ వెనిగర్ చేర్చి, పేస్టులా చేసు కోవాలి. ముఖాన్ని కడిగి, తడి లేకుండా తుడిచాక ఈ మిశ్రమాన్ని పట్టించాలి. పది నిమిషాల తర్వాత గాఢత తక్కువ ఉండే ఫేస్‌వాష్‌తో కడిగేస్తే సరి. మెరిసే చర్మం మీసొంతం.



**నిమ్మ..** చర్మాన్ని మెరిపించడంలో నిమ్మదీ ప్రత్యేక పాత్రే. దీనిలోని విటమిన్ సి సహజ పని చేస్తుంది. ఒక నిమ్మచెక్కను సన్నటి చక్కెరలో ముంచి ముఖంపై మృదువుగా మర్దనా చేస్తే చాలు. అయిదు నిమిషాలయ్యాక గోరువెచ్చని నీటితో శుభ్రం చేస్తే సరి. చర్మరంధ్రాలను లోతుగా శుభ్రం చేసి, చర్మాన్ని మెరిసేలా చేస్తుంది. దీనిలోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు అలర్జీలు, యాక్నే రాకుండానూ చూస్తుంది.

**అరటి-తేనె..** బాగా పండిన అరటి పండులో చిన్న ముక్క తీసుకొని గుజ్జులా చేయాలి. దానికి చెంచా తేనె, నాలుగైదు చుక్కలు నిమ్మరసం కలిపి, మెత్తని మిశ్రమంలా చేసు కోవాలి. దీన్ని శుభ్రమైన ముఖానికి పట్టించి, పావుగంటసేపు వదిలేయాలి. ఆపై గోరు వెచ్చని నీటితో కడిగేస్తే సరి. అరటిలో పుష్కలంగా ఉండే ఎ,బి,ఇ విటమిన్లు చర్మాన్ని మృదువుగా మార్చడమే కాదు. నల్లమచ్చలనీ తగ్గస్తాయి. తేనెలోని యాంటీ ఆక్సిడెంట్లు చర్మాన్ని తేమగా ఉంచుతాయి.

**నారింజ తొక్కలతో..** చెంచా నారింజ తొక్కల పొడికి,చెంచా తేనె, చిటికెడు పసుపు కలిపి మెత్తని చూర్ణంలా చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని శుభ్రమైన ముఖానికి పట్టించి ఆరనివ్వాలి. తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసి, మాయిశ్చరైజర్‌ను రాస్తే సరి. దీనిలో ఉండే సి విటమిన్‌ముఖంపై ముడతలు, గీతలను తగ్గించడంలో సాయపడుతుంది. □

## తినకపోతేనేం !



**సరైన వేళకి అలా ఎక్కువ కాలం వేళాపాళా లేకుండా తినడం, అసలు తినక పోవడం వంటివన్నీ తరువాత జంక్‌ఫుడ్ మీదకు మనసు మళ్లేలా చేస్తాయి.** ఫలితంగానే అజీర్తి, మలబద్ధకం, గ్యాస్, బరువు పెరగడం వంటి సమస్యలన్నీ.. మరి అలాకాకుండా ఉండాలంటే వీటికి దూరంగా ఉండమంటున్నారు నిపుణులు. కొవ్వు శాతం ఎక్కువగా ఉండే అహారాలు జీర్ణ వ్యవస్థను దెబ్బ తీస్తాయి. ఇతర ఆహారాలతో పోలిస్తే కొవ్వు పదార్థాలు జీర్ణం కావడానికి ఎక్కువ సమయం పడుతుంది. వినియోగించే కొవ్వు రకాన్ని బట్టి, అవి అరిగే సమయం మారుతుంది. అధిక కొవ్వు పదార్థాలు గ్యాస్, ఉబ్బరం, మలబద్ధకాలకి కారణవుతాయి. వీలైనంతవరకూ వీటికి దూరంగా ఉండటమే మంచిది. నట్స్, సీడ్స్,గుడ్లు,బీన్స్, చేపలు వంటి ఆరోగ్యకర మైన కొవ్వులు దొరికే పదార్థాలను తీసుకోండి. కారంగా,ఘాటుగా ఉన్న పదార్థాలు రుచికి భలే ఉంటాయి. కానీ, అతిగా తింటే జీర్ణాశయ ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి. ఇవి పొట్ట, పేగు లైనింగ్‌పై ప్రభావం చూపిస్తాయి. ఫలితంగా డయేరియా కడుపులో మంట, నొప్పి వంటి ఇబ్బందులను ఎదుర్కోవాలి. అతి ఏదైనా సమస్యే అది గుర్తుంచుకోవాలి. స్వీట్లూ, కృత్రిమ స్వీటెనర్లు ఉన్న పదార్థాలను తీసుకోవడం అంత మంచిది కాదు. ఇందులో చక్కెరతో పాటు కెలోరీల మోతాదూ ఎక్కువే. ఇవి పేగుల్లోని ఆరోగ్య కరమైన బ్యాక్టీరియా సమతుల్యతను దెబ్బతీస్తాయి. ఫలితంగా గ్యాస్, కడుపు ఉబ్బరం వంటి జీర్ణసమస్యలు రావచ్చు. బేకరీ ఐటెమ్స్ ప్రాసెస్ చేసిన పిండితోనే ఎక్కువగా చేస్తారు. వీటిని ఎక్కువగా తినడం వల్ల శరీరంలో చెడు కొలెస్ట్రాల్ లెవల్స్ పెరిగిపోతాయి. ఇవి పేగుల వాపునకు కారణమవు తాయి. బరువు పెరగడంతోపాటు టైప్ 2 డయాబెటిస్‌న రిస్క్‌నీ ఎదుర్కోవాల్సి వస్తుంది. బదులుగా చిరుధాన్యాలతో చేసిన చిరుతిళ్లు, పండ్ల ముక్కలు వంటివాటిని తీసుకోవచ్చు. ఇవి జీర్ణ ప్రక్రియను వేగవంతం చేయడంతోపాటు బరువూ, వాటి వల్ల వచ్చే ఇతరత్రా సమస్యల్నీ తగ్గిస్తాయి. □

## ఆఫీసులో 'జోగు'తున్నారా?



**కొంతమంది ఉద్యోగినులకు ఆఫీసుకెళ్లగానే నిద్ర ముంచుకొస్తుంది. ఇంకొందరికేమో కాస్త అన్నం తినగానే ఆవలింతలు మొదలై పోతాయి. ఎందుకిలా?** దీనెలా అదుపు చేసుకోవాలి. మధ్యాహ్న భోజనం తరవాత శరీరంలో ఇన్సులిన్ స్థాయి పెరిగి రక్తంలో చక్కెర స్థాయిలు ఎక్కువవుతాయి. ఇది నిద్రపోయే హార్మోన్లు సెరటోనిన్, మెలటోనిన్‌ను పెంచుతుంది. దీంతో కాస్త మగతగా నిపిస్తుంది. ఇలాంటప్పుడు తిన్న వెంటనే పనిలో పడిపోకుండా..కాసేపు అంటూ ఇటూ నడవండి లేదా మెట్లెక్కి దిగండి. శరీరానికి తగినన్ని నీళ్లు అందనప్పుడు అలసటకు గురవుతుంది. ఇది నిద్రకూ కారణం అవ్వొచ్చు. ఎప్పుడైనా కళ్లు మూతలు పడుతున్నా యంటే ఓ గ్లాసు వాటర్ తాగి చూడండి. మీరు శక్తినిచ్చే ఆహారం తీసుకోకపోయినా నిద్ర ముంచుకొస్తున్నట్లు అనిపిస్తుంది. సాయంత్రం అయ్యేసరికి ఈ సమస్య ఎదురవుతుంటే మీరు నిససత్తువతో ఉన్నట్లే. ఈ పరిస్థితి అదుపులోకి రావాలంటే గుప్పెడు నట్స్, సీడ్స్‌ని డబ్బాలో వేసుకుని వెంట తీసుకెళ్లండి. మీకు తీసుకునే ఆహారంలో ఇనుము, ప్రోటీన్లు పిండిపదార్థాలు ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. ఇవన్నీ మిమ్మల్ని ఉత్సాహంగా ఉంచేవే. పగటి పూట నిద్ర వెంటాడటానికి మరో కారణం రాత్రిళ్లు మీరు గాఢ నిద్ర లేకపోవడమే. ఇందుకు పనివేళలు, గ్యాడ్జెట్స్ కారణం ఏదైనా సరే.. వాటిని నియంత్రించుకోండి. కనీసం ఆరుగంటలైనా కలత నిద్రలేకుండా చూసుకోండి. ఇది మీ సమస్యను అదుపులో ఉంచుతుంది. □

## స్వీట్‌కార్న్ పటోలి



: ఒక కప్పు స్వీట్‌కార్న్: కప్పున్నర
శనగపిండి: ఒక టేబుల్ స్పూన్
మినపప్పు: ఒక టేబుల్ స్పూన్
ఆవాలు: ఒక టేబుల్ స్పూన్
జీలకర్ర: ఒక టేబుల్ స్పూన్
పచ్చిమిరపకాయలు: రెండు (సన్నగా తరిగి)నూనె: రెండు టేబుల్ స్పూన్లు
కరివేపాకు: రెండు రెబ్బలు
కొత్తిమీర: చిన్నకట్ట (తరిగి)

తయారు చేసే విధానం: ముందుగా శనగపప్పు నాలుగు గంటల పాటు నానబెట్టుకోవాలి. బాగా నానిన తర్వాత వాటిని కచ్చాపచ్చాగా మిక్సీ పట్టుకోవాలి. ఇప్పుడు పొయ్యి వెలిగించి, దాని మీద బాణలి పెట్టి, అందులో నూనె వేయాలి. నూనె సెగ పట్టిన తర్వాత మినపప్పు, ఆవాలు, జీలకర్ర, కరివేపాకు, పచ్చిమిర్చి వేసి చిటపటలాడనివ్వాలి. స్వీట్‌కార్న్ గింజల్లో మూడొంతులు కచ్చాపచ్చాగా దంచుకొని అందులో వేయాలి.పదార్థం కాస్త మగ్గిన తర్వాత మిగిలిన స్వీట్‌కార్న్ కూడా అందులో వేసి బాగా మగ్గనివ్వాలి. పైనుంచి శనగపిండి చల్లుకొని.. కాసేపు వేగనివ్వాలి. ఆపై తగినంత ఉప్పు వేసి.. బాగా కలుపుకోవాలి. చివరిగా కొత్తిమీర వేసుకొని పొయ్యి మించి దించేసుకోవాలి. అంతే, యమ్మీ యమ్మీ స్వీట్‌కార్న్ పటోలి రెడీ! □

## విఘ్నేశ్వరుడి ఆరాధన



**విఘ్నాలను** తొలగించే విఘ్నేశ్వరుడి జన్మదినమే వినాయక చవితి. ఏటా భాద్రపద మాసంలో శుక్లపక్ష చవితి రోజున దేశవ్యాప్తంగా ఈ పర్వదినాన్ని కన్నుల పండుగగా జరుపుకొంటారు. భారతీయ సమాజంలో వినాయకచవితికి విశిష్టమైన ప్రాముఖ్యం ఉంది. అది దంపతుల ప్రథమ కుమారుడైన వినాయకుడిని పూజించనిదే ఏ పనీ ప్రారంభించరు. గణనాథుని కృప ఉంటే అన్నీ విజయాలే లభిస్తాయ నేది ప్రజల విశ్వాసం. జోత్యతిషశాస్త్రం ప్రకారం విఘ్నేశ్వరుడి ఆరాధనలోకుజుడు, బుధుడు, కేతు గ్రహాల అనుగ్రహ సిద్ధి ఉంటుంది. విఘ్నేశ్వరుడు ధూమకేతు గణాధ్యక్షుడు, మోక్ష కారకత్వానికి అధినాయకుడు కావడంతో కేతు గ్రహానికి అధిపతి అయ్యాడని, బుధుడి అనుగ్రహంతో విద్య, జ్ఞానప్రాప్తి, వ్యాపారాభివృద్ధి కలుగు తుందని, అలాగే, కుజ గ్రహం అనుగ్రహం వివాహ, అన్యోన్య దాంపత్యా నికి చిహ్నం. ఒక్క పార్వతీ తనయుడిని ఆరాధించడం వల్ల ఈ మూడుగ్రహాల అనుగ్రహం పొందవచ్చని జ్యోతిషశాస్త్రం పేర్కొంటోంది. విఘ్నాలు తొలగాలన్నీ, దృష్టి దోషములు పోవాలన్నా, ఆటంకాల నుంచి రక్షణ పొందాలన్నా, విద్య, బుద్ధి, సిద్ధి ప్రాప్తి కలగాలన్నా, బుద్ధి వికాసానికి వ్యాపారాభివృద్ధికి, మోక్ష ప్రాప్తికి విఘ్నేశ్వరుడి ఆరాధన కచ్చితంగా చేయాలని పురాణాలు చెబుతున్నాయి. □

# తెర

## సినీ ప్రయాణంలో 48 ఏళ్లు పూర్తి.. 'శివశంకర వర ప్రసాద్' నుంచి మెగాస్టార్ వరకు అపూర్వ ప్రయాణం



తెలుగు చలనచిత్ర పరిశ్రమలోకి ఒక సామాన్యుడిగా అడుగుపెట్టి, ఎన్నో విజయాలను సొంతం చేసుకుని మెగాస్టార్‌గా అవతరించిన చిరంజీవి... తన సినీ ప్రయాణంలో 48 ఏళ్లు పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన సోషల్ మీడియా వేదికగా అత్యంత భావోద్వేగపూరిత పోస్టును పంచుకున్నారు. 1978 సెప్టెంబర్ 22న తాను నటించిన తొలి చిత్రం 'ప్రాణం ఖరీదు' వెండితెరపై విడుదలైన రోజే తన జీవితంలో సరికొత్త అధ్యాయం ప్రారంభమైందని ఆయన గుర్తు చేసుకున్నారు. ఆ రోజున కొణిదెల శివశంకర వరప్రసాద్ అనే తన అసలు పేరును 'చిరంజీవి'గా మార్చుకున్నానని, నేడు అదే పేరు తనకు కోట్లాది మంది అభిమానుల గుండెల్లో శాశ్వత గుర్తింపుగా మిగిలిపోయిందని ఆనందం వ్యక్తం చేశారు. సుదీర్ఘమైన ఈ 48 ఏళ్ల పయనంలో ఎన్నో రకాల పాత్రలను పోషించానని, లెక్కలేనన్ని అపూర్వ విజయాలు, గౌరవాలు, జాతీయ అంతర్జాతీయ అవార్డులను అందుకున్నానని చిరంజీవి పేర్కొన్నారు. తనకు నటుడిగా అవకాశాలు ఇచ్చిన నిర్మాతలు, తనలోని సరికొత్త నటనను ఆవిష్కరించిన దర్శకులు, అహర్నిశలు శ్రమించిన సాంకేతిక నిపుణులు, తోటి నటీనటులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ' ఇవన్నీ ఒకెత్తయితే తనపై కోట్లాది మంది అభిమానులు చూపిస్తున్న నిరంతర ప్రేమాభిమానాలే తన జీవితంలో అతిపెద్ద విజయమని, అభిమానులను తన సొంత కుటుంబ సభ్యులుగా భావిస్తూ శిరస్సు వంచి ధన్యవాదాలు అర్పిస్తున్నానని వెల్లడించారు.



నాచురల్ స్టార్ నాని పాన్ ఇండియా పీరియడ్ యాక్షన్ ఎంటం టైనర్ 'ది ప్యారడైజ్'. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం లో, ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మించారు. ఇప్పటికే విడుదలైన సాంగ్స్, గ్లింప్స్, టీజర్ అద్భుతమైన రెస్పాన్స్‌తో భారీ అంచనాలు పెంచాయి.

## 'ది ప్యారడైజ్' సెలబ్రేట్ చేసుకుందాం: నాని

ఈ చిత్రం సెప్టెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ గ్రాండ్‌గా ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ప్రీరిలీజ్ ఈవెంట్‌లో నేచురల్ స్టార్ నాని మాట్లాడుతూ: ఈ టీంలో అందరూ ప్రాణం పెట్టి పని చేశారు. ప్రతి జూనియర్ ఆర్టిస్ట్ కూడా ఎంతో కష్టపడ్డారు. నాతో పాటు కలిసి చేసిన సవారీ గ్యాంగ్ అందరి పెర్ఫార్మెన్స్ మీకు గుర్తుండిపోతుంది. కాసర్ల శ్యామ్ గారు వండర్‌ఫుల్ లిరిక్స్ రాశారు. మా డాన్స్ మాస్టర్‌కి థాంక్యూ. డైరెక్టర్ శ్రీకాంత్‌కి నాకు ఉన్నది అన్నదమ్ముల అనుబంధం. నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ: నాని అభిమానుల ఉత్సాహం చూస్తుంటే సినిమా ఆల్రెడీ విడుదలై బ్లాక్‌బస్టర్ కొట్టినంత ఫీలింగ్ ఈరోజే వస్తోంది. నాని ఇంతింతై వటుడింతై అన్నటుగా ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ, ఈరోజు 'ప్యారడైజ్'తో ఒక స్టార్ హీరోగా ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. హీరోయిన్ కయాదు లాహోర్ మాట్లాడుతూ: మీ అందరి ఎనర్జీ చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది. మీ అందరితో కలిసి సినిమా చూడటానికి ఎదురు చూస్తున్నాను. మా నిర్మాతకి థాంక్యూ. నిర్మాత సుధాకర్ చెరుకూరి మాట్లాడుతూ: మా టీమ్ అందరికీ థాంక్యూ.

## 'రణబాలి' 'ఏందయ్యా సామీ' ఫుల్ సాంగ్ రిలీజ్



విజయ్ దేవరకొండ, రశ్మిక మందన్న జంటగా నటిస్తున్న భారీ పాన్ ఇండియా మూవీ'రణబాలి'. ఈ సినిమాకు రాహుల్ సంకృత్యన్ దర్శకత్వం వహిస్తున్నారు. టీ సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై 'రణబాలి' సినిమాను ప్రొడ్యూసర్స్ నవీన్ యెర్నేని, వై రవిశంకర్ హ్యూజ్ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. అక్టోబర్ 16న విజయదశమి పర్వదినం సందర్భంగా 'రణబాలి' సినిమా వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు ఈ చిత్రం నుంచి 'ఏందయ్య సామీ..' ఫుల్ లిరికల్ సాంగ్ ను రిలీజ్ చేశారు. తెలుగుతో పాటు తమిళ, మలయాళ, కన్నడ, హిందీ..ఐదు భాషల్లో ఈ పాటను విడుదల చేశారు. 'రణబాలి'లో విజయ్, రశ్మిక పెళ్లి వేడుక సందర్భంగా 'ఏందయ్య సామీ..' పాట చిత్రీకరించారు. 19వ శతాబ్దంలో పెళ్లి సందడి ఎంత సంప్రదాయంగా ఉండేదో 'ఏందయ్య సామీ..' పాటలో అందంగా రూపొందించారు. ఈ పాటను అజయ్ అతుల్ మెలోడియస్‌గా కంపోజ్ చేశారు. రామజోగయ్య శాస్త్రీ అద్భుతమైన లిరిక్స్ అందించగా, శ్వేతా మోహన్, అజయ్ గోగవలే మధురంగా పాడారు. 'ఏందయ్య సామీ..' పాట ఎలా ఉందో చూస్తే ఏందయ్యా సామీ ఇట్ట గాస్తాందీ వెన్నెల, ఊపేస్తా ఉంది సిత్తరాలా ఉయ్యాలా, వీచే గాలికి అత్తరద్దిందెవ్వరు, మారే ఝాముకి మందుపెట్టిందెవ్వరు, మాయదారి మనస్సాగక జాగరమన్నరా... అంటూ మళ్లీ మళ్లీ వినాలనిపించేలా సాగుతుందీ పాట. 19వ సెంచరీ నేపథ్యంతో 1854 నుంచి 1878 మధ్య బ్రిటీష్ పాలనా కాలంలో జరిగిన యదార్థ చారిత్రక సంఘటనల ఆధారంగా "రణబాలి" సినిమా రూపొందుతోంది. ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో మూవీ లవర్స్‌లో ఆసక్తి కలిగిస్తోంది. రీసెంట్‌గా రిలీజ్ చేసిన ఈ చిత్ర టీజర్ మూవీపై అంచనాలు మరింతగా పెంచేసింది.

## కార్తికేయ గుమ్మకొండ 'కమ్‌బ్యాక్'



స్వీయ దర్శకత్వంలో హీరోగా కొత్త సినిమాట్యాలెంటెడ్ టాలీవుడ్ యంగ్ హీరోల్లో కార్తికేయ గుమ్మకొండ ఒకరు. 'ఆర్ఎక్స్ 100' లో ఆయన నటనకు ఎంతో మంది అభిమానులు ఏర్పడ్డారు. హీరోగా మాత్రమే కాదు... నటుడిగానూ ప్రేక్షకుల మదిలో ఓ ఇంపాక్ట్ క్రియేట్ చేశారు. తనలో స్టైలిష్ విలన్ ఉన్నాడని 'నానీస్ గ్యాంగ్ లీడర్'తో చూపించారు. కోలీవుడ్ స్టార్ అజిత్ 'వలిమై'లో తనదైన విలనిజంతో తమిళ ప్రేక్షకులనూ ఆకట్టుకున్నారు. అయితే ఆయన నుంచి సినిమా వచ్చి రెండేళ్ళు దాటుతోంది. ఇప్పుడు కార్తికేయ గుమ్మకొండ మళ్ళీ కమ్‌బ్యాక్ ఇస్తున్నారు. కథానాయకుడిగా రెండేళ్ళ విరామం తర్వాత కార్తికేయ గుమ్మకొండ చేస్తున్న సినిమా 'కమ్‌బ్యాక్'. ఈ సినిమా ప్రత్యేకత ఏమిటంటే... 'కమ్‌బ్యాక్'తో కార్తికేయ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. స్వీయ దర్శకత్వంలో హీరోగా నటిస్తున్న సినిమాను ఆయన పుట్టినరోజు సెప్టెంబర్ 21న అనౌన్స్ చేశారు. ఈ సందర్భంగా ఓ స్పెషల్ గ్లింప్స్ విడుదల చేశారు. కార్తికేయ క్రియేటివ్ వర్క్స్ పతాకంపై రూపొందుతున్న ఈ సినిమాకు ఆయన సతీమణి లోహితా రెడ్డి నిర్మాత.'బాక్సింగ్ వరల్డ్‌లో తన పేరు వినిపించి మూడేళ్ళు అవుతోంది. నేనింకా ప్రొఫెషన్ మారిపోయి ఉంటాడేమో అనుకున్నాను. మూడేళ్ళు అవుతుందని నీకు గుర్తు అన్నా ఉంది. అది నాకు కూడా లేదు. అయినా ఇప్పుడు వచ్చి ఏం చేస్తాడు? యా... దట్స్ ట్రూ (అది నిజమే). ఇట్ ఫీల్స్ లైక్ సూసైడ్ మిషన్ (ఓ విధంగా అది ఆత్మహత్య చేసుకోవడమే). మూడేళ్ళ నుంచి ఏమైపోయాడో తెలియలేదు. ఇన్ని రోజులు ఏం చేస్తున్నాడు?అని వాయిస్ ఓవర్ వినిపిస్తున్న సమయంలో తెరపై టెక్నీషియన్ల పేర్లు పరిచయం చేశారు.

## 'జనవరి 12 విడుదల' కృతి శెట్టి ఫస్ట్ లుక్ రిలీజ్



విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్, దర్శకుడు అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో మోస్ట్ అవైటెడ్ ఫెస్టివ్ ఎంటర్‌టైనర్ 'జనవరి 12 విడుదల' శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి నిర్మి స్తున్న ఈ చిత్రాన్ని సురేష్ ప్రొడక్షన్స్, శ్రీమతి అర్చన, జీ స్టూడియోస్ సమర్పిస్తున్నాయి. సినిమా నుంచి వస్తున్న ప్రతి అప్‌డేట్ ఆసక్తిని పెంచు తోంది. బావ బామ్మరి సౌజన్యంతో అనే ఇంట్రె స్టింగ్ ట్యాగ్‌లైన్‌తో వస్తున్న ఈ చిత్ర టైటిల్‌ను మేకర్స్ ఇటీవల హిలేరియస్, ఎంటర్‌టైనింగ్ వీడియో ద్వారా ప్రకటించారు. దీంతో సినిమాపై బజ్ మరింత పెరిగింది. ఇప్పటికే వెంకటేష్, కళ్యాణ్ రామ్ ఫస్ట్ లుక్స్‌ను పరిచయం చేసిన మేకర్స్.. తాజాగా హీరోయిన్ కృతి శెట్టి పుట్టిన రోజు సందర్భంగా ఆమెను 'దీపు'గా పరిచయం చేస్తూ ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో కృతి శెట్టి ట్రెడిషనల్ అవతార్‌లో ఆకట్టుకున్నారు. పర్పుల్‌పింక్ కలర్ హాఫ్ సారీలో అందంగా కనిపించారు. ఆమె ఆహ్లాదకరమైన చిరునవ్వు ఈ ఫస్ట్ లుక్‌కు మరింత చార్మ్, ఎలిగెన్స్‌ను తీసుకొచ్చింది. ఈ చిత్రానికి టాప్ టెక్నికల్ టీమ్ పనిచేస్తోంది. జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తుండగా, సమీర్ రెడ్డి సినిమాటోగ్రఫీ, తమ్మిరాజు ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు. ప్రొడక్షన్ డిజైనర్ ఏఎస్ ప్రకాష్, ఎస్. కృష్ణ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరి స్తున్నారు. వెంకటేష్, కళ్యాణ్ రామ్ కాంబినేషన్‌కు తోడు కీర్తి సురేష్, కృతి శెట్టి లాంటి స్టార్స్ ఉండటంతో ఈ సినిమాపై మంచి అంచనాలు నెలకొన్నాయి. ఇక అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తుండటంతో ఈ చిత్రం ఫెస్టివల్ సీజన్‌లో ఫుల్ ఎంటర్‌టైనింగ్‌గా ఉండబోతోంది. ఈ చిత్రం జనవరి 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. సంక్రాంతి సీజన్ అనిల్ రావిపూడికి సక్సెస్‌ఫుల్ విండోగా నిలుస్తూ వస్తోంది. తన సినిమాలను వరుసగా ఫెస్టివ్ సీజన్‌లో విడుదల చేస్తూ బలమైన కమర్షియల్ ఎంటర్‌టైనర్స్‌ను అందించిన అనిల్ రావిపూడి.. ఈసారి 'జనవరి 12 విడుదల'తో అద్భుతమైన కమర్షియల్ ఎంటర్‌టైనర్ అందించబోతున్నారు.

## 'అనుమాన పక్షి' ఎంజాయ్ చేస్తారు: రాగ్ మయూర్



**కథ, జానర్ ఎలా ఉండబోతుంది?**

ఇందులో మల్టిపుల్ జానర్స్ ఉంటాయి. ఎంటర్‌టైన్‌మెంట్‌తో మొదలై మిస్టరీ జానర్‌లోకి వెళ్లి థ్రిల్లర్, హారర్ టచ్ కూడా ఉంటుంది. సినిమా చాలా ఎంగేజింగ్‌గా ఉంటుంది.

**క్యారెక్టర్ ఎలా ఉంటుంది?**

ఇందులో హీరో క్యారెక్టర్‌కి అనుమానాలు ఎక్కువ. తన అనుమానాలతో చుట్టూ ఉన్న అందరికీ పిచ్చెక్కిస్తుంటాడు. తను కశ్మీర్‌కి వెళ్తాడు. అక్కడికి వెళ్లిన తర్వాత వచ్చే కామెడీ చాలా కొత్తగా ఉంటుంది.

**కశ్మీర్‌లో చిత్రీకరణ గురించి?**

కశ్మీర్‌ని ఎప్పుడూ ఒక సీరియస్ సిచువేషన్‌కి వాడుతుంటారు. ఫస్ట్ టైం ఒక లైట్ హార్టెడ్ కామెడీకి వాడుతున్నాము. అది చాలా బ్యూటిఫుల్ ప్లేస్. అలాంటి ప్లేస్‌ని ఒక లైట్ హార్టెడ్ జోనర్‌గా చూపించే ప్రయత్నం చాలా కొత్తగా ఉంటుంది.

**ఇందులో కాస్ట్యూమ్స్ చాలా వెరైటీగా ఉన్నాయి?**

హీరో క్యారెక్టర్‌కి అనుమానాలు ఎక్కువ. మన బట్టల్ని ఎవరికో దానం చేస్తున్నప్పుడు వాళ్లు మన మీద ఏదైనా చేతబడి చేస్తారని అనుమానపడతాడు. అందుకే ఇంట్లో ఉండే పాత చీరలు, కర్టెన్స్‌తో కూడా బట్టలు తయారు చేసుకుంటాడు. ఈ సినిమాకి అలాంటి రిఫరెన్స్ లేదు. అదే ఈ సినిమా బ్యూటీ. ఒరిజినల్‌గా ఆలోచించే వాళ్లకి రిఫరెన్స్ ఉండదు. ఇది కూడా ఆ కేటగిరీకి చెందినది.

**రమణ గోగుల గారి పాట గురించి?**

రమణ గోగుల అంటే పవన్ కళ్యాణ్ గారికి ఆయన పాడిన పాటలన్నీ గుర్తుకు వస్తాయి. అలాంటి ఆయన నా తొలి సోలో సాంగ్ పాడటం చాలా ఆనందంగా అనిపించింది.

**కామెడీ చేయడం కష్టం అంటారు కదా.. మీకు ఎలా అనిపించింది?**

నన్ను మొదటినుంచి ప్రేక్షకులు ఒక కామెడీ జోన్‌లోనే అప్రిషియేట్ చేశారు. సినిమా బండి, 'కీడా కోలా,' 'మిత్రమండలి' ఇవన్నీ కూడా కామిక్ జోన్ సినిమాలే. నాకు ఒక ప్రత్యేకమైన కామెడీ టైమింగ్ ఉందని ప్రేక్షకులు నన్ను ప్రోత్సహిస్తూ వచ్చారు.

23-9pg10exB.qxd:23-9pg10exB.qxd 1/1/02 7:13 AM Page 1





# టి20లో పరువు కాపాడుకున్న టీమిండియా

## 2 పరుగుల తేడాతో జపాన్‌పై గెలుపు

**టోచిగి ప్రిఫెక్చర్:** భారత్, జపాన్ జట్ల మధ్య జరిగిన చారిత్రాత్మక టీ20 మ్యాచ్ తీవ్ర ఉత్కంఠ నడుమ ముగిసింది. జపాన్ లో మంగళవారం వర్షం కారణంగా ఐదు ఓవర్లకు కుదించిన ఈ పోరులో శ్రేయస్ అయ్యర్ సారథ్యంలోని టీమిండియా కేవలం 2 పరుగుల తేడాతో జపాన్ పై విజయాన్ని అందుకుంది. చివరి బంతి వరకు ఉత్కంఠభరితంగా సాగిన ఈ మ్యాచ్‌లో అక్షర్ పటేల్ అద్భుతమైన బౌలింగ్ ప్రదర్శనతో జట్టును విజేతగా నిలిపాడు. ముందుగా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత జట్టుకు జపాన్ బౌలర్లు ఊహించని షాక్ ఇచ్చారు. క్రమశిక్షణతో కూడిన బౌలింగ్‌తో భారత అగ్రశ్రేణి బ్యాటర్లను కట్టడి చేశారు. ఓపెనర్ అభిషేక్ శర్మ పరుగులేమీ చేయకుండానే తొలి ఓవర్లోనే పెవిలియన్ బాట పట్టగా, తర్వాత ఓవర్లలో సంజు శాంసన్(9), ఇషాన్ కిషన్(3) కూడా త్వరగానే ఔటయ్యారు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ 12 బంతుల్లో 16 పరుగులు చేసి ఓవర్ చివరలో ఔట్ అవ్వడంతో భారత్ నిర్ణీత 5 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 32 పరుగులు మాత్రమే చేయగలిగింది. అనంతరం 33 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన జపాన్ ను భారత బౌలర్లు కట్టడి చేశారు. జపాన్ బ్యాటర్లు ధీటుగా పోరాడినప్పటికీ, నిర్ణీత 5 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 30 పరుగులకే పరిమితమయ్యారు. చివరి బంతికి జపాన్ గెలుపునకు 4 పరుగులు అవసరం కాగా, అక్షర్ పటేల్ ఒత్తిడిని జయించి కేవలం ఒక పరుగు మాత్రమే ఇవ్వడంతో భారత్ ఊపిరి పీల్చుకుంది.




## మహిళల బ్యాడ్మింటన్‌లో
# ఉన్నతి, సింధు ఓటమి

**ఇచినోమియా సిటీ:** ఇచినోమియాలో మంగళవారం జరిగిన ఆసియా క్రీడల క్వార్టర్ ఫైనల్‌లో, పివి సింధు, ఉన్నతి హూడా తమ తమ సింగిల్స్ మ్యాచ్‌లలో ఓడిపోవడంతో భారత మహిళల బ్యాడ్మింటన్ జట్టు జపాన్‌పై 0-2తో వెనుకబడింది. ఉన్నతి బలంగా ప్రారంభించి తొలి గేమ్‌లో 11-10 ఆధిక్యంలో నిలిచింది. అయితే జపనీస్ షట్లర్ తిరిగి పుంజుకుని, ఆ గేమ్‌ను 21-16 తేడాతో కైవసం చేసుకుంది. రెండో గేమ్‌లోనూ ఉన్నతి మరోసారి అద్భుతంగా ప్రారంభించి 11-4 ఆధిక్యాన్ని సాధించింది. గేమ్ సాగేకొద్దీ జపాన్ పుంజుకోవడంతో, ఉన్నతి చివరికి 15-16తో వెనుకబడింది. ఆమె పట్టు సాధించలేకపోవడంతో జపాన్ క్రీడాకారిణి 21-18 తేడాతో గేమ్‌ను ముగించి మ్యాచ్‌ను కైవసం చేసుకుంది. అంతకుముందు, సింధు అకానె యమగుచి చేతిలో 23-21, 18-21, 11-21 తేడాతో తొలి గేమ్ కోల్పోయింది. 6-10తో వెనుకబడిన సింధు, నుంచి కోలుకుని స్కోరును 12-12తో సమం చేసింది. ఆ తర్వాత 15-18తో వెనుకబడినప్పటికీ పుంజుకుని, ఒక గేమ్ పాయింట్‌ను కాపాడుకుని, గేమ్‌ను 23-21తో కైవసం చేసుకుంది. సింధు 12-17తో వెనుకబడిన స్కోరును 16-18కి తగ్గించిన తర్వా త, రెండవ గేమ్‌లో యమగుచి పుంజుకుంది. ఈ జపనీస్ షట్లర్ తన ఆధిక్యాన్ని తిరిగి సాధించి 21-18 తేడాతో గెలిచింది. నిర్ణయాత్మక సెట్‌లో యమగుచి 11-4 ఆధిక్యం సాధించి, చివరికి 21-11 తేడాతో విజయాన్ని పూర్తి చేశాడు.

# పురుషుల హాకీలో భారత్ విక్టరీ



## శ్రీలంక 16-1 తేడాతో చిత్తు

**కకమిగహారా:** ఆసియా క్రీడల పురుషుల హాకీ పోటీలలో భారత్ తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తూ, మంగళవారం జరిగిన పోరులో శ్రీలంకను 16-1 తేడాతో చిత్తుగా ఓడించింది. భారత్ ఆరంభం నుంచే ఆటపై పట్టు సాధించి, ఐదవ నిమిషంలో గోల్ చేసింది. జర్మన్‌ప్రీత్ సింగ్ పంపిన బంతిని మన్‌దీప్ సింగ్ గోల్ చేశాడు. (10వ) జుగ్రాజ్ పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచి ఆధిక్యాన్ని రెట్టింపు చేశాడు. తర్వాత హర్మన్‌ప్రీత్ సింగ్ పంపిన లాంగ్ బాల్‌ను జర్మన్‌ప్రీత్ అందుకుని గోల్ చేసి స్కోరును 3-0కి చేర్చాడు. పెనాల్టీ కార్నర్‌ను (15వ) గోల్‌గా మలచి హర్మన్ స్కోరు చేయగా, అభిషేక్ మళ్లీ గోల్ చేసి 5 గోల్స్ ఆధిక్యాన్ని అందించాడు. మరో పెనాల్టీ కార్నర్ ద్వారా (22వ) జుగ్రాజ్ తన 2వ గోల్ సాధించాడు. రెండవ క్వార్టర్ ముగిసేలోపు దిల్‌ప్రీత్ సింగ్ స్కోరును 8-0కి చేర్చాడు. మూడవ క్వార్టర్‌లో (31వ) మన్‌ప్రీత్ సింగ్ డ్రాగ్‌ఫ్లిక్‌తో గోల్ చేయగా, వివేక్ ప్రసాద్ కూడా గోల్ సాధించాడు. సుఖ్‌జీత్‌తో కలిసి దిల్‌ప్రీత్ (38వ) తన 2వ గోల్ సాధించగా, (42వ) పెనాల్టీ స్ట్రోక్‌ను గోల్‌గా మార్చి జుగ్రాజ్ హ్యాట్రిక్ పూర్తి చేశాడు. భారత్‌కు వరుసగా మూడో పెనాల్టీ కార్నర్ లభించడంతో (44వ) హర్మన్‌ప్రీత్ మళ్లీ గోల్ చేసి స్కోరును 13-0కి చేర్చాడు. ఆఖరి పీరియడ్‌లో (49వ) 14వ గోల్ చేసి అభిషేక్ హ్యాట్రిక్‌ను పూర్తి చేశాడు. ఆ తర్వాతి సురేష్ రత్నాయకే అద్భుతమైన టోమాహాక్ ఫినిషింగ్‌తో స్కోరును 14-1కి చేర్చడంతో శ్రీలంకకు ఎట్టకేలకు బ్రేక్‌త్రూ లభించింది. అయితే (53వ) జుగ్రాజ్ మరో పెనాల్టీ స్ట్రోక్‌ను గోల్‌గా మలిచి తన నాలుగు గోల్స్ ను పూర్తి చేసుకున్నాడు. తదుపరి మన్‌దీప్ అద్భుతమైన స్టిక్ వర్క్‌తో దిల్‌ప్రీత్ 3వ గోల్‌ను సాధించాడు. దీంతో భారత్ పూల్ ఎలో వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది.



## టేబుల్ టెన్నిస్‌లో ఉత్తర కొరియా
# విజయం
### 3-0 తేడా ఓటమితో భారత్ నిష్క్రమణ

**నగోయా:** ఉత్తర కొరియా చేతిలో 0-3 తేడాతో ఓటమి పాలైన భారత మహిళల టేబుల్ టెన్నిస్ జట్టు, 2026 ఆసియా క్రీడల టీమ్ ఈవెంట్ నుండి పతకం లేకుండానే నిష్క్రమించింది. మంగళవారం జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో అకుల శ్రీజ, యశస్విని ఘోర్పడే, దియా చితాలే అందరూ వరుస గేమ్‌లలో ఓటమి పాలవ్వడంతో, ఉత్తర కొరియా క్లీన్ స్వీప్ పూర్తి చేసి ఈ టోర్నమెంట్‌లో భారత్ ప్రస్థానానికి ముగింపు పలికింది. గత రౌండ్‌లో థాయ్‌లాండ్‌పై భారత్ కష్టపడి సాధించిన విజయంలో కీలక పాత్ర పోషించిన శ్రీజ, కుమ్ యోంగ్ కిమ్‌తో తలపడిన తొలి భారత క్రీడాకారిణి. అయితే, ఆమె ఆ ఫామ్‌ను క్వార్టర్‌ఫైనల్‌లో కొనసాగించలేక, 7-11, 6-11, 5-11 తేడాతో 0-3 వద్ద ఓడిపోయింది. భారత్ 0-1తో వెనుకబడి ఉన్నప్పుడు, మ్యాచ్‌లో జట్టును నిలబెట్టే బాధ్యత యశస్వినిపై పడింది. ఆమె కూడా సాంగ్ గ్యోంగ్ ప్యోన్‌ను ఓడించడానికి చాలా కష్టపడింది. 4-11, 3-11, 6-11 తేడాతో ఓడిపోవడంతో ఉత్తర కొరియా 2-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. భారత్ పునరాగమన ఆశలను సజీవంగా ఉంచుకోవాలంటే, దియా చితాలే ఆ తర్వాత సు యోంగ్ చాపై మూడో మ్యాచ్ గెలవాల్సి వచ్చింది. అయితే, ఆమె 9-11, 7-11, 8-11 తేడాతో ఓడిపోవడంతో, ఉత్తర కొరియా 3-0 తేడాతో విజయం సాధించి, భారత మహిళల జట్టు ప్రయాణాన్ని ముగించింది.

# మహిళల క్రికెట్‌లో పాక్‌కు కాంస్యం

**నిస్షిన్ సిటీ :** ఆసియా గేమ్స్ 2026లో పాకిస్థాన్ మహిళల క్రికెట్ టీమ్ బ్రాంజ్ మెడల్ సాధించింది. బంగ్లాదేశ్‌తో మంగళవారం జరిగిన కాంస్య పోరులో సమష్టిగా రాణించిన పాకిస్థాన్ 31 పరుగుల తేడాతో గెలుపొందింది. పాకిస్థాన్ కెప్టెన్ ఫాతిమా సనా చేసిన 45 పరుగులు ఆ జట్టుకు విజయాన్నందించాయి. ఏడో స్థానంలో బ్యాటింగ్‌కు దిగిన ఫాతిమా సనా టెయిలండర్లతో కలిసి విలువైన భాగస్వామ్యాన్ని అందించింది. బౌలింగ్‌లో ఉమ్ ఈ హని తీన్మార్ బౌలింగ్‌తో బంగ్లా పతనాన్ని శాసించింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ మహిళల టీమ్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 145 పరుగులు చేసింది. కెప్టెన్ ఫాతిమా సనా(45), గుల్ ఫెరోజా(31), అలియా రైజ్(25), షావాల్ జుల్ఫికర్(17) డబుల్ డిజిట్ స్కోర్ చేయగా, మిగతా బ్యాటర్లు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. బంగ్లాదేశ్ బౌలర్లలో నహిదా అక్తర్(2/21), షోర్నా అక్తర్(2/16), రితు మోని(2/27) రెండేసి వికెట్లు, సంజిదా అక్తర్(1/28) ఒక వికెట్ పడగొట్టింది. అనంతరం బంగ్లాదేశ్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 114 పరుగులు చేసి ఓటమిపాలైంది. షార్మిన్ అక్తర్(46 నాటౌట్) పోరాడినా ఫలితం లేకపోయింది. కెప్టెన్ నిగర్ సుల్తాన(25) జిడ్డుగా ఆడింది. పాకిస్థాన్ బౌలర్లలో ఉమ్ ఈ హని(3/10) మూడు వికెట్లతో బంగ్లాదేశ్ పతనాన్ని శాసించగా, తస్మియా రుబాబ్, ఫాతిమాసనా, నష్రా సంధు, ఆయేషా జఫార్ తలో వికెట్ తీసారు.

# ఆసియా గేమ్స్‌లో భారత్‌కు స్వర్ణం

## టి20 మహిళా క్రికెట్ విజేతగా టీమిండియా

## ఫైనల్‌లో శ్రీలంకపై భారీ ఘనవిజయం

## క్రికెటర్లకు రాష్ట్రపతి, ప్రధాని అభినందనలు

**నిషిన్:** ఆసియా క్రీడల మహిళల టీ20 పోటీల్లో భారత జట్టు ఘన విజయాన్ని సాధించి పసిడి పతకాన్ని తన ఖాతాలో వేసుకుంది. నిషిన్‌లో మంగళవారం జరిగిన పోరులో శ్రీలంకను 147 పరుగుల తేడాతో చిత్తు చేసి భారత మహిళలు ఈ విజయాన్ని అందుకున్నారు. ప్రస్తుత ఆసియా క్రీడల్లో భారత్ కు ఇది మొదటి స్వర్ణ పతకం కావడం విశేషం. గతేడాది ఆసియా క్రీడల ఫైనల్లోనూ శ్రీలంకపైనే గెలిచి పసిడి సాధించిన టీమిండియా, ఇప్పుడు వరుసగా రెండోసారి ఛాంపియన్‌గా నిలిచి ఆసియాలో తమ ఆధిపత్యాన్ని చాటుకుంది. ఈ చారిత్రాత్మక పోరులో టాస్ గెలిచి ఫస్ట్ బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 216 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఓపెనర్లు స్మృతి మంధాన, షెఫాలీ వర్మ తొలి వికెట్‌కు 99 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి కొండంత స్కోరుకు గట్టి పునాది వేశారు. స్మృతి మంధాన కేవలం 45 బంతుల్లో 7 సిక్సర్లు, 5 ఫోర్లతో 79 పరుగులు చేసి విజృంభించగా, షెఫాలీ వర్మ 29 బంతుల్లో 48 పరుగులు సాధించింది. చివరిలో వికెట్ కీపర్‌బ్యాటర్ రిచా ఘోష్ కేవలం 22 బంతుల్లోనే 6 ఫోర్లు, 3 సిక్సర్లతో నాటౌట్ గా 49 పరుగులు చేసి జట్టు స్కోరును 200 దాటించింది.

అనంతరం 217 పరుగుల కొండంత లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంక ఆరంభం నుంచే క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయి ఏ దశలోనూ పోటీ ఇవ్వలేకపోయింది. శ్రీలంక కెప్టెన్ చమరి అటపట్టు 21 బంతుల్లో 29 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలవగా, మిగిలిన బ్యాటర్లు భారత బౌలర్ల ధాటికి చేతులెత్తేశారు. ఫలితంగా 15.4 ఓవర్లకే 69 పరుగులకే ఆలౌట్ అయి శ్రీలంక దారుణ ఓటమిని మూటగట్టుకుంది. దీంతో లంక జట్టు రజత పతకాన్ని తన ఖాతాలో వేసుకుంది.



# భారత్ జిడిపి వృద్ధి 6.7%

## ప్రపంచ ఆర్థిక వేదిక గ్లోబల్‌ట్రెండ్ నివేదిక వెల్లడి




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 22:** భారత ఆర్థిక వ్యవస్థకు సంబంధించి మరో సానుకూల అంచనా వెలువడింది. 2026-27 ఆర్థిక సంవత్సరంలో భారత్ జిడిపి వృద్ధి 6.7 శాతంగా ఉండొచ్చని వరల్డ్ ఎకనామిక్ ఫోరం చీఫ్ ఎకనామిస్ట్స్ ఔట్‌లుక్ నివేదిక తెలిపింది. దేశీయ డిమాండ్ బలంగా కొనసాగడం వృద్ధికి ప్రధాన కారణంగా పేర్కొంది. సెప్టెంబర్ 2026 నివేదిక కోసం ప్రభుత్వ, ప్రైవేటు రంగాలకు చెందిన 92 మంది చీఫ్ ఎకనామిస్టుల అభిప్రాయాలను సేకరించారు. వీరిలో 74 శాతం మంది భారత్‌లో ఆర్థిక వృద్ధి బలంగా లేదా చాలా బలంగా ఉంటుందని అంచనా వేశారు. మే నెలలో ఈ అభిప్రాయం 52 శాతంగా ఉంది. వచ్చే 12 నెలల్లో భారత్ వృద్ధి మోస్తరుగా లేదా అంతకంటే మెరుగ్గా ఉంటుందని 98 శాతం మంది భావించారు. ఉద్యోగాల విషయానికొస్తే వచ్చే 12 నెలల్లో నిరుద్యోగితలో మార్పు ఉండదని 70 శాతం మంది అంచనా వేశారు. ఆగస్టులో 15 యేళ్ల పైబడిన వారి నిరుద్యోగిత రేటు 5 శాతానికి తగ్గింది. జులైలో ఇది 5.1 శాతంగా ఉంది. ఇదే సమయంలో లేబర్ ఫోర్స్ భాగస్వామ్యం రేటు 55.4 శాతం నుంచి 55.6 శాతానికి పెరిగింది. ద్రవ్యోల్బణంపై కూడా అంచనాలు కొంత మెరుగయ్యాయి. వచ్చే యేడాది భారత్‌లో ద్రవ్యోల్బణం మోస్తరు స్థాయిలో ఉంటుందని 55 శాతం మంది ఎకనామిస్టులు భావించారు. 45 శాతం మంది మాత్రం అధికంగా ఉంటుందని అంచనా వేశారు. ఆగస్టులో రిటైల్ ద్రవ్యోల్బణం 4.8 శాతానికి చేరింది. ఇది ఆర్‌బిఐ లక్ష్యమైన 4 శాతానికి మించి ఉంది. అయితే 26 శాతం పరిమితిలోనే కొనసాగుతోంది. ద్రవ్య విధానంలో మార్పు ఉండదని 67 శాతం మంది అంచనావేశారు. ఆగస్టులో పాలసీ రేటును 5.25 శాతం వద్దే కొనసాగించారు. ఈ నివేదిక సర్వే ఆగస్టు 20న పూర్తయింది. ఆ తర్వాత ఆగస్టు 31న విడుదలైన గణాంకాల్లో 2026-27 తొలి త్రైమాసికంలో భారత్ జిడిపి వృద్ధి 7.8 శాతంగా నమోదైంది. దీంతో పలు సంస్థలు తమ వృద్ధి అంచనాలను పెంచుతున్నాయి. మూడీస్ కూడా తన అంచనాను 6 శాతం నుంచి 7 శాతానికి పెంచింది.

# ఎన్‌ఎస్‌ఇ ఐపిఒకు భారీ స్పందన

## 5.71 రెట్లు బిడ్లు దాఖలు



**ముంబై, సెప్టెంబరు 22:** నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఐపిఒకు భారీ స్పందన లభించింది. బిడ్డింగ్‌కు చివరి రోజు ముగిసే సమయానికి ఐపిఒ మొత్తం 5.71 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. దాదాపు 22,560 కోట్ల విలువైన ఆఫర్ ఫర్ సేల్‌లో భాగంగా అందుబాటులో ఉన్న 8.86 కోట్ల షేర్లకు గాను 50.58 కోట్ల షేర్లకు బిడ్లు వచ్చినట్లు బిఎస్‌ఇ గణాంకాలు వెల్లడించాయి. క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ బయ్యర్లు నుంచి అత్యధిక స్పందన వచ్చింది. వారికి కేటాయించిన 2.52 కోట్ల షేర్లకు గాను దాదాపు 32 కోట్ల షేర్లకు బిడ్లు రావడంతో ఈ విభాగం 12.68 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. ఈ విభాగంలో విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు సుమారు 14.03 కోట్ల షేర్లకు, బ్యాంకులు, బీమా సంస్థలు సహా దేశీయ ఆర్థిక సంస్థలు 6.8 కోట్ల షేర్లకు, మ్యూచు వల్‌ఫండ్లు 5.41 కోట్ల షేర్లకు బిడ్లు దాఖలు చేశాయి. నాన్‌ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్లు కూడా ఐపిఒపై గణనీయమైన ఆసక్తి కనబరిచారు. ఈ విభాగానికి కేటాయించిన 1.89 కోట్ల షేర్లకు గాను 12.38 కోట్ల షేర్లకు బిడ్లు రావడంతో మొత్తం 6.55 రెట్లు సబ్‌స్క్రిప్షన్ నమోదైంది.10 లక్షలకు పైగా పెట్టుబడి పెట్టిన ఇన్వెస్టర్ల విభాగం 7.78 రెట్లు,2 లక్షల నుంచి 10 లక్షల వరకు పెట్టుబడి పెట్టిన చిన్న ఎన్‌ఐఐ బిడ్లు 4.09 రెట్లు సబ్‌స్క్రైబ్ అయ్యాయి మార్కెట్ అంచనాల ప్రకారం, గరిష్ఠ ధరల శ్రేణి వద్ద ఎన్‌ఎస్‌ఇ ఐపిఒకు సుమారు 90,300కోట్ల విలువైన డిమాండ్ లభించినట్లు తెలుస్తోంది.

# నాలుగురోజుల లాభాలకు బ్రేక్




## నష్టాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ

**ముంబయి, సెప్టెంబరు 22:** దేశీయ స్టాక్ మార్కెట్లలో వరుసగా నాలుగు రోజులుగా కొనసాగిన లాభాల పరంపరకు మంగళవారం బ్రేక్ పడింది. కీలక సూచీలు నష్టాలతో ముగిశాయి. నిఫ్టీ 23,350 స్థాయి దిగువన ముగిసింది. ఐటీ, ఎఫ్‌ఎంసీజీ, పీఎస్‌యూ బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి మార్కెట్‌పై ప్రభావం చూపింది. మరోవైపు మెటల్, రియల్టీ షేర్లలో కొనుగోళ్లు కొంతమేర నష్టాలను తగ్గించాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలతో ఉదయం లాభాలతో ప్రారంభమైన మార్కెట్లు ఆ తర్వాత అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 100 డాలర్ల దిగువకు రావడం మార్కెట్‌కు కొంత ఊరటనిచ్చింది. బిఎస్‌ఇ సెన్సెక్స్ 329.91 పాయింట్లు నష్టపోయి 74,529.08 వద్ద ముగిసింది. ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 50 సూచీ 85.30 పాయింట్లు తగ్గి 23,329 వద్ద స్థిరపడింది. అంతకుముందు వరుసగా నాలుగు సెషన్లలో నిఫ్టీ 1.28 శాతం లాభపడింది. నిఫ్టీని ప్రధానంగా కిందికి లాగిన షేర్లలో లార్సెన్ అండ్ టూబ్రో (0.98 నష్టం), భారతి ఎయిర్‌టెల్ (0.71 నష్టం), రిలయన్స్ ఇండస్ట్రీస్ (0.56 నష్టం) ఉన్నాయి. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ విస్తృత మార్కెట్లో బిఎస్‌ఇ 150 మిడ్‌క్యాప్ సూచీ స్వల్పంగా 0.02 శాతం లాభపడగా, బిఎస్‌ఇ 250 స్మాల్‌క్యాప్ సూచీ 0.25 శాతం నష్టపోయింది. మార్కెట్‌లో అడ్వాన్స్ డిక్లైన్ రేషియో ప్రతికూలంగా ఉంది. బిఎస్‌ఇలో 2,174 షేర్లు లాభపడగా, 2,189 షేర్లు నష్టపోయాయి. మరో 230 షేర్లలో ఎలాంటి మార్పు లేదు. కమోడిటీ మార్కెట్లో నవంబర్ 2026 డెలివరీ బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 2.64 డాలర్లు తగ్గి 97.70 డాలర్లకు చేరింది. అమెరికా 10 ఏళ్ల ట్రెజరీ బాండ్ ఈల్డ్ 0.75 శాతం తగ్గి 4.927 శాతానికి చేరింది. భారత్‌లో 10 యేళ్ల బెంచ్‌మార్క్ ప్రభుత్వ బాండ్ ఈల్డ్ 0.62 శాతం తగ్గి 7.010 శాతానికి వచ్చింది. గత సెషన్‌లో ఇది 7.054 శాతంగా ఉంది. ఫారెక్స్ మార్కెట్లో రూపాయి స్వల్పంగా బలపడింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి 95.5800 వద్ద ట్రేడవగా, గత సెషన్‌లో ఇది 95.7800 వద్ద ముగిసింది. ఎంసీఎక్స్‌లో అక్టోబర్ 5, 2026 డెలివరీ గోల్డ్ ఫ్యూచర్స్ 0.39 శాతం తగ్గి రూ.1,52,500కు చేరాయి. మీషో 9.66 లాభంతో రూ.240.20,కోల్ ఇండియా 3.35 లాభంతో రూ.428.40,ట్రాన్స్‌రైల్ లైటింగ్ 14.44శాతం పెరుగుదల నమోదుచేసాయి.పేస్ డిజిటెక్ 9.12 శాతం లాభపడింది. ఆగ్మాంట్ ఎంటర్‌ప్రైజెస్: 4.81 క్షీణించింది. సింబయోటెక్ ఫార్మాల్యాబ్: 3.29 క్షీణత పుర్వాంకారా 0.52 లాభపడింది.

# డాలర్‌తో పోలిస్తే 13 పైసలు బలపడిన రూపాయి



**ముంబయి, సెప్టెంబరు 22:** అమెరికా డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి మంగళవారం ప్రారంభ ట్రేడింగ్‌లో 13 పైసలు బలపడి రూ.95.65కు చేరుకుంది. ముడిచమురు ధరలు తగ్గుముఖం పట్టడం, దేశీయ స్టాక్ మార్కెట్లలో సానుకూల పరిస్థితులు రూపాయికి మద్దతుగా నిలిచాయి. ఫారెక్స్ ట్రేడర్ల ప్రకారం సరఫరాకు సంబంధించిన తక్షణ ఆందోళనలు కొంత తగ్గడంతో బ్రెంట్ క్రూడ్ ధరలు ఇటీవల పెరిగిన స్థాయిల నుంచి వెనక్కి వచ్చాయి. సౌదీ అరేబియా హార్ముజ్ జలసంధి ద్వారా చమురు ఎగుమతులను పెంచడం, దెబ్బతిన్న ఈస్ట్‌వెస్ట్ పైప్‌లైన్‌ను కొంతమేర పునరుద్ధరించే అవకాశాలపై మార్కెట్లలో ఆశావహ పరిస్థితులు నెలకొనడంకూడా రూపాయికి అనుకూలంగా మారాయి. ఇంటర్‌బ్యాంక్ విదేశీ మారకద్రవ్య మార్కెట్‌లో రూపాయి 95.75 వద్ద ప్రారంభమై, ఆ తర్వాత 95.65 స్థాయికి చేరుకుంది. ఇది గత ముగింపుతో పోలిస్తే 13 పైసల లాభం. సోమవారం రూపాయి 18 పైసలు బలపడి డాలర్‌కు రూ.95.78 వద్ద ముగిసింది. కోటక్ సెక్యూరిటీస్ కమోడిటీ అండ్ కరెన్సీ రీసెర్చ్ హెడ్ అనింద్య బెనర్జీ మాట్లాడుతూ, రూపాయి ప్రస్తుతం పరిమిత శ్రేణిలోనే కదులుతోందని తెలిపారు. ముడిచమురు ధరలు తగ్గడం రూపాయికి ప్రధాన మద్దతుగా ఉండగా, ఫెడ్ వడ్డీ రేటు పెంపు తర్వాత డాలర్ బలపడటం, విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడుల ఉపసంహరణ కొనసాగడం ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని పేర్కొన్నారు. రూపాయి డాలర్ మారకపు జంటకు 96.30 స్థాయిపై పరిమితిగా ఉండవచ్చని, ఈ స్థాయి సమీపంలో రిజర్వ్ బ్యాంక్ జోక్యం పెరిగే అవకాశం ఉందని బెనర్జీ తెలిపారు. 95.50, ఆ తర్వాత 95 స్థాయిల వద్ద రూపాయికి మద్దతు లభించే అవకాశం ఉందన్నారు. ప్రత్యేక డిపాజిట్‌ల ద్వారా ఏర్పడిన అదనపు లిక్విడిటీని బాండ్ విక్రయాలు, రివర్స్ రెపో వేలం ద్వారా రిజర్వ్ బ్యాంక్ చురుకుగా ఉపసంహరిస్తోందని, దీంతో మార్కెట్‌లో సర్దుబాటు క్రమబద్ధంగా కొనసాగుతోందని ఆయన వివరించారు. మరోవైపు, సోమవారం విడుదలైన ప్రభుత్వ గణాంకాల ప్రకారం దేశంలోని తొమ్మిది కీలక మౌలిక సదుపాయాల రంగాల ఉత్పత్తి ఆగస్టులో మూడు నెలల కనిష్ఠ స్థాయికి పడిపోయింది. ఆగస్టులో ఈ రంగాల ఉత్పత్తి వృద్ధి 4.8 శాతంగా నమోదైంది. బొగ్గు, సహజ వాయువు, ముడిచమురు, ఎరువుల ఉత్పత్తి తగ్గడం ఇందుకు ప్రధాన కారణంగా నిలిచింది.

# ఒక్కరోజే రూ.2.39 లక్షల కోట్లు పెరిగిన జుకర్‌బర్గ్ సంపద



**కాలిఫోర్నియా, సెప్టెంబరు 22:** ఫేస్‌బుక్ మాతృసంస్థ మెటా సిఇఒ మార్క్ జుకర్‌బర్గ్ సంపద ఒక్కరోజులోనే అమాంతం పెరిగింది. ఆయన ఏకంగా 25 బిలియన్ డాలర్లు (భారత కరెన్సీలో సుమారు రూ. 2.39లక్షల కోట్లకుపైగా ఆర్జించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో మెటా ప్రకటించిన కొత్తప్రణాళికలతో కంపెనీ షేర్లు దాదాపు 12శాతం పెరగడమే ఇందుకు ప్రధాన కారణం. ఈ భారీ పెరుగుదలతో జుకర్‌బర్గ్ మొత్తం సంపద సుమారు 253.6 బిలియన్ డాలర్లకు చేరినట్లు ఫోర్బ్స్ అంచనా వేసింది. ఈ అనూహ్య లాభంతో జుకర్‌బర్గ్ ఫోర్బ్స్ రియల్‌టైమ్ బిలియనీర్ల జాబితాలో ఆరవ స్థానానికి ఎగబాకారు. సోమవారం ట్రేడింగ్ సెషన్‌లో టెస్లా సిఇఒ ఎలాన్ మస్క్ సంపద 12 బిలియన్ డాలర్లు పెరగ్గా, జుకర్‌బర్గ్ అంతకుమించి లాభపడటం గమనార్హం. ప్రముఖ బ్రోకరేజ్ సంస్థ వెల్స్ ఫార్గో, మెటా షేర్ల టార్గెట్ ధరను 640 డాలర్ల నుంచి 796 డాలర్లకు పెంచడంతో ఇన్వెస్టర్లలో ఉత్సాహంపెరిగింది. మెటా ఇటీవల ప్రారంభించిన మ్యూజ్ అనే కొత్త ఎఐ ఏజెంట్‌కు వినియోగదారుల నుంచి మంచి స్పందన వస్తుండటమే ఈ సానుకూల అంచ నాలకు కారణమని వెల్స్‌ఫార్గో తన రిపోర్ట్‌లో పేర్కొంది. కేవలం ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడమేకాకుండా వినియోగదారుల తరఫున పనులుకూడాచేసేలా మ్యూజ్‌ను రూపొందించారు. ఈమెయిల్స్ పంపడం, ప్రయాణ బుకింగ్స్‌చేయడం, ఇతర యాప్‌లతో సమన్వయం చేసుకుని టాస్కులు పూర్తి చేయడం వంటివి ఈ ఎఐ అసిస్టెంట్ చేయ గలదు. ఈనెల 23, 24 తేదీల్లో జరగనున్న మెటా కనెక్ట్ 2026 వార్షిక సదస్సుపై పరిశ్రమ వర్గాల్లో ఆసక్తినెలకొంది. మెటా తమ ఎఐ ఏజెంట్లు, కొత్త సాఫ్ట్‌వేర్ ఫీచర్లు, స్మార్ట్ వేరబుల్ పరికరాల్లో సాధించిన పురోగతిని ప్రదర్శిస్తుందనిఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# రూ.2వేల లోపు లావాదేవీలకు ఎలాంటి ఛార్జీలులేవు

## యుపిఐ చెల్లింపులకు జిఎస్టి ప్రచారంపై ఎన్‌పిసిఐ వివరణ




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 23:** యుపిఐ ద్వారా చేసే చెల్లింపుల్లో మర్చంట్ డిస్కౌంట్ రేట్‌పై జిఎస్టి విధిస్తారని, దీనివల్ల డిజిటల్ చెల్లింపులు ఖరీదుగా మారతాయని, ముఖ్యంగా చిన్న వ్యాపారులపై భారం పడుతుందని కొన్ని మీడియా మాధ్యమాలలో వస్తున్న వార్తలను నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఖండించింది. ఈ ఆందోళనలు పూర్తిగా అవాస్తవమని, అపోహలు మాత్రమేనని ఒక ప్రకటనలోస్పష్టం చేసింది. ఎండిఆర్ అనేది కేవలం రూ.2,000 కంటే ఎక్కువ విలువైన పర్సన్ టు మర్చంట్ లావాదేవీలకు మాత్రమేవర్తిస్తుంది. రూ.2,000 వరకు జరిపే లావాదేవీలకు ఎలాంటి ఎండిఆర్ లేనందున, వాటిపై జిఎస్టి ప్రభావం కూడా ఉండదని స్పష్టంచేసింది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం దేశంలో జరిగే మొత్తం యుపిఐ మర్చంట్ లావాదేవీల్లో 96పైగా రూ.2,000 లోపువేనని, అందువల్ల అత్యధిక లావాదేవీలపై ఈ మార్పు ప్రభావం ఏమాత్రం ఉండదని పేర్కొంది. నెలకు లక్ష రూపాయల వరకు యుపిఐ ద్వారా చెల్లింపులు స్వీకరించే చిన్న వ్యాపారులు ఎండిఆర్ చెల్లించాల్సిన అవసరంలేదని, కాబట్టి వారికి జిఎస్టి సమస్యే ఉత్పన్నంకాదని తెలియజేసింది. ఒకవేళ రూ.2,000పైబడి లావాదేవీలు జరిపి ఎండిఆర్ చెల్లించే వ్యాపారులు దానిపై జిఎస్‌టి కట్టినా, ఆమొత్తాన్ని వారు విక్రయించే వస్తువులపై చెల్లించాల్సిన జిఎస్‌టి నుంచి మినహాయింపు (ఇన్‌పుట్‌ట్యాక్స్ క్రెడిట్) పొందవచ్చని వివరించింది. ఫలితంగా, వ్యాపారులపై జిఎస్‌టి భారం ఉండదని ఎన్‌పిసిఐ స్పష్టం చేసింది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 1 -187, Kushalpuram, Srikakulam Dist. PIN: 532005 Ph. 270684, 271144, 9848387562 Fax : 08942–271146, RNI No. AP TEL/2004/13708 Editor :*Damerla Sai Baba *Responsible for selection of News under the PRB Act. Regd.: No.J/RNP/VM111 Air Surcharge: Delhi : 40 Ps.